
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY
4 అణాలు 7-3-56



"గొడుగుల్లో మనుషులు"

—చిత్రకారుడు: కేతిసెడి భాస్కరరావు, విజయనగరం.



మార్చి 9 విడుదల
శ్రీ రాజ రాజేశ్వరీ ఫిలిం కంపెనీ వారి.....
నాగపంచమి
(తెలుగు)
అంజలి · యస్.వరలక్ష్మి · కన్నాంబ
నాగయ్య నటించిన
మహా పతివ్రత గాథ.....
దర్శకుడు · కె.బి.నాగభూషణం

విషయానుక్రమణిక

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 27
7-3-56

మన్మథ మాఘ బహుళ దశమి బుధవారం

న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ
(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ వ్యవహారంపై తర్జనభర్జనలు సాగుతూనే ఉన్నాయి. వీటివల్ల స్థూలంగా రెండు విషయాలు తేలాయి. అసలు ఈ ఫజలాలీ సంఘ నివేదిక విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన విధం, చేసిన ఏర్పాట్లు ఉండవలసినంత కట్టుదిట్టంగా లేవు ఇంక రెండవది, కొన్ని ప్రాంతాలలో రాష్ట్రాలు నెలకొల్పాలన్న సిద్ధాంతం సిద్ధాంతంమటుకు అమోఘంగా ఉందిగాని, దీనికి పురిట్లోనే సంధికొట్టినట్టే. ఇది ప్రజలకు అంగీకారయోగ్యం కావాలంటే, ప్రబోధాత్మకమైన ప్రచారం బాగా జరగవలసి ఉంటుంది. ఎందుకంటే భాషాప్రయుక్త రాష్ట్రవాదం ఈనాటిది కాదు. ఒక కాంగ్రెసు నాయకుని మాటలలో చెప్పాలంటే, ఈ భాషారాష్ట్రవాదం ముప్ఫైఏళ్లుగా అందరికీ వంటబట్టిపోయింది. ఈ బృహద్వ్యవహారంలో ఆంధ్రులు సాధించిన మరొక విజయం విశాలాంధ్ర.

విశాలాంధ్ర అవతరణ ఖాయమే. రేపు అక్టోబరునాటికి ఇది ఏర్పాటు అవుతోంది. వీధిపడి కొట్టుకోకుండా సంప్రతింపుల ద్వారా, రాజీమార్గాలద్వారా ఈ విశాలాంధ్ర అవతరిస్తున్నది.

సంప్రతింపుల ఫలితంగా, ఈ క్రింది విధమైన ఏర్పాట్లు జరిగాయి:

(1) తెలంగాణా ప్రయోజనాలు పరిరక్షించే నిమిత్తం. ప్రాంతీయ మండలిలో తెలంగాణా సభ్యులకు ఎక్కువ ప్రాతినిధ్యం ఇస్తారు.


(2) ప్రాజెక్టుల నిర్మాణంలోకూడా తెలంగాణాకు చెందిన వాటికి ప్రాముఖ్యం ఉంటుంది.

(3) మంత్రివర్గంలో స్థానాలు, ఉద్యోగాలు, జనాభా నిష్పత్తిని బట్టి కేటాయిస్తారు.

పంజాబ్ రాష్ట్రానికికూడా ఇదేపద్ధతిలో ఏర్పాట్లు జరుగవచ్చు. ఇప్పటి ప్రతిపాదనల ప్రకారం, పంజాబ్, పెప్సు, హిమాచల ప్రదేశ్‌లను కలిపి నెలకొల్పే ఈరాష్ట్రానికి ఏర్పాటయే ప్రాంతీయ మండలిలో, సిక్కులకు అధిక ప్రాతినిధ్యం ఉంటుంది.

ఊహ మంచిదే

భారత ప్రభుత్వ కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ అయిన శ్రీ ఎ. కె. చాందా ఈ మధ్య మూడు సందర్భాలలో చేసిన ప్రసంగాలపై ఇక్కడ విమర్శలు వ్యాఖ్యలు వినబడుతున్నాయి. మంచో చెడ్డో, మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బ్రిటిష్ వ్యవస్థ ప్రాతిపదికగా రూపొందించబడింది. అయితే బ్రిటన్‌లో ఏ ఆడిటర్ జనరలూ ఇంతవరకూ ఎన్నడూ ఆదేశం పరిపాలనా వ్యవస్థ స్వరూపం ఎలాఉండాలో సలహాయిస్తూ ఉపన్యసించలేదు. అందుకు అక్కడెవరూ అనుమతించినట్టు లేదు. పోతే, అటువంటి అధికారి ఏనాడూ ఢిల్లీ వచ్చి ఇక్కడి బ్రిటిషు హైకమిషన్ కార్యాలయంలో జమా



మావ్లంకర్

లోక్‌సభ సభాపతిగా, భారత ప్రజాస్వామిక వ్యవస్థలో సత్సంప్రదాయాలను తీర్చి దిద్దిన సిద్ధహస్తుడు, శ్రీ గణేశ్ వాసుదేవ్ మావ్‌లంకర్, గుండె జబ్బువల్ల ఫిబ్రవరి 27-వ తేదీ ఉదయం 7-45 గంటలకు మరణించారు. ఆయన వయస్సు 68 సంవత్సరాలు. చిత్తశుద్ధి గల నిర్మాణ కార్యకర్తగా ప్రజల నాయకుల మన్ననలందుకున్న శ్రీ మావ్‌లంకర్‌ను గాంధీజీ 'బేబీ' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. తోటివారంతా 'దాదాసాహెబ్' అనేవారు. మన దేశంలో ప్రజాస్వామ్య విహిత శాసన నిర్మాణ సంప్రదాయాలు తీర్చి దిద్దిన 'ఆదిపురుషు' డని ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ, ప్రతిపక్షాల హక్కులను కాపాడి ప్రజాస్వామ్యాన్ని సుస్థిరంచేసిన మహనీయుడని ప్రతిపక్ష నాయకులు పలువురూ 'దాదాసాహెబ్'కు జోహారులర్పించారు.

★ న్యూఢిల్లీ లేఖ ★

క్కులు తనిఖీచేసిన సందర్భాలు అంతకన్న లేవు.

కాగా ఇప్పుడు, శ్రీ చాందా ఇండియన్ సివిల్ సర్వీస్ ఉద్యోగులలో భారతీయులకు స్టర్లింగులో పెన్షన్ చెల్లించడం తగదని ఘోషిస్తున్నారు.

విదేశాంగ శాఖోద్యోగ నిబంధనల క్రింద లభించే హక్కులూ సదుపాయాలూ సంపాదించుకుని, ఇప్పుడున్న ఈ సదుపాయాలు వదిలేసుకోమని ఒక ఐ. సి. ఎస్. ఉద్యోగి, సాటి ఉద్యోగికి నచ్చచెబుతున్నాడు. ఇది కనక సాగినస్తే, విదేశాంగ శాఖ ఉద్యోగ నిబంధనల ప్రకారం, ఆ ఉద్యోగి రాబడి మీద పన్ను విధించరు. ఊహ మంచిదే...

విద్యాశాఖ కార్యదర్శి

కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి శ్రీ హుమయూన్ కబీర్ త్వరలోనే మంత్రి కాబోతున్నారు. అప్పుడే కార్యదర్శి పదవికి రాజీనామా ఇచ్చివేసి, పశ్చిమ బెంగాల్ నియోజక వర్గంనుండి రాజ్యసభకు ఎన్నిక అవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యాశాఖలో ఆయన పదవిని శ్రీ కె. జి. సైదియాన్ స్వీకరిస్తున్నారు. బ్రిటిష్ హయాంలో, ఒక ముస్లిం ఉద్యోగం నుండి తప్పుకుంటే, మరొక ముస్లింను నియమించడం ఒక సంప్రదాయం. ముస్లిమేతరుడు తప్పుకున్నప్పుడు కూడా ఒక ముస్లింను నియమించాలన్నది కూడా పరిపాటిగా ఉంటూ వచ్చింది. అల్పసంఖ్యాకులకు ఉద్యోగాలలో సముచిత ప్రాతినిధ్యం ఇవ్వడం అవసరం కనుక, ఇదేం కూడని పనికాదు. నిజానికి, దేశవిభజనానంతరం, ఉద్యోగాలలో ముసల్మానుల ప్రాతినిధ్యం చెప్పుకో తగినంతగా తగ్గిందికూడా. అందువల్ల ఇప్పుడు శ్రీ సైదయిన్ నియామకం విషయంలో ఎవరికీ ఎటువంటి ఆక్షేపణా ఉండదు. ఉన్నదల్లా ఒక ముస్లిం ఒక ఉద్యోగంనుండి తప్పుకున్నప్పుడు ఆ పదవినే మరొక ముస్లింకు ఇవ్వడంలోనే. అందువల్ల ఈయనను విద్యాశాఖ కార్యదర్శిగా కాక, మరొకశాఖకు బదలాయించడం జరగాలని భావించబడుతున్నది.

దీన్ని బట్టి, ఇంకా ఇతర నియామకాలను బట్టి, కాంగ్రెసేతర ముస్లిములకు బ్రిటిష్ హయాంలో దర్జాగా గడిచిందనే విషయం స్పష్టపడుతున్నది. ఇప్పుడూ వారికి దర్జాగానే గడుస్తోంది. జాతీయవాద ముస్లిములు, కాంగ్రెసు ముస్లిములు అప్పుడు ముస్లింలీగ్ చేతిలో పడిన ఆర్థిక, సాంఘిక కష్టాలే ఇప్పుడూ పడవలసివస్తోంది. బీగం కుద్సియా ఏమి దేశసేవచేసిందో తెలియదు. మరి బెంగాల్ శాసనసభ మాజీ స్పీకరు సయుద్ నౌషర్ అలీ ఏం పాపం చేసుకున్నారో తెలియదు. ఆయన పాకిస్తానుకు తరలిపోలేదు; భారతదేశాన్నే నమ్ముకున్నందువల్ల నష్టపడ్డాడు. రాజ్యసభలో హుమయూన్ కబీర్‌కు స్థానం కల్పించడం కోసం నౌషర్ అలీ తన స్థానం ఖాళీచేయవలసివస్తోంది.

ముస్లిములకు సంబంధించినంతవరకూ మౌలానా అబుల్‌కలాం ఆజాద్ మాటే చెల్లుతున్నది. ఆయన ఎవరు పేరిస్తే వారినే నియమించడం జరుగుతోంది. ఆయన మాట చెల్లరాదనికాదు. ఆయన సలహాలపై, జాతీయముస్లిములపట్ల ఆయన నిర్లక్ష్యంపై ఇది విమర్శ మాత్రమే.

* * *

ఢిల్లీ ముఖ్యమంత్రి సర్దార్ గురుముఖ్ నిహాల్ సింగ్ ఒక వ్యాసంలో ఇలా వ్రాశారు:

“1952 సెప్టెంబరులో ఢిల్లీరాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య పునర్వ్యవస్థీకరణ విచారణ సంఘాన్ని నియమించింది. ఈ సంఘం 1954 సెప్టెంబరులో ఒక సమగ్ర నివేదిక తయారుచేసి రాష్ట్రంలో ఆరోగ్య సౌకర్యాల అభివృద్ధికి కొన్ని సలహాలిచ్చింది. ఆస్పత్రి సౌకర్యాలు, ఆరోగ్య కేంద్రాలు, క్షయ చికిత్సాశాల ఎక్కువచేయడమే కాక, పరిసర పారిశుద్ధ్యం, మురికిపేటల పారిశుద్ధ్యం, శుభ్రమైన నీటి సరఫరా మున్నగువానిపై కూడా శ్రద్ధవహించాలని ఆ సంఘం సూచించింది.


మొదటి పంచవర్ష ప్రణాళికలో ఆరోగ్య శాఖక్రింద ఆస్పత్రుల, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి రూ. 181.14 లక్షలు ఖర్చుపెట్టాలని అంచనావేయబడింది.

ప్రస్తుతం సామాన్య వ్యాధులు, అంటు వ్యాధులు, క్షయ, ప్రసూతి మున్నగువానికై దాదాపు 27 ఆస్పత్రులు, నవీనవైద్య ఛరా యానికి 44 డిస్పెన్సరీలు, ఆయుర్వేద, యునాని వైద్యాలకు రెండు ఆస్పత్రులు, 41 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటన్నిటిలో 2,722 మంది రోగులకు చికిత్సా వసతులు ఉన్నాయి. మొదటి ప్రణాళిక అంతానికి 8,600 మందికి చికిత్సావసతులు ఏర్పడతాయని అంచనా. ప్రస్తుతం ఆరు ఆరోగ్య కేంద్రాలలో వైద్య సౌకర్యాలు ప్రజలకు లభిస్తున్నాయి.”

ఢిల్లీముఖ్యమంత్రి దాదాపు 27 ఆస్పత్రులని పేర్కొన్నారు. ఆయనకు సరిగ్గా ఎన్ని ఉన్నాయో తెలియదన్నమాట. ఆరోగ్య విచారణ సంఘంనివేదికను కూడా ఆయన పేర్కొన్నారు. ఆ నివేదికలో పారిశుద్ధ్యానికి, పరిశుభ్ర జలం సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఆ నివేదిక వెలువడిన దరిమిలా భారత రాజధానిలో కామెర్ల రోగం ప్రబలి అనేకులను బలిగొన్నది. విచారణసంఘం అశుభ్రజలం సరఫరా కావడం వల్లనే అది సంభవించిందని ఆరోపించింది. ఇక మురికిపేటల విషయమై, ఒక గోష్ఠి జరిగింది. అందులో స్థానిక భారతసేవక సమాజ అధ్యక్షుడు ఇలాగన్నారు:

“ఈనాడు ఢిల్లీ ఒక పెద్ద దుర్గంధ ప్రాంతంగా తయారైంది. పూర్వం అలా వుండేది కాదు. సుమారు 300 ఏండ్లక్రితం షాజహాన్ ఈ నగరం కట్టించిన రోజుల్లో ఆదర్శనగరంగా ఉండేది. మొగల్ సామ్రాజ్యపు అంతిమ దినాలలో కూడా బ్రిటిష్ బిషప్ హెబర్ ఢిల్లీనిగూర్చి వ్రాస్తూ, “ఈ నగరంలో రాజవీథులు చాలా విశాలము, సుందరమూ అయినవి. ఆసియా నగరాల స్థాయినిబట్టి పరిశుభ్రమైనవని కూడా చెప్పాలి. బజారులో అంగళ్లు చూడ ముచ్చటైనవి” అన్నాడు. ఆ తరవాత పతనం ప్రారంభమైంది. 1912 లో పాతఢిల్లీ మునిసిపల్ అధ్యక్షుడు కర్నల్ బీడన్ తన వార్షిక నివేదికలో వ్రాశాడు: “ఢిల్లీ ప్రజలు చాలీచాలని చోట ఇరుక్కుపోయారు. వీథుల మీదికి ఇళ్లు కడుతున్నారు. మురికిపేటలు చాలా లేచాయి. స్థలం ఖరీదు చాలా పెరిగిపోయి, ధనవంతులకు కూడ భవన నిర్మాణ

([illegible]-వ పేజీ చూడండి)



ప్రసిద్ధ శైవక్షేత్రాలలో ఒకటైన తిరువణ్ణామలైలో అరుణాచలేశ్వర దేవాలయం-తాలూకు గోపురం.
(ఈనెల 10 వ తేదీ మహాశివరాత్రి పర్వదినం. 20, 21, 22 పేజీలలో వ్యాసం, మరికొన్ని ఫొటోలు.
—ఫొటో: ఎన్. రామకృష్ణ.

దేవదాసి

(గతసంచిక తరవాయి)

8

సింహాన్ని ఎవరో మహా ధైర్యశాలి సంహరించి వేశాడనీ, కాని ఆ సంహరించిన మహావీరు డెవడో పాండ్ర వర్ధనరాజు చాటింపించిన రత్నఖచితఖడ్గం స్వీకరించడానికి కూడా రాలేదనీ పాండ్ర వర్ధన నగరంలో వదంతులు బయలుదేరాయి. క్రమంగా నాలుగయిదు రోజులు గడిచేసరికి ఆ వదంతులు చిత్రవిచిత్రంగా చిలవలు పలవలు వేశాయి. నగరం నగరం అంతటా ఇదే వార్త. ఆ వీరుడెవడో దేవదాసి వకుళమాలిక గృహంలో నివసిస్తున్నాడనికూడా కొందరు పసిగట్టారు. కాని ఎవ్వరికీ అతని దర్శనభాగ్యం లభించలేదు!

అయిదారు రోజులు గడిచేసరికి విజయవర్మ గాయాలు బాగా మానిపోయాయి. అతడు తన వసతిగృహంలో కొంచెం అటు, ఇటు పచారుచేయగలుగుతున్నాడు. కాని ఇంకా పూర్తిగా బలం కలగలేదు.

ఆ మరునాడు ప్రాతఃకాలమే వకుళమాలిక విజయవర్మ దగ్గరకు వచ్చింది. ఆనాడామె ముఖంలో ఏదో నూతనోత్సాహం వెల్లివిరిసింది.

విజయవర్మ కా నూతన వైఖరికి కారణం తెలియలేదు! వకుళమాలిక లోపలికి వస్తూనే అతనితో ఇలాగన్నది.

"మీ రెవరో నాకు తెలిసిపోయిందిలెండి!" విజయవర్మ ఈమాటకు దిగ్భ్రాంతుడయినాడు.

"ఎవరు చెప్పారు?"

"ఎవరో చెప్పనక్కరలేదు! నాకే తెలిసింది! మీ హస్తంలోని సామ్రాజ్య రేఖలే చెబుతున్నాయి!"

ఈ మాటతో అతనికి తిరిగీ కొంచెం ఊరట కలిగింది.

"నీకు సాముద్రికంలో కూడా ప్రవేశం ఉందా?"

"ఏదో కొంచెం ఉంది."

తరవాత అతడామెకు కుడిచేయి అందిచ్చాడు. అది ఆమె ఎంతో ఆప్యాయంగా చేతిలో పట్టుకొన్నది! ఇన్నాళ్లనుంచీ విజయవర్మ ఆమెకు స్పర్శావకాశమైనా కలగకుండా దూరదూరంగా తొలగిపోతున్నాడు. అతనికి గాయాలకు కట్లు కట్టినప్పుడుమాత్రమే ఆమెకతని స్పర్శభాగ్యం లభించేది. ఇప్పు డతడే స్వయంగా చేయి అందిచ్చినందు కామె లోలోపల ఎంతో మురిసిపోయింది. సాముద్రిక పరిశీలన మిషతో చాలా సేపటివరకు ఆమె అతని హస్తస్పర్శానందం అనుభవించింది. ఆ హస్తం స్పృశించగానే ఆమె శరీరమంతా ఒక్కసారిగా జల్లని పులకరించింది. అలాగ కొంతసేపతని హస్తరేఖలు పరిశీలించి ఒక్క చిరునవ్వు నవ్వి అతని ముఖవైఖరి పరీక్షిస్తూ మెల్లిగా ఇలాగన్నది: "మీరు సామాన్య యోధులు మాత్రం కారు! అది నాకిప్పుడు తెలిసిపోయింది! మీరు సాక్షాత్తు కాశ్మీర దేశాధీశ్వరులు! మీ నామధేయం జయాపీడ చక్రవర్తి!"

ప్రాచీన గాథాలహరి

ఈ మాట వినగానే విజయవర్మ నోట మాట లేక అలాగే నిర్ఘాంతపోయాడు!

"ఇది నీకేలాగ తెలిసింది?"

"నేను చెప్పినది నిజమే నా?"

"ముందు నే నడిగినదానికి సమాధానం చెప్పాలి!"

"నా ప్రశ్నకు సమాధానం చెబితే నేగాని నేను చెప్పను!"

వకుళమాలిక మాతి బిగించింది.

పి. గణపతిశాస్త్రి

విజయవర్మ కొంచెంసేపు తటపటాయించి నెమ్మదిగా—

"నీ వన్నది నిజమే! కాని నీకీ విషయం ఎలాగ తెలిసింది!" అన్నాడు.

"మీ హస్తరేఖలే చెబుతున్నాయి!" అన్నది కొంచెం కొంటెగా.

"నా హస్తరేఖలవల్ల కొంతవరకు భాగ్య భోగాలు తెలుసుకోవచ్చును! అంతేకాని నా పేరెలాగ తెలిసింది?"

"నగరంలో కొందరికి మీవృత్తాంతం కర్ణాకర్ణిగా తెలిసిపోయింది!"

జయాపీడు డీ మాటలు విని ప్రాన్పడిపోయాడు.

"నగరంలో ఈ సంగతి ఎలాగ పొక్కిందో!"

"మీ రా సింహాన్ని సంహరించినపుడు మీ మోచేతి కవచం దాని కోరలలో చిక్కుపడిపోయింది. మరునాడు రాజభటులా కవచం పరిశీలించారట! దాని లోపలి భాగంలో మీ నామధేయం కనబడినదట! ఇప్పటికయినా యథార్థం తెలియజేస్తే మీప్రాణ సంరక్షణకేదైనా ఉపాయం ఆలోచించవచ్చును! ఆపైన తమదయ!" అని ఎంతో జాలిగా ఆమె అతని కేసి చూసింది. జయాపీడు డిక నిజం కప్పిపుచ్చడంవల్ల ప్రయోజనం లేదని ఆమెతో తన విషయంఅంతా ఆమూలాగ్రంగా పూసగుచ్చినట్లు చెప్పివేశాడు. అతడామెతో చెప్పిన స్వీయవృత్తాంతం ఇది:

కాశ్మీరచక్రవర్తి జయాపీడదేవుడు రాజ్యాధికారం చేజిక్కించుకొన్న కొన్ని నెలల్లోనే తన రాజ్యానికి దక్షిణదిశలో ఉన్న రాజుల నందరినీ జయించవలెనని నిశ్చయించి సైన్యాలతో దక్షిణ దిగ్విజయయాత్రకు బయలుదేరాడు.

అతడా సైన్యాలతో కలిసి కాశ్మీర రాజధాని సింహద్వారం దాటి పోతూంటే పౌరులందరు ముక్తకంఠాలతో జయ జయ ధ్వానాలు చేశారు. జయాపీడుని పితామహుడు లలితాదిత్యుడు కూడా ఒకసారి

★ దేవదాసి ★

ఈవిధంగా దిగ్విజయయాత్రకు బయలు దేరాడు. సేనానాయకులలో వృద్ధులు కొందరు నాటి వైభవం అంతా జయాపీడునికి కన్నులకు గట్టినట్లు వర్ణించి చెప్పారు. అప్పుడు లలితాదిత్యచక్రవర్తి సపాద లక్ష కర్ణీరథాలతో దిగ్విజయయాత్రకు బయలుదేరాడనీ తమకిప్పుడు ఎనభైవేల కర్ణీ రథాలే ఉన్నాయనీ అయినా తమయోధులు పూర్వపు యోధులకంటె శస్త్రవిద్యలో ఆరితేరినవారనీ అందుచేత నాటికంటె నేటి దిగ్విజయం సులభతరం కాగలదనీ వారతనికి సవినయంగా విన్నవించారు.

జయాపీడు డా సేనావాహినితో క్రమ క్రమంగా కాశ్మీర రాజ్యానికి దక్షిణ భాగంలో ఉన్న రాజాల నందరినీ జయించివేశాడు.

కాని క్రమక్రమంగా ఆ సేనావాహిని ఇంకా ముమ్మందుకు చొచ్చుకుపోయిన కొద్దీ ఆ సైన్యం చాలావరకు తరిగిపోయింది. మార్గంలో జరిగిన ఘోరయుద్ధాలలో చాలా మంది సైనికులు యుద్ధభూమిలో మరణించారు.

క్రమక్రమంగా గౌడదేశం సరిహద్దులలో ప్రవేశించేసరికి సైన్యంలో మిగిలినవారు పాతిక వేలమందికంటె ఎక్కువ లేదు. ఇంతలో కాశ్మీర రాజ్యానికి జ్ఞాతులవల్ల కొంత అలజడి కలిగే సూచనలు కనిపించాయి. మిగిలిన సైన్యంలో సగానికిపైగా రాజధానీ సంరక్షణకోసం తిరిగి కాశ్మీరరాజ్యానికి తరలిపోయింది.

ఇక సైన్యం గౌడ రాజధాని పౌండ్రవర్ధన నగరం సమీపించేసరికి దానిలో మిగిలిన సైనికులంతా కలిసి పదివేలమందికంటె ఎక్కువ లేరు. అయినా ఆ సైన్యంతో పౌండ్రవర్ధననగరం ముట్టడించితీరాలని జయాపీడు డాజ్ఞాపించాడు. కాని మహా సేనాధిపతి దేవశర్మ దీని కంగీకరించలేదు! సైన్యంలో చాలామంది రహస్యంగా స్వదేశానికి పారిపోతున్నారనీ మిగిలిన సైనికులుకూడా స్వదేశానికి మరలిపోవడానికి తహతహపడుతున్నారనీ, ఈ విషమ ఘట్టంలో పౌండ్రవర్ధన నగరంపై దండెత్తిపోవడం ప్రమాద హేతువనీ విన్నవించాడు.

"మీరంతా ఇంతటి పిరికిపందలని తెలిసి ఉంటే నేనీ దిగ్విజయ యాత్ర సంకల్పించి ఉండక పోదును!" అన్నాడు జయాపీడుడు! దేవశర్మ జయాపీడునికి బాల్యమిత్రుడు. అందువల్లనే అతని శిరస్సింతవరకు సురక్షితంగా నిలబడి ఉన్నది! లేకపోతే ఈ పాటికది శూలాగ్రం మీద తాండవం చెయ్యవలసినదే!

"మనం స్వదేశం విడిచి చాలా దూరం వచ్చివేశాము! సైన్యానికి సంభారాలు సన్నగిల్లి పోయాయి! సైనికులంతా నిరుత్సాహులై ఉన్నారు! ఇక మిగిలి ఉన్న బలగం చాలా స్వల్పం! మనకెదిరి బలం ఎంత ఉన్నదో తెలియదు! ఇప్పుడు యుద్ధం బహు ప్రమాదకరం! ఆ పైన మరి దేవరవారి చిత్తం!" అన్నాడు దేవశర్మ.

"మీవంటి భీరువులతో కలిసి దండెత్తడం నాకే సిగ్గుచేటు! నేనొక్కడనే నా భుజబలంతో పౌండ్రవర్ధన నగరంను జయించివేస్తాను! మీరంతా రాజధానికి తిరిగిపోవచ్చును!" అన్నాడు జయాపీడుడు! మహా సైన్యాధిపతి తెల్లబోయాడు! "వెంటనే దండెత్తిపోవలిసిందని సేనాధిపతుల కాజ్ఞ పంపిస్తున్నాను!" అన్నాడు దేవశర్మ తలవంచి.

"వల్లకాదు! నేనొక్కడనే జయించుకొని వస్తాను!" అని గర్జించాడు జయాపీడుడు! దేవశర్మ జయాపీడదేవునికి బాల్యస్నేహితుడే! కాని ప్రభువర్యుల దురంహంకారానికి అడ్డుపడడం ఆత్మశ్రేయస్కరం కాదని గ్రహించి ఇక ఏమనడానికీ పాలుపోక తలవంచుకుని మాట్లాడ కూరుకున్నాడు.

మరునాటి రాత్రివేళ జయాపీడుడు హఠాత్తుగా తన గుడారంలో అదృశ్యుడైనాడు! పరిచారకులకు కూడా అతడెక్కడైనదీ తెలియదు! కొన్ని అమూల్యరత్నహారాలు, కవచము, ఖడ్గము మాత్రమే కూడా తీసుకుపోయాడు! ఇక దేవశర్మ కేమీ పాలుపోక జయాపీడుని పునరాగమనం నిరీక్షిస్తూ ఆ పరిశిష్ట సైన్యంతో బాటక్కడే ఉండిపోయాడు. జయాపీడుడు మారువేషంతో పౌండ్రవర్ధన నగరంలో ప్రవేశించాడు. అప్పటినించీ ఆ నగరంలో విజయవర్మగా మారిపోయాడు. ఏమైనా సరే! పౌండ్రవర్ధన నగరం స్వాయత్తం కానిదే కాశ్మీర రాజ్యంలో తిరిగి అడుగుపెట్టకూడదని కార్తికేయ దేవాలయంలో దేవసేనాని కుమారస్వామి సన్నిధిని ఘోర శపథం పట్టాడు! ఆ ప్రతిజ్ఞ నెరవేరేవరకు తదితర భోగవినోదగోష్ఠీ ప్రసంగాలన్నీ పూర్తిగా విస్మరించి వెయ్యాలని కూడా నిశ్చయించుకొన్నాడు. అదే అప్పటివరకు అసిధారావ్రతంగా పరిపాలించాడు. ఆ విషయాలన్నీ ఆమూలాగ్రంగా ఆమెకు తెలియజేశాడు.

విషయాలన్నీ విన్న తరవాత వకుళమాలిక మరి తన కన్నులే నమ్మలేకపోయింది! తాను, కమల సందేహించినది నిజమే అయింది! వకుళమాలిక మొట్టమొదటిగా అతనిని చూచినప్పుడే అతడెవడో రాజబంధువో మరే మహాపురుషుడో అయి ఉండవచ్చునని ఊహించింది. అది ఊహించినదానికంటె ఎక్కువగానే నిజమయింది! "ఆహా ఎంతటి మహత్తరమైన సంఘటన! అని అదేపనిగా ఆశ్చర్యపోయింది వకుళమాలిక. ఇంతలో హఠాత్తుగా ఆమె కొక ఆలోచన తట్టింది. వెంటనే హడిలిపోతూ ఇలా అడిగింది.

"ఒకవేళ మీ సంగతి మా జయంత మహారాజు చెవిని పడితే మరి మీకు ప్రాణాపాయం కాదా?"

"ఈపాటికే వార్త ఆయనకు అందే ఉండవచ్చును" అన్నాడు జయాపీడుడు ముక్తసరిగా. అంతేగాని ఎక్కడా తొణకలేదు! 'ఎంత గుండె నిబ్బరం!' అనుకొన్నది వకుళమాలిక. వెంటనే ఇలాగంది:

"మీరిక ప్రచ్ఛన్నవేషం ధరించి తల దాచుకోక తప్పదు! లేకపోతే మీ ప్రాణాలకే ముప్పురాగలదు!"

"అవును లేకాని మరి గత్యంతరం!"

వకుళమాలిక తొందరగా ఏదో సలహా చెప్పిందే గాని తీరా ఎలాగ అతనిని దాచివెయ్యాలో ఆమెకుస్ఫురించలేదు. చిట్టచివరికేమీ పాలుపోక—"పోనీ మా భవంతి నేలమాళిగలో తలదాచుకుంటే!" అంది. జయాపీడుడు కొంత సేపాలోచించి—

"లేకపోతే నర్తకి వేషం ధరించి నీ ఎదుట నృత్యంచేస్తే"—అన్నాడు. వెంటనే విరగబడి నవ్వడం మొదలుపెట్టాడు. వకుళమాలిక అతని ధోరణి చూచి నిర్ఘాంతపోయి—"మిన్ను విరిగి మీదపడుతున్నా, ఏమిటీ నిర్లక్ష్యం!" అన్నది.

"పడితే పడనీ!"

"దయఉంచి, కొంచెం నా ప్రార్థన మన్నించరా!"

"ఇక ఇప్పుడింతకంటె చేయగలిగిందేమీ లేదు." అన్నాడు జయాపీడుడు.

ఇంతలో కమల వగర్చుకొంటూ అక్కడికి వచ్చి తొందర తొందరగా వకుళమాలిక చెవిలో ఏమేమో చెప్పి మెరుపులా తిరిగి వెళ్ళిపోయింది. జయాపీడుడు వకుళమాలిక కేసి చూసి బొమముడి విరిచాడు. వకుళ

మాలికముఖం వెలవెలబోయింది. గజగజ వణికిపోతూ—

"రాజసైనికులు మా ప్రాసాదం చుట్టుముట్టారు. మహామాత్యులు లోపలికి వస్తున్నారు!... మీరిప్పటికైనా నేలమాళిగలో—" అని ఏదో చెప్పబోయింది.

జయాపీడుడు క్షణంలో పక్కనే వేలాడుతున్న ఖడ్గం చేతధరించి చరచరా భవంతి సింహద్వారంవైపు వెళ్ళబోయాడు! వకుళమాలిక కళ్ళమ్మట కన్నీటిధారలు ప్రవహించాయి. అతని రెండుచేతులు పట్టుకొని సాహసించవద్దని పరిపరి విధాలుగా బతిమాలింది. మొదట అతను కొంత నెమ్మదిగా ఆమెతో చెప్పిచూచాడు. ఆమె అతనికి దారి ఇచ్చేటట్లు కనబడలేదు. పైగా రెండుకాళ్ళు పట్టుకొని ప్రాధేయపడడం మొదలు పెట్టింది. ఒక్కసారిగా అతను ఆమెపట్టు విడిపించుకొని చరచరా సింహద్వారంవైపు వెళ్ళిపోయాడు. వకుళమాలిక దిగాలుపడి అక్కడే కూలబడిపోయింది.

౬

సింహాన్ని సంహరించిన వీరుని కవచం లోపల జయాపీడచక్రవర్తి నామధేయం కనపడినదని తెలియగానే పౌండ్రవర్ధన నగరం అంతటా దావాగ్ని దరికొన్నట్లయింది. కొంతకాలంనించీ జయాపీడ చక్రవర్తి తన అపార సైన్యాలతో దండెత్తనున్నాడని గ్రహించి గౌడరాజు జయంతదేవు డాత్మరక్షణకోసం యుద్ధసన్నాహాలు చేస్తూనే ఉన్నాడు. అయితే గౌడరాజ్యం చాలా చిన్నది. కాశ్మీర చక్రవర్తి జయాపీడుని మహాసైన్య వాహినికీ, గౌడరాజు జయంతదేవుని స్వల్పసైన్యానికీ హస్తిమశకాంతరం. అయినా జయంతదేవుడు యథాశక్తిగా యుద్ధసన్నాహాలు చేయిస్తూనే ఉన్నాడు. అంతలో ఒక యోధుడు అతి రహస్యంగా వచ్చి జయంతదేవుని కా మోచేతికవచంలోని నామాక్షరాలు చూపించాడు. దానితో జయాపీడుడు మారువేషంతో పౌండ్రవర్ధన నగరంలో ప్రవేశించిన విషయం స్పష్టపడిపోయింది. ఆ వార్త జయంతదేవునికి తెలియజేసిన యోధుని మూలంగా కూడా అది కర్ణాకర్ణిగా నగరం అంతటా పొక్కిపోయింది. దానితో పౌరులలోకూడా ఆ అలజడి బాగా వ్యాపించిపోయింది.

ఆ పరిస్థితులలో జయంతదేవుని కేమీ పాలుపోలేదు. మహామాత్యునితో కలిసి రెండు మూడు గోజులావిషయంలో మథనపడ్డాడు. జయాపీడుడు దేవదాసి వకుళమాలిక భవంతి వసతిగృహంలో ఉన్న విషయం గూఢచారులు పసిగట్టివేసి అది నెమ్మదిగా మహామాత్యుని చెవిలో వేశారు. జయంతదేవుడు వెంటనే జయాపీడుని బంధించివేస్తే తన దేశానికా ఉపద్రవం తొలగిపోగలదని ఆలోచించాడు. జయాపీడుని సంహరించివేస్తే అతని సైన్యం ఆ విషయం తెలిసికొని కాశ్మీరదేశానికి పారిపోవచ్చును! అదే జయంతదేవుని ఎత్తు!

కాని వృద్ధ మంత్రి దానికంగీకరించలేదు. అంతమాత్రంచేత తనకు దండయాత్రభయం తొలగదనీ కాశ్మీరసైన్యం ఆ తరవాతనే తనపై దండెత్తి నగరం యావత్తు భస్మీపటలం చేసివెయ్యవచ్చుననీ అతని భయం! ఈలోగా మరికొంతసైన్యం కాశ్మీర దేశాన్నించి గౌడ దేశానికి రావచ్చును. ఆ విధంగా తనకు కాశ్మీరానికీ క్రమక్రమంగా వైరాగ్ని ప్రజ్వరిల్లవచ్చును. ఈ బలవద్వైరంలో చిట్టచివరికి సర్వనాశన మైపోయేది గౌడరాజ్యమే! ఎటుచూచినా మహాప్రమాదమే ఎదురొక్కంటున్నది. అందుచేత జయాపీడుని చంపించివేసినా, బంధించివేసినా చివరికి జరిగే ఫలితం ఒక్కటే. కనక ఈ విషమఘట్టంలో జయాపీడునితో సంధిచేసుకొని అవిఘ్నంగా తన రాజ్యం నిలబెట్టుకోవడం తప్ప వేరే ఉపాయమేమీ లేదని మంత్రి ఖచ్చితంగా నొక్కి చెప్పాడు.

జయంతదేవునికి కల్యాణదేవి అనే కుమార్తె తప్ప వేరే సంతానమేమీ లేదు! ఆమెను గౌడరాజ్యానికి సన్నిహిత రాజ్యాలు పరిపాలించే రాజన్యుల కెవరికైనా ఇచ్చి వివాహంచేసి అవిఘ్నంగా తన రాజ్యం దృఢపరుచుకోవాలని జయంతదేవుని సంకల్పం. ఇరుగుపొరుగు రాజ్యాలలో శూరసేనుడనే మహారాజొకడున్నాడు. అతడు జయంతదేవునికి కొంచెం దూరబంధువు. శూరసేనునికి కల్యాణదేవినిచ్చి వివాహం చేస్తే ఆ దూరబంధుత్వం బాగా బలిసి దగ్గరపడవచ్చును. అదే జయంతదేవుని ఊహ. కాని ప్రస్తుతం కాశ్మీరసైన్య ప్రమాదం ఒక పెద్ద పెను ప్రళయంలా విరుచుకుపడింది. ఈ మహాప్రమాదం గడిచి బయటపడడ మెలాగ? ముందుగా జయాపీడుని బంధించివేస్తే తరవాత శూరసేనుని సహాయంతో ఈ ప్రమాదం కొంతవరకు గడిచి గట్టెక్కవచ్చును. జయంతదేవుని ఆలోచనలీవిధంగా సాగిపోయాయి. కాని ఆ మహామాత్యుని కీపంథా నచ్చలేదు.

"మహాప్రభూ! మీరు చెప్పినది ప్రస్తుత ప్రమాదానికే విధంగాను సహాయకారి కాదు." అన్నాడు.

జయంతదేవునికి ఏమి చెయ్యడానికీ పాలుపోక ఏదోవిధంగా సంధి చేసి తన ప్రతిష్ఠ నిలబడేమార్గం ఆలోచించవలసిందని అన్నాడు.

అమాత్యుడు అతని వైఖరికి సంతోషించి "బలవంతులతో సంధి జరుగుతూన్నప్పుడు మనం స్వల్ప విషయాలలో సంకోచిస్తూ వెనకంజ వెయ్యడం కూడనిపని" అన్నాడు.

జయంతుదేవు డతని మాటలలో లోపలి అంతరార్థం గ్రహించుకొన్నాడు. కాని స్పష్టంగా ఏదీ తేల్చి చెప్పక మంత్రి ముఖంకేసి చూసి నెమ్మదిగా ఇలా గన్నాడు.

"ఏ విధంగా సంధి జరిగినా నా కభ్యంతరం లేదు! కాని మన రాజ్య ప్రతిష్ఠకు వంశ ప్రతిష్ఠకు మాత్రం భంగం కలగకూడదు! ఆ అప్రతిష్ఠ కన్న వీర మరణమే మేలు!" అన్నాడు.

"ఎంత మాట! నేనుమాత్రం దాని కంగీకరిస్తానా! యుద్ధానికి సిద్ధంగా ఉండవలసిందని సేనాధిపతులందరికీ ఆజ్ఞ ఇచ్చి ఇక్కడికి వచ్చాను! సేనా విషయంలో మొట్టమొదటే మేలుకొన్నాను" అన్నాడు మహామాత్యుడు.


మంత్రి కార్యజ్ఞతకు జయంతదేవు డెంతో ఆనందించాడు.

"వ్యవహారం చెయ్యి దాటిపోతే జయాపీడుని నిలుచున్నపాటుగా బంధించివేసి సూర్యాస్తమయానికి పూర్వమే తమ సన్నిధిని నిలబెట్టగలను!" అన్నాడు మంత్రి.

"అదే సరియైన మార్గమేమో!" అన్నాడు జయంతదేవుడు.

"నేను జయాపీడ చక్రవర్తి ధోరణినిబట్టి ఈ సాయంకాలానికే ఏదో ఒకటి తేల్చివేస్తాను. ఇంతకు వ్యవహారమేమీ చెయ్యి దాటి పోలేదు!" అన్నాడు మంత్రి.

పిమ్మట అతడొక నాయకుని అశ్వికయోధులను వెంటబెట్టుకొని వకుళమాలిక భవంతి ముట్టుముట్టి తన రాక వకుళమాలికకు తెలియజేశాడు. కమల ఆ విషయమే అతి రహస్యంగా వకుళమాలిక చెవిలో ఊది వెళ్ళిపోయింది. ఆమె మంత్రికి రాజోచితమర్యాదలు జరిపించవలసిందని చెప్పి వంటసే కములను పంపించి వేసింది. అంతలోనే జయాపీడు డాకలిగొన్న పులిలా అక్కడికి బయలుదేరి వెళ్ళిపోయాడు. కమల మంత్రికి సముచిత మర్యాద జరిపి, జయాపీడునికి ము



చిదంబరంలో కనకసభ. ఇక్కడిదైవం నటరాజు. ఈ ఆలయగోపురం మధ్యాహ్న సూర్యకాంతిలో బంగరువన్నె లీనుతుంది.

—ఫొటో: ఎస్. రామకృష్ణ.

★ దేవదాసి ★

త్రికీ కొంచెం పరిచయం కలిగించి ఏదో మిషమీద నెమ్మదిగా అక్కడినించి వెళ్ళిపోయింది. ఇక అక్కడ జయాపీడుడు, జయంతదేవుని మంత్రి మాత్రమే మిగిలారు.

మొదట మంత్రి తన ప్రసంగం కొంత సౌమ్యధోరణిలో సాగిపోనిచ్చాడు. జయాపీడ చక్రవర్తి కొంచెంసేపా ప్రసంగం విన్నాడు. తరవాత కొంచం బింకంగా ఇలాగన్నాడు:

"నేనిప్పుడు కేవలం ఏకాకిని! మీరు సైన్యంతో వచ్చారు. అది నే నెరుగుదును! నన్నిప్పుడు నిర్బంధించివేసినా నేనిక చెయ్యగలిగినది ఏమీ లేదు!"

"మేము దురుద్దేశ్యంతో ఇక్కడికి రాలేదే!"

"అదే యథార్థమయితే ఆ అశ్వికసైన్యం పటాటోపమేల?"

మంత్రికి మరి మాట పెగల్లేదు! ఒక్క నిమిషం మాట్లాడకూరకుని—"ఈ అశ్వికులు కేవలం గౌరవార్థమే నా వెంటవచ్చారు! వీరిని వెంటనే తిప్పి పంపించివేస్తున్నాను!" అన్నాడు. వెంటనే లేచి నిలబడి అశ్వికు అందరికీ తిరిగి వెళ్ళిపోవలసిందని శాసించాడు. క్షణంలో ఆ అశ్వికులంతా తిరిగి వెళ్ళిపోతూంటే వారి అశ్వాల పాదఘట్టన ధ్వనులు రాజవీథిలో మారుమోగాయి. తానా అశ్వికబలం వెంటబెట్టుకు రావడంవల్ల తన యత్న సాఫల్యానికి కొంత ప్రాతికూల్యం ఏర్పడినదని మంత్రి లోలోపల కొంచెం కించపడ్డాడు. కాని జయాపీడుని కింకా మంత్రి సద్భావం విషయంలో సందేహం తీరలేదు. అతని లోతులు తెలియనిదే యీ సంధి కంగీకరించడం కేవలం ఆత్మవినాశ హేతువుగా పరిణమించవచ్చునని జయాపీడుని అనుమానం. అందుచేత మంత్రి ననేక విధాలుగా పరీక్షచేశాడు. ఆ వృద్ధమంత్రి కార్యసానుకూలతకోసం అతి వినయంగా అతనికి సముచితమైన ప్రత్యుత్తరాలిచ్చాడు. జయాపీడుని ప్రశ్నపరంపర కొంచెం తీవ్ర ధోరణిలో సాగిపోయింది.

"అయితే—త్రికరణశుద్ధిగా మీరీ సంధి కంగీకరిస్తున్నారా?"

"ఎంతమాట! ఈ ప్రయత్నం అంతా దానికోసమేగదా!"

"అయితే మా సైన్యాలు వెంటనే పౌండ్ర వర్ధనంలో ప్రవేశించడానికి మీకేమైనా అభ్యంతరం ఉన్నదా?"

"ఏమీ లేదు! వెంటనే ప్రవేశించవచ్చును. అయితే మీరు మమ్మల్ని కేవలం సామంతరాజులుగామాత్రం పరిగణించకూడదు! నామమాత్రంగా మీకు కొంత కప్పం చెల్లించడానికి మాకేమీ అభ్యంతరం లేదు!"

జయాపీడునికి సమాధానంతో కొంత సంతృప్తి కలిగింది. అయినా అతని అనుమానం తీరలేదు! కొంచెంసే పాలోచించి మళ్ళీ మంత్రిపరీక్ష ప్రారంభించాడు:

"జయంతదేవునికి సంతానం ఒక్క కుమార్తే కదా!"

"అవును!"

"ఆమె నామధేయం?"

"కల్యాణదేవి!"

"జయంతదేవులు కాశ్మీర చక్రవర్తితో సంబంధ బాంధవ్యాల కంగీకరిస్తారా?"

వృద్ధమంత్రి ఈ ప్రశ్నతో నిర్ఘాంత పోయాడు! కాని వెంటనే తమాయించుకున్నాడు: "ఎంతమాట సెలవిచ్చారు! వారిది మహాభాగ్యంగా పరిగణించగలరు! అయితే నేనీ విషయం మా ప్రభువులతో ముందుగా సంప్రదించలేను!"

"దానికేమి! తరవాత సంప్రదించవచ్చును. కాని సంధికీ, పరస్పర సౌహార్ద బాంధవ్యాలకు ఈ వివాహం అత్యంతావశ్యకం!" అన్నాడు జయాపీడ చక్రవర్తి.

ఆ పైన వృద్ధమంత్రి కొంత లోతుగా ఆలోచించాడు. అలాగే జయాపీడుని ముఖవైఖరి పరిశీలిస్తూ నెమ్మదిగా ఇలాగన్నాడు.

"ఇంకా తెలియకపోవచ్చునే గదా!"

"అవును!"

"అయితే మా కళ్యాణదేవి కాశ్మీర పట్టమహిషి కాబోతున్నదన్న మాట! ఎంతటి అదృష్టవంతురాలు!"

"పట్టమహిషీ గౌరవ విషయం మాత్రం నే నంగీకరించలేను.

"ధర్మప్రకారం ఆ గౌరవం ఆమెకే చెందవలెను గదా!"

దీనిమీద జయాపీడు డేమీ అనలేదు! అలాగే మౌనం అవలంబించాడు. వృద్ధమంత్రి ఇక ఈవిషయంలో అంతగా నొక్కి నొక్కి ప్రశ్నించడం భావ్యం కాదనుకొని మళ్ళీ ఆ విషయం ప్రసంగించడానికి సాహసించలేదు. జయంతదేవునికి స్వీయవంశ మర్యాద లత్యంత ముఖ్యమైనవని అతనికి తెలుసును. అందుచేత ఇది చివరికి సంధి ప్రయత్నాలకే విఘాతంగా పరిణమించగల దేమోనని అతనికి భయంవేసింది. కాని ఏదో విధంగా ఇది సాధించలేకపోతామా అనే ధైర్యంతో అప్పటికా ప్రయత్నం విరమించివేశాడు. అదీగాక జయంతదేవునితోకూడా కొంత సంప్రతించవలసిన అవసరంకూడా ఏర్పడింది. ఇవన్నీ ఆలోచించుకొని వృద్ధమంత్రి సవినయంగా జయాపీడుని దగ్గర సెలవుతీసుకుని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

జయాపీడుడేదో తీవ్రంగా ఆలోచిస్తూ నెమ్మదిగా తన వసతిగృహంలోకి వెళ్ళిపోయాడు. ఆ గృహద్వారంలోనే అతనికి వకుళమాలిక ఎదురైంది. అతడు లోపలికి వెళ్ళి విశ్రమించాడు. వకుళమాలిక ఎంతో ఆత్రంగా అతనివైపు చూచింది. జయాపీడుడు మంత్రికీ తనకూ మధ్యజరిగిన వ్యవహారమంతా ఆమూలాగ్రంగా ఆమెకు తెలియజేశాడు.

ఆమె ఇంతకుపూర్వం ఏ క్షణంలోనైనా ఆ ఆశ్వీక యోధులు జయాపీడుని బంధించివెయ్యవచ్చునని భయపడింది. కాని, ఇప్పుడీ కళ్యాణదేవి వివాహ ప్రస్తావన—ఈ సంధి వ్యవహారము వినేసరికి ఒక్కసారిగా ఆమె మనస్సులో అనేక భావాలు ఉదయించాయి. మొట్టమొదట "కళ్యాణదేవి ఎంతటి అదృష్టవంతురాలో!" అని లోలోపల ఎంతో అసూయపడింది. కాని జయాపీడు డామెను పట్టమహిషీపదని కంగీకరించక పోవడానికి కారణమేమో ఆమెకు బోధపడలేదు! జయాపీడుని మనఃఫలకంపై మరిఒక భాగ్యశాలిని ఎవరైనా ఉన్నదేమో! అతడామెకే ఆ గౌరవపదవి సమర్పించవలెనని నిశ్చయించుకొన్నాడేమో! అందువల్లనే కళ్యాణదేవిని పట్టమహిషిగా అంగీకరించలేదేమో! ఆహా! పురుషుల చిత్తప్రవృత్తు లెంత విచిత్రమైనవి! జయాపీడుని హృదయం చూరగొన్న ఆ సుందరీమణి ఎవరో! ఆమె ఎంతటి అదృష్టవంతురాలో! ఈ విధంగా వకుళమాలిక భావనాపరంపర సాగిపోయింది.

అయితే ఆ అజ్ఞాత సుందరీమణి మూలంగా ప్రస్తుత సంధి రాయబారాలు భగ్నమైపోవచ్చుననీ, అప్పుడు గౌడ రాజ్యానికే గాక జయాపీడుని ప్రాణానికిగూడా అపాయం సంభవించవచ్చుననీ ఆమె భయపడింది. అందువల్ల కేవలం తాత్కాలిక క్షేమదృష్ట్యా కళ్యాణదేవి వివాహాని కంగీకరించవలసిందని అతన్ని ప్రార్థించడమే అవశ్య కర్తవ్యమనికూడా ఆమె నిశ్చయించింది. వకుళమాలిక అలాగే కనురెప్ప వెయ్యకుండా అతనివైఖరి పరిశీలించి, ఎంతో ఆప్యాయంగా కళ్యాణదేవి వివాహ విషయంలో బతిమాలుకొన్నది:

"కళ్యాణదేవి నీయవలసినదని కోరినవారు మీరేగదా!"

"కావచ్చును! దానికేమి?" అన్నాడు జయాపీడుడు.

"అయితే ఆమెను పట్టమహిషిగా అంగీకరించకపోవడం కేవలం అన్యాయం!"

"నీవన్నది నిజమే! కాని ఇంతకు పూర్వమే ఆ గౌరవం మరొకరికి అంకితమైపోయింది!"

"ఈ సమాధానం వకుళమాలిక హృదయానికొక శూలంలా నాటింది. కొంతసేపటివరకు ఏమీ అనలేక తలవంచి కనురెప్పలు వాల్చి మెల్లిగా ఇలా అడిగింది."

"అంతటి అదృష్టవంతురాలెవరో కొంచెం నేను వినవచ్చునా?"

"ఆఁ వినవచ్చును! దీనిలో అంత రహస్యమేమీలేదు!" ఈ సమాధానంతో వకుళమాలిక కొంచెం నిర్ఘాంతపోయింది!

"అయితే ఆమె పేరు?"

"వకుళమాలిక!"

"నేనా?"

"నీవే!

వకుళమాలిక ఈ మాట నమ్మలేదు!

"నా కి పరి[illegible] అన్నారు! అదే పదివేలు!"

"పరిహాసం కాదు! నామాట నిశ్చయమే."

అని జయాపీడు డామెను కౌగలించుకో బోయాడు.

ఆమె అతనికి కొంతదూరంగా తొలగిపోయి, ముక్కుమీద వేలు వేసుకొని కొంచెం కోపంగా నవ్వింది.

"ఇంకా మీ ప్రతిజ్ఞ నెరవేరలేదు. మరిచిపోయారా?" అన్నది.

"మరిచిపోలేదు!—కాని ప్రతిజ్ఞ నెరవేరినట్లే!"


అని జయాపీడుడు మళ్ళీ ఆమెను కౌగలించుకోబోయాడు.

"రాజకుమార్తెను పట్టమహిషిగా అంగీకరించినప్పుడుగాని అది నెరవేరదు! అంతవరకు నే నప్పుకోను!"

అని వకుళమాలిక అతనికి దొరకకుండా తప్పించుకొని అక్కడినించి వెళ్ళిపోయింది. ఆ ఆఖరి మాట జయాపీడుని హృదయంలో నాటుకు పోయింది.

ఆమె వెంటనే తన శయ్యాగృహంలో ప్రవేశించి, కమలతో ఆ నాటి వృత్తాంతం అంతా మొదటినించీ పూసగుచ్చినట్లు చెప్పివేసింది.

—సశేషం.



5

ఇందిరమ్మ మళ్ళీవచ్చి అయిదారు నెలలయింది. కాని సర్వజయ మాత్రం ఈ మధ్యకాలంలో యెప్పుడూ ఆవిడతో సరీగా మాట్లాడికూడా యెరుగదు. తన కూతురుకి తనకంటె—ఇటు ఏడు తరాల్నీ—అటు ఏడు తరాల్నీ మ్రింగి కూర్చున్న ఈ పీడాకారపు ముసలమ్మంటేనే ఎక్కువ ప్రాణం—అన్న భావం సర్వజయ మనస్సులో ఇటీవల బాగా పాదూదుకుంది. అలాంటప్పుడు ఆవిడంటే అసూయ, ఆగ్రహం పుట్టుకురావటంలో అబ్బురమేమీ ఉండదు కడుపున పుట్టిన బిడ్డను కాకుండా చేస్తున్న ఘాతుకం కదా మరి ఇది! ఇహనైనా—ఇంకా ఒంట్లో అంతో యింతో ఊపిరి ఉండగానే తన దారి తాను చూసుకోవటం మేలన్న భావాన్ని, సర్వజయ రోజూ రెండు పూటలా పని పెట్టుకుని ముసలమ్మయెదుట మాటల్లో వెళ్ళగక్కుతోంది. కాని ఆదారి ఎటువైపుగా ఉన్నదో—పుట్టి బుద్ధి యెరిగింది లగాయతు ఈ డెబ్భైయేళ్ళ జీవితంలో ఎన్నడూ ఆలోచనల్లోకయినా రాలేదు. ఇహ ఇన్నేళ్ళకిప్పుడు ఆ దారి దొరుకుతుంది అన్న ఆశమాత్రం ఎలా కలుగుతుంది!

జరిగినకథ:—


నిశ్చిందిపురం బెంగాల్ లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. ఇందిరమ్మ అతనికి వరసకి అక్కగారు. ఆ వృద్ధురాలు అతని ఇంట్లోనే బ్రతుకు వెళ్లబుచ్చుతోంది. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరం పెట్టాడు. దుర్గ పుట్టిన చాలపళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడి పేరు అపూ. ఇందిరమ్మకి ఈ ఇద్దరు పిల్లలంటే తగని ఆపేక్ష - కాని సర్వజయకి ఇందిరమ్మ అంటే వల్లమాలిన చీకాకు. నిత్యమూ ఆమెతో ఘర్షణే. ఇందిరమ్మ కోపం వచ్చి ఇంట్లోంచి వెళ్లిపోయి ఎక్కడో ఓ రెణ్ణెల్లుండి తిరిగి ఇక్కడికే రావడం పరిపాటి.

వానాకాలం వెళిపోతూండగా ఆఖరికలా అయితే యేం ఇందిరమ్మకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. అక్కడికి ఆరుక్రోసుల దూరంలో ఉంది తన అల్లుడి ఊరు. అల్లుడు చంద్రముజుందారింకా బ్రతికే ఉన్నాడు. అతడి స్థితిగతులు కూడా బాగానే ఉన్నాయి. సంపన్నగృహస్థే అతడు. కాని కూతురు పోయింది లగాయతు అతడితోటి చుట్టరికం కూడా తెగిపోయింది. ముప్ఫై అయిదు, ముప్ఫై ఆరేళ్లనాటి మాట ఇది! ఆ తర్వాత యెప్పుడూ ఆవిడ అతణ్ణి చూసీ యెరుగదు. వాళ్ళ యోగక్షేమాలు తెలుసుకునీ యెరుగదు. అయినా తాను స్వయంగా అక్కడికి వెడితే తమ పంచను రవంత చోటివ్వటానికి అంత మరీ మొహం చిట్లించుకుంటాడా అల్లుడు!

ఇంకా బారెడు ప్రొద్దుండగానే బండివాడామెని 'భాండార్ హాటి' గ్రామానికి తీసుకొచ్చి గ్రామ మంటపాని కెదురుగా బండి ఆపాడు. బండివాడి పిలుపుతో లోపల్నుంచి ఓ పాతికేళ్ళ యువకుడు "ఎక్కడిదీ బండి?" అంటూ బయటికి వచ్చాడు. అతడివెనుకనే "ఎవర్రా రాఘూ! ఎక్కడినుంచి వచ్చారో అడుగు:" అంటూ మరోకవృద్ధుడుకూడా బయటికి వచ్చాడు.

ఇందిరమ్మ గుర్తయితే పట్టిందికాని, నిర్ఘాంతపోయింది. తన అల్లుడు చంద్రముజుందారే అతడు. నలభైయేళ్ళక్రితం మాంచి వయసులో చేవ తేలినట్లున్న శరీరంతో దృఢంగాఉన్న యువకునితో, తల నెరిసిపోయిన ఈ వృద్ధుని పోల్చుకుని చూసుకునే సరికి ఆవిడకి గుండె డిక్కయినట్లయింది. అంతలోనే రకరకాలుగా అంతులేనన్ని జ్ఞాపకాలొచ్చాయి ఆవిడకి. సంతోషమూ విచారమూ కాని మనస్సుతో—మళ్ళీ ఇన్నాళ్ళ కావిడ కూతుర్ని తలపుకు తెచ్చుకుని ఓరాగం తీసింది.

అనువాదం: మద్దిపట్ల సూరి



"పథేర్ పాంచాలీ" — ఇందిరమ్మ, దుర్గా, అపూ.

చిత్రకారుడు: దివాకర్ సేన్ శాంతి - కలకత్తా

తెల్లబోయి ప్రశ్నిస్తున్న చంద్ర ముజుందార్‌కి మొదట అస లిదేమిటో అంతుపట్టలేదు. తర్వాత నిదానంగా ఆకళింపుచేసుకుని, అత్తగారిదగ్గిరకువచ్చి నమస్కరించి పాదధూళి స్వీకరించాడు. ఇందిరమ్మ కాస్త నిబ్బరించుకుని, డగ్గుత్తికతో—"మళ్ళీ ఇన్నాళ్లకి—నీపంచను ఇంతచోటు ఇవ్వకపోతావా అని వచ్చాను నాయనా! నేనుమాత్రం మహా ఇంకా ఎన్నాళ్ళని బ్రతకపోయాను! ఎటుచూసినా ఇంకెక్కడా నా అన్నవాళ్లు ఎవరూ లేరుకదా నాకు! ఏదో ఈ వయసులో ఓ గుప్పెడు మెతుకులు—ఓగుడ్డపాతకోసమని—"అంటూ మొదలెట్టింది.

ముజుందారు తన పెద్దకొడుకుతో బండిలో సామానేమయినా ఉన్నదేమో దింపమనిచెప్పి, అత్తగారిని అతడివెంట ఇంట్లోకి పంపాడు. ఇప్పుడీయింటిపరువుబరువులు కనిపెట్టి చూసుకుంటున్నది రెండోసంబంధపు విధవకూతురు, పెద్దకోడలూ—వాళ్ళిద్దరే. అతడికి మరో ముగ్గురు కొడుకూళ్ళు,అయిదారుగురు మనుమలూ,మనుమరాళ్ళూ ఉన్నారు. అటూ ఇటూ కొటిబాదులమీద విశాలమైన వసారాలు దింపి కట్టినఇల్లు వారిది. వడింసావడిభోషాణాలతో, కావడి పెట్టెలతో, ఇంకేవేవో సామాన్లతో కాలుపెట్టే సందు లేకుండా ఉంది. ముజుందార్ విధవకూతురుపేరు హైమవతి. చాలా ఉత్తమురాలామె. అవస్నా ఈపస్నా ఆమే ముక్కలుకోసి, ఎంతో ఆదరణతో ఇందిరమ్మముందర తెచ్చిపెట్టి, ఆమాటా ఈమాటా అడుగుతూ బలవంతంచేసి తినిపిస్తూ దగ్గిర కూర్చుంది. "అమ్మమ్మా! ఇంతకీ నువ్వు మమ్మల్నెప్పుడూ చూడనేలేదుగా! ఇంతకు మునుపు రెప్పుడూ నువ్వు ఇటువైపులకి రానే లేదా అసలు! ఆఁ. చెరుకుముక్కలు కోసిపెట్టనా అమ్మమ్మా! పళ్లు గట్టిగా ఉన్నాయా? నమలగలవా మరి...?"

ప్రక్క వసారాలో పిల్లలు సాయంత్రం అన్నాలు తింటూ అల్లరిచేస్తున్నారు. "చూడు. చూడు అమ్మా! ఉమ పప్పంతా నా కంచంలో పడేసేసింది" అని పితూరీ చేస్తున్నా డొకడు. "దానిదగ్గిరకు పోయి ఎందుకు కూర్చున్నావ్? నిన్ను విడిగా కూర్చుంటూ ఉండమని ఎన్నిసార్లు చెప్పాను! అయినా అదెక్కడలే! అదో పెద్దా పేరక్క అయిపోయింది" అని కేకలేస్తోంది ముజుందార్ కోడలు.

పది పన్నెండు రోజులు గడిచేసరికల్లా ఇందిరమ్మ కిక్క దేమిటో వెలపరం పుట్టసాగింది. మనసుకి కుదిరిక చిక్కటంలేదు. పరిచితాలు కాని తలుపులూ - ద్వారబంధాలూ ఇవన్నీ. అలవాటు లేని దొడ్లూ, దొవలూను. ఈ సంసారం తీరే అదోమాదిరి. ఇక్కడ తనకేమీ లేదు, తనకీ ఈ యింటికీ ఎక్కడా పొత్తు కలవనే కలవదు అన్నభావం ఆవిడ మనస్సులో బలపడసాగింది. రోజూ సాయంత్రం వేళ ఓమూలగా ఉండే తన పంచపాళిలోకి వచ్చి కూర్చునే ఆ పిల్లలు—తన పిల్లల మొహాలు రోజూ గుర్తొస్తూండేవి. ఇరవై రోజులు గడిచేసరికల్లా ఇహ వెళ్లిపోవటానికి తొందర లాడ సాగింది. ఆవిడ కిహ ఇక్కడేమీ తోచకుండా వుంది.

మామగారి మొదటి సంబంధపు అత్తగారు, ఇలా హఠాత్తుగా ఎక్కడినుంచో తమ యింటిమీది కొచ్చి కూచోటం—పైగా ఆ వచ్చినావిడ తన మనసులోని ఉద్దేశాన్ని బయటపెట్టటం—చూ సినప్పట్నుంచీ ఈ ఇంటి పెద్ద కోడలి కిదంతా కంటగింపుగానే వుంది.

చంద్ర ముజుందార్ మనస్సులో యేముందో పరమాత్ముడికి తెలియాలి. కాని పెద్దకొడుకు, పెద్దకోడలి భయంమూలంగా పైకి మాత్రం యేమీ అనలేదు...

చాలా రోజుల తర్వా[illegible] తన పంచపాళిలో కూర్చుని, పాపాయిని దగ్గిర కూచోపెట్టుకుని, వెన్నెల్లో రవగాలికి కదిలే ఆ కొబ్బరిఆకుల్ని చూస్తూ కూచుంటే, ఇందిరమ్మకి హాయిగా నిద్రతూగి వస్తూ ఉంటుందిప్పుడు.

ఆవిడ మళ్ళీ రాగానే అభిమానంకొద్దీ దుర్గ మొదట మాట్లాడనేలేదు. దగ్గిరకు కూడా రాలేదు. ఆ మాటా—ఆ మాట చెప్పి బుజ్జగించి మంచి చేసుకున్నాక మళ్ళీ మునుపటి అంత చనువుతోనూ దగ్గిరకు వచ్చింది. ఇందిరమ్మ ఆపేక్షగా పిల్లదాని తలంవుని దుతూ—"ఎర్రరాళ్ల జాకాలైతే అంచక్కగా ఎంతో బాటాయే అమ్మాయ్ నీకు! ఇప్పుడొస్తున్న క్రొత్త రకాలు ఏం బావుంటాయి కొక్కిరించినట్లుంటాయ్ కాని" అన్నది.

చలికాలం వచ్చేసింది. ఇందిరమ్మ ఆ వీధిన ఉన్న గంగూలీ గారింటికెళ్ళి, ముసలి రామనాథ గంగూలీని, "ఇదిగో, రాముడూ! ఈ యేడు చలి మరీ యెముకలు కొరకేస్తోందేమిటో! దీపాల వేళ నుంచి తెల్లారేదాకా కాస్త వెచ్చగా ఏదైనా కప్పుకుని ముడుచుకు పడుకుందామంటే ఏమీ లేకుండా ఉందోయ్! నాకేదైనా ఒక—" అని అడిగింది.

"అలాగేలే అక్కయ్యా. మరొక మాటు ఎప్పుడైనా రా, ఈ నెలలో ఏమీ వీలుకాదులే ఇహ. వచ్చే నెలలో చూస్తా నేదయినా" అన్నాడు గంగూలీ. తర్వాత కాళ్లు బలపాలు కట్టేట్టు తిరగ్గా తిరగ్గా చివరికి ఓనాడు ఎర్రగళ్ళ దుప్పటి ఒకటి తెచ్చిఇస్తూ "ఇది తీసుకెళ్లు అక్కయ్యా. ప్రియమయితే అయిందిలే అని తొమ్మిదణాలకొనీ యిచ్చి కొన్నాను. ఇంతకంటె మంచిది నవాబ్ గంజ్ మొత్తంమీద దొరకలేదు. మొన్న బుధవారంనాడే కొనుక్కు వచ్చాను. కావాలంటే మడత విప్పి చూడు ఇంకా"అన్నాడు గంగూలీ. ఆవిడ సంతోషంతో నోటినిండా నవ్వి, దాన్ని అక్కడే మడతవిప్పి కప్పుకుని, "బావుంది. చాలా బావుంది. వెయ్యేళ్లు వర్థిల్లు నాయనా! మీ కావాయ్, బాలాయీలకి నూరేళ్లు ఆయుష్షు! మీ కందరికీ పరమాయుష్షు!...లేనివాళ్ళకంటే ఎవరూ ఇవ్వరు నాయనా! ఓ కట్టుడు పంచె యిస్తానంటే ఆ అన్నదా చుట్టూ మూడేళ్ళనుంచీ తిరుగుతున్నాను. ఇస్తాలే ఇస్తాలే అంటూ తిప్పతుంది, కాని ససేమిరా ఇవ్వదే! ఏమిటో, కలిచావలే దింకా. ఇహ ఇంకెన్నాళ్లులే" అన్నది.

ఆవిడ దాన్ని ఎంతో సంబరంతో సర్వజయకి చూపించ బోయేసరికి, "ఇదిగో ఈ ఇంట్లో ఉంటూ ఆ ఇంటికీ ఈ ఇంటికీ పోయి ఇలా దేవిరించి తెచ్చుకోవటం నాకు బావుండదు. చచ్చు లేకుండా తెగేసి చెపుతున్నాను. అలా బిచ్చమెత్తుకోవాలని బులపాటంగా ఉంటే వేరే యెక్కడయినా ఉండి—" అంటూ ఝంఝ్ మంది సర్వజయ.

ఇందిరమ్మ ఆ మాటలు దిగమింగివేసింది. నిత్యమూ ఇలాంటి మాటల్ని కొన్నిటిని, దిగమ్రింగక తప్పదు, దులిపేసుకోకా తప్పదు.

దుర్గమాత్రం ఎంతో అప్యాయంగా "అది ఎన్నిడబ్బులత్తయ్యా? ఎర్రగా అంచక్కగా ఉందికదూ!" అన్నది. ఆ పిల్ల దాన్ని సమాధాన పరుస్తున్న ధోరణిలో "నేను చచ్చిపోయే ముందు దీన్ని నీకే ఇచ్చిపోతాలేవే అమ్మాయ్! నువ్వు పెద్దదాని వయాక అంచక్కగా కప్పుకుందువు గాని" అన్నది.

ఎండి ఎండి వున్న నేలమీద వానచినుకులు పడితే వచ్చేవాసన లాంటి ఆ క్రొత్తగుడ్డ వాసనంటే ఇందిరమ్మకు ఎంతో యిష్టం. అది యెంతో హాయిని కలిగిస్తున్నట్లుంటుంది. ప్రొద్దున్నే ఆ దుప్పటి గుడ కప్పుకుని, వీధివాకిలి ఊడుస్తూ ఊడుస్తూ—మధ్య మధ్యన తన కేసీ తానే చూసుకునేది. పనిలేకపోయినా వీటికెళ్ళే దారిలో



"పథేర్ పాంచాలీ" చిత్రంలో సర్వజయగా నటించిన కరుణాబెనర్జీ.

గంచుని, దారినపోయే దాదుల్నీ, పాటుకుపోయే పాటకపు పడుచుల్నీ పిలుస్తూ "ఎవరా నెక్కేది? రాజా? ఎక్కడికింత పెందరాళే" అంటూ మొదలెట్టి, ఉపోద్ఘాతం అట్టే పెంచకుండానే, నవ్వుతూ వక్కోసారి తనకేసి చూసుకుంటూ, "ఇదా, ఈ దుప్పటిమాటేనా? అదిగో ఆ శెట్టి రామచందర్ తొమ్మిదణాల కొనిపెట్టి—" అంటూ మొదలు పెట్టేది.

ఒకళ్ళిద్దరు అల్లరిపిడుగులు మాత్రం "వాహ్! ఎర్రగళ్ళ దుప్పటి ఎంతబావుందో బామ్మకి! బామ్మ పెళ్ళా యేం?" అంటూ ఆవిడని ఆటలు పట్టించేవాళ్ళూ ఉండేవాళ్ళు.

6

ఓనాడు కూరలూ పళ్ళూ అమ్మే అమ్మి వచ్చి, నవ్వుమొహం పెట్టి "మీరో అర్ధణా యివ్వాలమ్మా, యిప్పుడిస్తారేమో అడిగి తీసుకుపోదామని వచ్చాను. నిన్న మీ ముసలమ్మగారొచ్చి, డబ్బులుకి రేపు రా అని చెప్పి, సీతాఫలం ఒకటి తీసుకున్నారు" అని చెప్పింది సర్వజయతో.

ఏదో పనిలోవున్న సర్వజయ - "ఏమిటీ సీతాఫలమా? కొనుక్కునివచ్చిందా నీ దగ్గర?" అని విస్తుపోతూ అడిగింది.

ఆ కూరలమ్మి చాలా గడుసుది, ఉట్టినే పారేసే చింతతుక్కై, ఊరికే కొనుక్కువచ్చే కరివేపరెబ్బ దగ్గర్నుంచి ఏదీ డబ్బు తీసుకోకుండా ఊరికే ఇవ్వదు. ఆ అమ్మి మాటల్లోని అణకువలేనమంతా మాయమైపోయింది. "కొనుక్కుని వచ్చిందో లేదో ఆవిణ్నే అడగండి. ప్రొద్దున్నే పాచిమొహంతో అర్ధణా డబ్బులకోసం అబద్ధమాడ్డవచ్చాననంటారా? అసలింకొకరి కెవరికీ అణాకి తక్కువకి ఇవ్వటమేలేదు నేను! ఏదోపాపం ముసిలావిడ వచ్చి, తినాలని మనసుపడి అడిగితే, పోనీలెమ్మని అర్ధణాకే యిచ్చాను" అన్నది.

సర్వజయకి ఎక్కడలేని కోపమూ వచ్చింది. కోపంతో గొంతు పట్టుకుపోయి, మాట పెకిలిరాలేదు. ఈ అడవిలో కోకొల్లలుగా దొరికే సీతాఫలాల్ని - వాటిని ఇక్కడ గొడ్లుకూడా తినవేం. అలాంటివాటేని డబ్బులిచ్చి కొనుక్కునితినే వాళ్లు ఈపల్లెటూరిదిక్కుక

ఉంటూరా అని సర్వజయ ఆశ్చర్యపడింది. సరిగ్గా ఇంతలోనే ఇందిరమ్మకూడా ఎక్కడినుంచో వచ్చింది. సర్వజయ ఆవిడమీదికి తారాజువ్వలా లేచి - "అవునూ, నాకు తెలియకడుగుతాను, ఊరు పొమ్మంటోంది, కాడు రమ్మంటోంది. తేరగా తిండి పెడుతున్నాం కదా అని మా డబ్బుకూడా తేలికయిపోయిందా నీకు? పోనీ అది సీతాఫలంకూడా డబ్బుపోసి కొనాల్సివచ్చిందా అంట! ఇవాళ సీతాఫలాలు, రేపు రామాఫలాలు - ఇలాంటివన్నీకూడా నీకెక్కడనుంచి తెచ్చిపెట్టేది నేను. అంత జిహ్వపీకితే దగ్గిర డబ్బుంటే ఇచ్చి కొనుక్కోవాలి. ఇతరులడబ్బు ఇంతలెఖ్ఖలేకుండా దుబారా చెయ్యటానికి మొహమాటమైనా ఉండొద్దూ మొహానికి?" అన్నది.

ముసలమ్మ ముఖంలో నెత్తురుచుక్క లేకుండా పోయింది. అప్పటికీ ఆవిడ నవ్వటానికి ప్రయత్నిస్తూ "ఏదో, ఈసారికి కాస్త చూసి ఇయ్యి అమ్మాయీ! చక్కగా నెట్టన పండి విచ్చిన అంత సీతాఫలం చూసేసరికి నోరూరింది. మళ్ళీ మళ్ళీ తినాలన్నా ఇంకెన్నాళ్ళు బ్రతుకుతాను మహా! ఆ అర్ధణా ఎలాగో అలా ఇచ్చేద్దూ" అన్నది.

సర్వజయ ఇంకో స్థాయి పైకి పోయి -."ఏం డబ్బంటే అంత అలుసుండావుందా నీ కంటికి. అంత తేలిగ్గావుంటే నీ చెంబూ — తప్పేలా ఏమైనావుంటే తాకట్టుపెట్టి ఇచ్చుకోరాదూ" అంటూ బిందె చంకనెట్టుకొని గొడ్డిగుమ్మాన ఏటికి వెళ్ళిపోయింది. కూరలమ్మి కాసేపు అలాగే నిలబడిపోయి, "నా రాత, నా ఖర్మ, సరుకు ఇచ్చి నేనింత ఇరుకున పడలేదెప్పుడూ...ఇందిరమ్మగారూ, మీరయినా దగ్గిర డబ్బులేనపుడు నిన్నవచ్చి పండు తెచ్చుకోవలసింది కాదు. ఇహనెప్పుడూ ఇలా అప్పు అని చెప్పి ఏమీ తెచ్చుకోకండి. మీ తలపులూ తగాదాలు ఏమైతే నాకెందుకు! పేదవాళ్ళం మేము. ఎక్కడో అక్కడ తెచ్చిఅయినా, నా డబ్బులు నాకు పారెయ్యండి. మళ్లీ మాపటేళొస్తాను" అన్నది.

దుర్గ ఆ అమ్మి వెనకాలే బయల్దేరి—"మా అత్తయ్యంటే మరీ ముసిలిది. సీతాఫలం కొనుక్కున్నందుకే అన్ని చీవాట్లు పెట్టాలా చెప్పు అమ్మీ. తినాలని ఎవరికి అనిపించదూ నువ్వు చెప్పు అమ్మీ! చక్కటిపండు. సగం నాకే పెట్టిందత్తయ్య. మా దొడ్లో కాశాయనుకుంటాను. అవునా అమ్మీ? ఎంత చెట్టేమిటి, చాలా పెద్ద చెట్టా? ...సరేకాని అమ్మీ! అనక ఓ కాని ఇస్తాను నీకు. నా బొమ్మల పెట్టెలో ఉందిలే. అమ్మ ఇంటితలుపు తాళంపెట్టి ఏటికి వెళ్ళింది. లేకపోతే ఇప్పుడే ఇచ్చేదాన్ని. మా అమ్మ వచ్చాక చాటుగా తెచ్చిఇస్తాలే నీకు. మళ్ళీ మా అమ్మతోమాత్రం చెప్పకేం?" అంటూ మెట్టా దాకా వచ్చింది.

ప్రొద్దు నడినెత్తిమీదకి వస్తూంటేగా ఇందిరమ్మ ఇంట్లోంచి బయటికి వచ్చింది. ఓ చేతిలో పాతగుడ్డలమూట, మరోక చేతిలో మాటేసిన ఇత్తడిచెంబు, చంకలో చిరిగి ఆకులు వేళ్ళాడుతున్న ఓ చాప ఉన్నాయి

"అత్తయ్యా! అత్తయ్యా? వెళ్లొద్దు అత్తయ్యా వెళిపోవద్దు. ఎక్కడికి వెడతావ్?" అంటూ దుర్గ పరుగు పరుగున వెనకాలే వచ్చి, చంకలో చాప లాక్కుంటూ "నువ్వు వెళిపోయావంటే నే నేడుస్తా నేనునుకున్నావో! వెళ్లొద్దు అత్తయ్యా" అన్నది.

సర్వజయ వసారాలోంచి "వెళ్లనియ్. వెళ్ళనియ్. అప్రాచ్యంగా ఎప్పుడుపడితే అప్పుడేనా ఏం వెళ్ళిపోవటం? పిల్లలుగల ఇల్లు. ఇన్నాళ్లూ ఎవరి తిండి తిన్నామో వాళ్ళ మేలు కూడా చూడాలా కాస్త! వేళకాని వేళ ఇలా ఉపోష్యంగా వెళిపోతే ఆ అనర్థం ఆనక వాళ్ళకే కొడుతుందిలేఅనేగా అంతర్యం. మనసులో ఇన్ని కుచ్చితపు బుద్ధులున్నాయి కనుకనే రాత కూడా ఇలా వేలాతేసుకొంది" అన్నది.

ఎన్ని అన్నా ఇందిరమ్మ మాత్రం తిరుగు మొహం పట్టలేదు. దుర్గ ఏడుస్తూ చాలా దూరం వెంటపడింది.

ఆవిడ తిన్నగా ఆ వీధిన ఉన్న నవీన్‌ఘోషాల్‌గారింటికి వెళ్ళింది. ఘోషాల్ గారి గృహిణి అంతా విని ముక్కుమీద వేలేసుకుని 'ఇదెక్కడి సోద్యం? ఇంత విడ్డూరం ఎక్కడా కనీవినీ కూడా యెరగం. పోనీలే పిన్ని! నీకేం తక్కువ? మాదగ్గిర ఇక్కడే ఉండు' అన్నది. రెండు నెల్లు ముసలమ్మ అక్కడే ఉండి, అక్కడి నుంచి తీన్‌కడీ ఘోషాల్‌గారింటికి, అక్కడినుంచి పూర్ణచక్రవర్తిగారి పంచకి వచ్చి చేరింది. ప్రతి ఇంట్లోనూ మొదట్లో చూపిన ఆదరణ రానురాను సన్నగిలి మాయమైపోతూ ఉండటం, ఆ ఇళ్లలో వాళ్లు ఎందుకో అందుకు ఉత్తపుణ్యానికే విసుక్కుంటూ ఉండటం పరిపాటి అయిపోయింది. ఎలాగో అలా తగువు తుంచుకుని మళ్ళీ అక్కడికే వెళ్లటంమంచిదని అందరూ సలహాలివ్వసాగారు. ఇందిరమ్మ మరో రెండు ఇళ్లు కూడా తిరిగింది. ఎవరిమాట యెలా ఉన్నా ఆఖరికి హరిహరుడైనా మళ్లీ ఇంటికి రమ్మని కబురంపకపోతాడా అని ఆవిడకి మహాఆశగా ఉండేది. కాని మూడునాలుగు నెలలు తిరిగి పోయాయి. ఎవరూ ఆమెని వచ్చి పిలిచినపాపానపోలేదు. చివరికి దుర్గయినా రాలేదు. 'ఆ వీధికీ ఈ వీధికీ చాలాదూరం, చిన్న పిల్ల అది ఒక్కత్తె ఎలా రాగలదు పాపం!' అని మనస్సును సరిపెట్టుకుంది ఇందిరమ్మ. ఆఖరికి ఆవిడే ఆశ కొద్దీ ఆ వీధికి ఒకటి రెండు సార్లు వెళ్ళింది. అయినా పిల్లది మాత్రంఎక్కడా కన్పడనే లేదు.

ఏటికేడాదీ ఇంకొకరిపంచన ఉండటమునేది నసిపడే సంగతి కాదు. తూర్పువైపున గొల్లచింత గొడ్లపాక ఊరికేనే ఉంటోంది. మరో రెండు నెలలు గడిచాక అందరూ ఒకమాట అనుకుని, ఇందిరమ్మ ఉండేందుకు ఆపాక యేర్పాటు చేశారు. ఆవాడ కట్టు వాళ్లందరూ ఆవిడకి సాయిలా పాయిలాగా ఉందామని కూడా అనుకున్నారు. చుట్టూ మిడతగోడలు పెట్టి వేసిన చిన్నపాక అది. వీధికి చిట్టచివర వెదుళ్ళతోపులో ఉంది. ఈ సంగతి ఆనోటా, ఆనోటా వెళ్ళి చివరికి సర్వజయ చెవినపడింది. 'ఎంత తామసమో చూడండా మనిషికి. ఏమయినా ఇహ ఆవిడ్ని మళ్ళీ ఈ ఇంటికి రానిచ్చే మాట కల్ల. ఒక్కసారివచ్చి పిల్లల్నయినా చూసి పోలేకపోయిన ఆ పీడాకారాన్ని ఇంక ఈ గడప త్రొక్కనిస్తానా?' అని కూడా ఎవరి ముందో సర్వజయ అన్నదిట! సాయంచేద్దామని అనుకున్నవాళ్లు మొదట్లో చాలా సానుభూతితోనే చేశారు. కాని రాను రాను ఆ సానుభూతికూడా సన్నగిలింది...

"అనామంత అభిమానం తెచ్చుకుని వెళ్ళవది ఎందుకు వచ్చేసాను? పిల్లది అంతగా ఏడ్చి, రాగాలెట్టి రమ్మని బ్రతిమాలిందాయె! ఏమాటకామాటే- దాని తల్లికూడా వద్దనే అందిగా నిజానికి!" అని అనుకుంటూ ఇందిరమ్మ పశ్చాత్తాపపడుతూండేది. తనమీద తనకే విచారం కలిగేది. దుఃఖం పొర్లుకు వచ్చి, వేళ్ళాడుతున్న దవడల మీదికి కన్నీళ్లు జారుతూ ఉండేవి. "బ్రతుకు అసాంతమైపోతున్న ఈ ఆఖరి రోజుల్లో భగవంతుడు నానొసని ఇన్ని కష్టాలు రాసి పెట్టాడా? ఈనాడు నా కూతురే బ్రతికిఉంటే—" అంటూ వాపోయేది ఇందిరమ్మ.

చైత్ర సంక్రాంతి. పగల్లా ఎండ పెట్లకొట్టేసింది. కాని సందెవేళకి మాత్రం కాస్త చల్లగాలి తిరిగింది. వైష్ణవ సభలోని భజనలింకా వినిపిస్తూనే ఉన్నాయి. తిరునాళ్లు ఇంకా అయిపోయి నట్టులేదు.

లోపల దిగుళ్లు, బయట ఎండల్లో రోజూ ఆ యింటికే ఈ

ఇంటికి తిరగవలసిరావటం వల్ల, నిత్యం సందెపడే వేళకి ఇందిరమ్మకి కొంచెం జ్వరం తగలటం ప్రారంభమైంది. పంచపాళీలో చాప పరచుకుని, తలాపి దిక్కున మంచినీళ్ళకుండ ఒకటి పెట్టుకుని, మెదలకుండా ముణుచుకు పడుకునేది. అవాళేసిన ఇత్తడి చెంబు కాస్తా ఈమధ్యనెప్పుడో అర్ధపావలాకి తాకట్టు పెట్టి బియ్యం కొనుక్కోవలసి వచ్చింది. జ్వరంలో దాహం వేస్తే మధ్య మధ్య ఆకుండలో నీళ్లు ముంచి తీసుకుని గొంతు తడిచేసుకుంటూ ఉండేది.

"అత్తయ్యా"

కప్పుకున్న చిరుగుల బొంత అమాంతం లాగి ప్రక్కకి త్రోసి వేసుకుని, ఇందిరమ్మ అదిరి, లేచి కూర్చుంది. దుర్గ వసారా గడప మెట్లు ఎక్కి వస్తోంది. ఆ పిల్లవెంట పొరుగింటి ఓహరీచక్రవర్తి కూతురు రాజి కూడా ఉంది. దుర్గ తెల్లని వోణీ వేసుకుంది. చెంగున ఏమిటో చిన్న మూటకూడా ఉంది. ముసలమ్మకి నోటమాట రాలేదు. ఎంతో ఆత్రంగా, సత్తువుడిగిపోయిన చేతుల్ని అట్టె చాచి, ఆ పిల్లని దగ్గరకు తీసుకుని జ్వరంతో కాలిపోతున్న గుండెలకి అదుముకుంది.

"ఎవరితోనూ చెప్పకు అత్తయ్యా, ఎవరికీ తెలియదసలు. తిర్నాలకు వచ్చిచూసి, చీకటిపడే వేళకి చప్పున ఇలా వచ్చేశాను. నాతో రాజికూడా వచ్చింది. తిర్నాల నుంచివస్తూ వస్తూ నీకోసమని తీసుకొచ్చాను అత్తయ్యా ఇది!" అంటూ దుర్గ చెంగున ఉన్న మూట విప్పింది.

"మిఠాయి అత్తయ్యా. మిఠాయి. నీకోసమని ఓ అర్ధణా పెట్టి మిఠాయి, ఓ అరగానీ లవుజుబిళ్ళలూ, తమ్ముడికి ఆడుకోటానికి ఓ కొయ్యబొమ్మ కొనుక్కొని వచ్చాను...ముసలమ్మ తిన్నగా లేచి కూర్చుని, వాటిని అటూ యిటూ పట్టుకుని చూస్తూ "ఏదీ! చూడనియ్, చూడనియ్. నా వరాలతల్లే, ఇంకేం తెచ్చావో చూడనియ్. మహారాణి కావాలి నా తల్లి. ఈ దిక్కుమాలిన అత్తయ్యంటే ఎంత తీపే చిట్టి తల్లీ! ఏదీ తమ్ముడి బొమ్మేదీ? చూడనియ్. వాహ్! అందక్కగా ఉంది, ఎంత అయిందే అమ్మా ఇది?" అని అడిగింది.

ఓ. విచిత కబుర్లన్నీ అయాక—"అత్తయ్యా, నీ ఒళ్లింత వేడిగా ఉందేం?" అని అడిగింది దుర్గ.

"ఏంలేదే! పగలల్లా ఊరంతా తిరిగిరావటంవల్ల అలా ఉందిలే. అందుకనే కాసేపు నడుం వాల్చి ఇలా పడుకున్నాను" అన్నదావిడ.

దుర్గ చిన్నపిల్లయినా అత్తయ్య ఎండలో తిరగవలసి రావటానికి కారణమేమిటో గ్రహించింది. దిగుల్తో, ఉపోషాలతో ఎండి ఒరుగైపోయిన అత్తయ్య ఒంటిమీద చెయ్యేసి, అపేక్షగా నిమురుతూ "ఏమయినాసరే, నువ్వు రావాల్సిందే అత్తయ్యా. సందెవేళ చక్కటి కథలకు మొహం వాచి పోయాను. రేపే వచ్చెయ్. ఏం?" అన్నది.

ఇందిరమ్మ ఆ మాటకి ఉబ్బి తబ్బిబ్బు అవుతూ—"మీ అమ్మే పిలుచుకురమ్మని పంపించిందనుకుంటా. అవునా?" అన్నది.

"పిన్నేమీ పిలుచుకు రమ్మనలేదు మామ్మా! ఇక్కడికని తెలిస్తే దాన్నసలు రానిచ్చేదే కాదుగా! మేమిలా అన్నామని తెలిసిందంటే తిట్టిపోస్తుంది కూడా. ఏమయితే యేంలే, నీ కెందుకు నువ్వు వచ్చెయ్. వచ్చాక కాస్త కలుపుకోలు తనంగా మాట్లాడావంటే చాలు, పిన్నయినా ఏమీ అనదులే—" అన్నది రాజి.

"రేపు నువు తప్పకుండా రా అత్తయ్యా. అమ్మ ఏమీ అనదులే. సరేనా! ఇహ నే నింటికి వెడతానయితే. ఈ సంగతి మాత్రం ఎవరితో చెప్పకేం. రేపొద్దున్నే మాత్రం వచ్చెయ్." అన్నది దుర్గ.

ప్రొద్దున్నే లేచేసరికి ముసలమ్మకి ఒళ్లు కొంచెం తేలిగ్గా ఉన్నట్లు తోచింది. ఓ గడియ ప్రొద్దు ఎక్కేసరికల్లా రెండు మూడు చిరుగుబట్టలు, కట్టుకునీళ్లు పోసుకునే రెండు పాత గుడ్డలు మూట కట్టుకుని బయలుదేరింది ఇందిరమ్మ. దారిలో సాతాని గోపని పెళ్లాం ఎదురై "మామ్మగారు మళ్ళీ ఇంటికి వెళిపోతున్నారల్లే ఉందే. వదినగారికోపం చల్లారిపోయి ఉంటుందనుకుంటా" అంటూ పలకరించింది. ఇందిరమ్మ ముసిముసి నవ్వొకటినవ్వి "నిన్న దీపాల వేళే మా పిల్ల నన్ను తీసుకు వెడదామని వచ్చిందిగా.—'అమ్మ చెప్పి రమ్మన్నదత్తయ్యా! రా, మనింటికి వెడదాం' అంటూ కళ్లనీళ్లెట్టుకు బ్రతిమాలింది. నువ్వు వెళ్లులే ఇవాళిటికి. నేను రేపు వస్తాను. ఎంత ప్రొద్దెక్కేనాసరే వస్తానుగా" అని సర్ది చెప్పి పంపాను. కాని ఎన్ని విధాల చెప్పినా పిల్ల విడిచిపెట్టేందుకున్నావా? ఏడ్పు, రాగాలెట్టి...చివరికెలా అయితే యేం వెళ్లింది. అందుకనే కాస్త పెందరాళే బయలుదేరి వెడుతున్నాను" అన్నది.

ఇందిరమ్మ వచ్చిచూస్తే ఇంట్లో యెవరూలేరు. నిన్న

రాత్రంతా జ్వరంకాయటం, తెల్లవారి పిలిక లేకపోయినా ఎండను పడిరావటంతో నిస్త్రాణ వచ్చినట్లుంది, ఆవిడకి చెవులు ఘుమియలు పడుతున్నాయి. మూట క్రింద పెట్టి, తన పంచపాళీ గడపలో చతికిల పడిందావిడ... కాసేపటికల్లా పెరటిగుమ్మం తలుపు త్రోసుకుని, బిందె బుజాన పెటుకుని సర్వజయ ఏటినుంచి వచ్చింది. యాదాలా పంగా ఇటుచూసే సరికి ముసలమ్మ చతికిలపడిఉండటం కన్పించింది. సర్వజయ నివ్వెరపోయి, కాసేపు ఆవిడకేసి అలాగేచూస్తూ నిలబడి పోయింది. ముందుగా ఇందిరమ్మే కాస్త నవ్వుమొహం పెట్టి-"కులాసాగా ఉన్నావా అమ్మాయ్". ఇన్నాళ్లకు మళ్ళీవచ్చాను. ఏమిటో వెర్రికాని ఈ వయసులో మిమ్మల్ని విడిచిపెట్టి నేనుమాత్రం ఎక్కడికి పోయిఉండగలను! అందుకనే-" అంటూ మొదలెట్టింది.

సర్వజయ రెండడుగులుముందుకు వేసి "ఈ ఇల్లంటే ఏమిటని నీ ఉద్దేశ్యం ?" అని నిగ్గతీస్తున్నట్లు అడిగింది.

ఆమె వాలకం, ఆ మాటలతీరు చూసేసరికి ముసలమ్మమొహం లోని నవ్వు కాస్తా ముణుచుకుపోయింది. సర్వజయ ఆవిడమాటని పూరనీయకుండానే "ఈ ఇంట్లో నీకింక చోటుఇచ్చేమాట ఉత్తకల్ల. ఈమాట నేనే నానాజే తెగేసి చెప్పానుకదా: మళ్ళీ ఏమొహం పెట్టుకుని వచ్చావ్ ఇక్కడికి ?" అని అడిగింది.

ముసలమ్మ కట్టె అయిపోయింది. ఆవిడ కింక గొంతు పెకల్లేదు. తర్వాత ఇహ చటుక్కున ఏడుపుమొహం పెట్టి-"అలా అనకు, అలా అనకమ్మా! ఇదివరకులాగానే నీపంచను కాస్త చోటు ఇయ్యి. అవసానకాలానికి ఇప్పుడు లేదంటేమాత్రం ఎక్కడికి పోగలను చెప్పు? ఈ జొంద ఎలాగో ఇహ ఈ గడ్డ మీద-" అంటూ బావురుమంది.

చివరి కిది ఇంతదూరం వస్తుందని ఇందిరమ్మకి మొదట్లో తట్టనే లేదు. నీళ్ళలో మునిగిపోతున్న మనిషి ఆతృణాని కేది చిక్కితే దాన్ని పట్టుకున్నట్లు ఇందిరమ్మకూడా అలాంటి ఏ గడ్డిపోచలాంటి దానైనా చేజిక్కించుకుందామన్న తాపత్రయంతో అటూయిటూ చూస్తూ కూచుంది. అనాదిగాఉంటున్న ఈ ఆశ్రయం కాస్తా ఇప్పుడిహ నిజంగానే పాదాలక్రిందనుంచి ప్రక్కప్రక్కకి జరిగిపోతున్నట్లు తోచింది. ఇప్పుడిహ దాన్ని గట్టిగా నొక్కిపట్టుకుని నిలుపుకునే ఉపాయం ఏమీ కన్పించలేదు.

"వద్దు, వద్దు వెళ్లు. ఇంక ఇక్కడ ఒక్క క్షణంకూడా ఉండటానికి వీల్లేదు, వెళ్లు. ప్రొద్దు నెత్తిమీద కొస్తోంది. నాకింకా గంపెడు చాకిరీ ఉంది. పోయిచేసుకోవాలి. ఏమయినా సరే నీకిక్కడింక చోటు యివ్వటం మాత్రం ఉత్తమాట!" అన్నది సర్వజయ.

మూట తీసుకుని మళ్ళీ లేచేసరికి ఇందిరమ్మకి ప్రాణం పోయినట్లయింది. ముందు వాకిలిదాటి వీధిగుమ్మందగ్గర వస్తూంటే అక్కడ తాను మనసుపడి వేసుకున్న బొప్పాయిచెట్టు ఒరిగిపోయి గోడకి ఆనుకుని ఉండటం కన్పించిందామెకు. ఈ మూడునాలుగు నెలల నుంచీ దాన్ని చూసినవాళ్లెవరూ లేరు. ఈ గడ్డను మొలిచిన గరిక మొక్కదగ్గర్నుంచీ, ఎంతో ముచ్చటపడి పెంచుకున్న ఈ బొప్పాయిచెట్టు, నిమ్మచెట్టు, ఈ పిల్ల, పిల్లవాడు, వ్రజబాబాయ్ గారి ఈ పాటిదిబ్బ—ఇవే ఆమె సర్వస్వం. తన డెబ్బై అయిదు సంవత్సరాల జీవితంలో ఆవిడ కింతకంటె తెలిసినవీ లేవు. తెలుసుకోవాలని తాపత్రయపడినవీ లేవు. ఇవన్నీ యీనాడు తననుంచి విడిపడి పోతున్నాయి.

మూట చంకనెట్టుకుని, వెళిపోతూంటే రాయ్‌గారిల్లాలు—"మామ్మగారెక్కడికో వెడుతున్నట్లున్నారేమిటి? మళ్ళీ యిహ ఈ యింటికి రానే రారాయేం?" అని అడిగి, జవాబు ఏమీ రాకపోవడంతో "మామ్మగారి కీమధ్య చెవులు మరీ దిబ్బెళ్లు వేసినట్లున్నాయి" అన్నది.

దీపదీపాలవేళ ఆవీధినుంచి యెవరో వచ్చి, "మీ ముసలమ్మగారికి ప్రాణం కడగట్టినట్లుంది. మధ్యాహ్నాంనుంచి పాలిత్ గారి

ఎవరాతడు?

ప్రబోధకుడు:—బయల్దేరే ముందే అతడు తన గమ్యస్థానం నిశ్చయించుకున్నాడు. అంతే, ముక్కుకు సూటిగా, పయనమయ్యాడు. కుడికి తిరగ లేదు. ఎడమకు చూడ లేదు. ఆప్తులుకాని, మిత్రులుకాని, శత్రువులుకాని, ఎవరూ అతడి మార్గానికి అడ్డురాలేదు. వచ్చినవారు నిలవలేదు. ఆయన ఎవరో మీకు తెలిసేఉండాలి."

"తెలిసే దేముంది. పొగ రెక్కిన లారీ డ్రైవరు"అన్నాడు చురుకైన సభికుడు.

పిడకలగూడుప్రక్కన పడుకున్నది పడుకున్నట్లే వుంది. ఎండమూలంగా వెనక్కి రాలేకపోయిందో ఏమో! వెళ్ళి చూసిరండి. బాబుగారున్నారా ఇంట్లోకి పంపించండి చప్పున" అని సర్వజయతో చెప్పివెళ్ళారు.

పాలిత్ వాళ్ళ పిడకలగూడుప్రక్కన ఇందిరమ్మ కడప్రాణంతో పడివున్న మాట ఒట్టిది కాదు. ఇంటిదగ్గర్నుంచి వస్తూ, ఎండలో ఒళ్ళంతా ఎలాగో ఉన్నట్లనిపించి, ఇక ముందుకు సాగి వెళ్ళలేక అక్కడే పడిపోయింది. పాలితూ—వాళ్ళూ ఆమెనెలాగో సత్రం అరుగుమీదికి చేరవేసి పడుకోబెట్టారు. చెయ్యవలసిన ఉపచారాలెన్ని చేసినా ఆమె పరిస్థితి ఏమీ బాగుపడకపోవటంతో మళ్ళీ క్రింద పెట్టేశారు. ఇరుగుపొరుగువాళ్లందరూ వచ్చి ఆమె చుట్టూ మూగారు. "ఈ యెండలో యెందుకు బయలుదేరట మసలు" అన్నారొకరు. "ఎండేమిటి? మండబెట్టేసిం దివాళ" అన్నా రింకొకరు. "ఫర్వాలేదు. ఇప్పుడే తేరుకుంటుంది. కొంచెం వచ్చినట్లుంది. అంతే" అన్నారు మరొకరు.


"వోషేమిటి? ఆశలేదిహ. ముసలమ్మ బ్రతకదు. హరిహర రాయ్ ఊళ్ళోకూడా లేడులేవుంది. కబురయితే వెళ్ళింది కాని ఆయన లేకపోయాక ఇంక వచ్చేవాళ్లెవరుంటారు ?" అన్నాడు విశూపాలిత్.

ఈ కబురు విని దీనూచక్రవర్తి పెద్దకొడుకు ఫణి సంగతేమిటో చూసి పోదామని వచ్చాడు. "రా, బాబూ! ఏదో ఇంకా అదృష్టం బాగుంది కనుక నువ్వయినా వచ్చావ్. కాస్త పచ్చిగంగ ఆవిడ గొంతులో పొయ్ పాపం! ఇదేమయినా బ్రాహ్మణవాడా ఏమన్నానా?—పోనీ ఎవరమూ ఒకరం గొంతులో నీళ్లు పోయటానికి" అన్నా రందరూ. ఫణి తనచేతిలో ఉన్న కొలుపుకర్ర విశూపాల్ చేతికందించి, ముసలమ్మ దగ్గరకొచ్చి కూర్చున్నాడు. ఎవరింట్లోనుంచో గంగచెంబు ఒకటి తెప్పించి, ఉద్ధరిణెడు గంగ ఆమె గొంతులో పోసి "అత్తయ్యా!" అని పిలిచాడు.

ఇందిరమ్మ కళ్లు తెరిచి, అతడి ముఖంకేసి, వెలవెల పోతున్నట్లు చూస్తూ అలాగే పడుకుంది. ఫణి మళ్ళీ—"ఎలా వున్నదత్తయ్యా' కాస్త ఉసులుగా ఉన్నదా ఏమయినా?" అంటూ ఇంకొక ఉద్ధరిణెడు గంగ పోశాడు. కాని అది గుటకపడలేదు. అయినా "ఇంకా కాసిని పోసి చూడు బాబూ" అన్నాడు విశూపాలిత్.

మరో రెప్పపాటులో ఇందిరమ్మ శాశ్వతంగా కన్ను మూయగానే, కనుకొలకుల్లో నిలిచివున్న నీళ్లు చిక్కిపోయిన చెక్కిళ్లమీదికి, గుటకపడని గంగనీళ్లు పెదవులచివరకు దిగజారాయి......

ఇందిరమ్మ మృత్యువుతో నిశ్చిందిపురంలో ఆ పాత తరం పూర్తిగా అంతరించిపోయింది... (ఇంకా వుంది)



శేషపర్వతశ్రేణి చిట్టచివరికొండమీద వెలిసిన శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయం. "శ్రీశైల దర్శనాన్ముక్తిః" అని కైవల్యోపనిషత్తులో చెప్పబడింది. ముక్తిసాధనకు ఈమార్గంకూడా ఏమంత సులభసాధ్యంకాదు. దుర్గమమైనమార్గంగుండా ఎన్నో కొండలూ, గుట్టలూ దాటుతూ వెళ్ళాలి. ఈ పుణ్యసీమనే ఆదిశంకరులు శ్రీ చక్రప్రతిష్ఠ చేశారు.

మహాశివరాత్రి

మాఘ కృష్ణ చతుర్దశినాడు మహాశివరాత్రి పర్వదినం. ఇది ఆంధ్రదేశంలోనే కాక భారతంలో అంతటా గొప్ప పర్వదినంగా పరిగణిస్తున్నారు.

శివరాత్రి శైవులకు చాలా ముఖ్యమైనది. ఆనాడు పగలంతా ఉపవాసం చేస్తారు. రాత్రి జాగరణం చేస్తారు. ఈ విధంగా ఈ వ్రతం ఆచరించినవారి పాపాలన్నీ నశించిపోతాయని శైవపురాణాలు చెబుతున్నాయి.


శివరాత్రి మహాత్మ్యాన్ని గురించి ప్రాచీనకాలంనించీ చిత్రచిత్రమైన గాథలెన్నో వినవస్తున్నాయి.

పూర్వకాలంలో ఒక అరణ్యంలో ఒక బోయవాడుండేవాడట. అతడొక కోమటికివ్వవలిసిన బాకీ చెల్లించలేకపోయాడు. ఆ కోమటి అతణ్ణి ఒక శివాలయం ఆవరణంలో బంధించి వేశాడు. అంతలో శివరాత్రి వచ్చింది. బోయవానికి ఆనాడెవరూ అన్నం పెట్టలేదు. రాత్రికూడా ఆ ఆకలితో అలాగే జాగరం చేశాడు. రాత్రి భక్తులుచ్చరించే శివ నామావళి విన్నాడు. మరునాడు కొందరు భక్తులు అతడు కోమటి కివ్వవలిసిన అప్పు చెల్లించివేసి ఖైదులోనించి విడిపించారు.

తరవాత ఆబోయవాడు యథాప్రకారం అడవిలో వేటాడడానికి వెళ్ళిపోయాడు. రాత్రివేళ ఒక మారేడు చెట్టెక్కి కూర్చున్నాడు. చెట్టెక్కేటప్పుడు తనకు దారిలో అడ్డం వచ్చిన రెమ్మలన్నీ విరిచి కింద పారవేశాడు. అవి ఆకులతోసహా ఆ చెట్టుకిందనే ఉన్న ఒక శివలింగంమీద పడ్డాయి. ఆ విధంగా అతడు శివలింగానికి పూజ చేసినట్లయింది. అతడా రాత్రి అంతా చలివేసినప్పుడు హేళనగా శివ శివా అని శివనామ జపం చేశాడు. చెట్టుమీదనించి పడిపోతానేమో అనే భయంతో రాత్రి రాత్రి అంతా అలాగే మేలుకుని ఉన్నాడు.

ఇంతలో ఒక జింక అక్కడికి వచ్చింది. దానిని చంపడానికి విల్లెక్కుపెట్టాడు. అది మనుష్యభావతో తన పిల్లజింకతో చెప్పివస్తాననీ అంతవరకు చంపవద్దనీ బతిమాలుకుంది. బోయ అతికష్టంమీద దాని కంగీకరించాడు.

ఆ జింక అక్కడినించి వెళ్ళిపోయి సంగతి



ఆంధ్రావనిని పునీతం చేసిన త్రిలింగేశ్వరులలో, ద్రాక్షారామక్షేత్రంలో వెలసిన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం.

అంతా ఆడజింకతో చెప్పింది. ఆడజింక తానుకూడా ఆ బోయవాని కాహారమైపోతానని అన్నది దానితోబాటా జింకపిల్లలుకూడా తాము ఆబోయవానికాహారమైపోతామని తయారైనాయి. మరునాడు కొంచెం పొద్దెక్కేసరికి అవ్వన్నీ ఆ బోయవానిదగ్గిరికి వెళ్ళిపోయాయి. బోయవాడు జింకలు మాట తప్పకుండా తిరిగి వచ్చినందుకు ఎంతో ఆశ్చర్యపోయాడు.

ఇక తానలాంటి ఘాతుకకృత్యాలు చెయ్యనని శపథంపట్టి విల్లమ్ములు దూరంగా విసిరివేశాడు. ఆ విధంగా శివరాత్రినాడు ఉపవాసం చేసి జాగరణం చెయ్యడంవల్ల, ఆ మరునాడు తీవని తెలంపుగా చేసిన శివపూజవల్ల అతని పాపాలన్నీ భస్మీపటలమైపోయాయి. అతడా విధంగా జీవహింస విరమించి శివభక్తుడైనందుకు దేవతలెంతో సంతోషించి అతనిమీద పుష్పవర్షం కురిపించారు.

ఇలాగ శివరాత్రి మాహాత్మ్యం ప్రతిపాదించే గాథలెన్నో మన పురాణాల్లో వినవస్తున్నాయి.

శ్రీనాథమహాకవి రచించిన శ్రీ శివరాత్రిమాహాత్మ్య కావ్యంలో శివరాత్రి ప్రశస్తి వర్ణించే గాథలెన్నో కనిపిస్తున్నాయి.

శివరాత్రి ఎక్కువగా శైవులకే ప్రధానమైన పర్వదినం. ఆంధ్రదేశంలో ఇది చాలా పెద్ద పర్వదినం. శైవులేకాక స్మార్తులలో కూడా చాలామంది శివరాత్రి అతి ముఖ్యమైన పర్వదినంగా పరిగణిస్తున్నారు.

భవిష్యత్పురాణంలోను, శివస్కాంద పురాణాల్లోను శివరాత్రిని గురించిన విశేషాలెన్నో కనిపిస్తున్నాయి. భవిష్యత్పురాణంలో దీనిపేరు - శివ చతుర్దశి. సామాన్యంగా పురాణాలన్నింటిలోను మాఘ కృష్ణ చతుర్దశినాడే శివరాత్రివ్రతం ఆచరింపవలెనని ఉన్నది. అయితే ఈ భవిష్యత్పురాణం మాత్రం మార్గశిర శుక్ల త్రయోదశి శివరాత్రిగా పరిగణింపవలెనని నిర్దేశిస్తున్నది. దీనికి కారణమేమో తెలియదు.

అయితే మనదేశంలో అంతటా మాఘ కృష్ణచతుర్దశినాడే మహాశివరాత్రి జరుపుతున్నారు. ప్రతిమాసంలోను బహుళ చతుర్దశి మాసశివరాత్రిగా జరిపే ఆచారంకూడా ఉన్నది.


శివపూజ

చాలా ప్రాచీనకాలంనించీ మనదేశంలో శివపూజ జరుగుతున్నట్టు నిదర్శనాలు కనబడుతున్నాయి.

పతంజలి తన మహాభాష్యంలో శివస్కందాది దేవతల ప్రతిమల వ్యాపారం సాగించేవారిని గురించి ప్రత్యేకంగా పేర్కొన్నాడు. ఇంతేగాక అతి ప్రాచీనమైన తైత్తిరీయోపనిషత్తులో "తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి తన్నో రుద్రః ప్రచోదయాత్." అనే శివప్రతిపాదకమైన మంత్రం కానవస్తున్నది ఇంకా వేదాల్లోకూడా కొన్నిచోట్ల శివభక్తిప్రధానమైన మంత్రాలు కనబడుతున్నాయి. దీనినిబట్టి చాలా ప్రాచీన కాలంనించీ మనదేశంలో ఏదో రూపంలో శివపూజ జరిగేదని నిశ్చయించవచ్చును

త్రిలింగ దేశము

ఆంధ్రదేశంలో శివపూజకున్న ప్రాధాన్యం చాలా విశిష్టమైనది. ప్రసిద్ధమైన శ్రీశైల దాక్షారామ కాళేశ్వరాలవల్లనే మన దేశానికి త్రిలింగదేశమనే వ్యవహారం ఏర్పడి



శ్రీకాళహస్తీశ్వర క్షేత్రం. పృథివ్యప్తేజోవాయ్వాకాశలింగాలలో ఇక్కడ ఉన్నది వాయులింగం. ఇక్కడ ప్రవహించే పుణ్యనది సువర్ణముఖి, అగస్త్యమహర్షి తపఃఫలం అని ఒకగాథ.

ఉండవచ్చునని చరిత్రకారులు కొందరూహిస్తున్నారు. ఆంధ్రదేశంలో సుప్రసిద్ధమైన శైవక్షేత్రాలింకా ఎన్నెన్నో ఉన్నాయి.

వీర శైవం

వీరశైవం ఒకప్పుడాంధ్రదేశంలో బాగా కొలువైంది. ఈ మతం వర్ణవిభేదాలు నిర్మూలించి సర్వవర్ణాలవారికీ సమానత్వం ప్రతిపాదించింది.

అయితే ఆ సర్వ సమానత్వం క్రమక్రమంగా అంతరించిపోయి నేటికాలంలో వీర శైవులలోకూడా కొన్ని వర్ణ విభేదాలు తారతమ్యాలు ఏర్పడ్డాయి.

శైవమతం ఒకప్పుడు కాశ్మీరం మొదలుకొని కన్యాకుమారి వరకు సర్వత్ర రీతులలో విలసిల్లినట్లు నేరకమైన చారిత్రిక నిదర్శనలున్నాయి.

ఆంధ్రదేశంలో సుప్రసిద్ధమైన శివక్షేత్రాలు మూడూ దేశానికి అత్యంతముఖ్యమైన మూడా ప్రాంతాలలో ఉన్నాయి. వీటిలో ప్రప్రథమగణ్యమైన శ్రీశైలం రాయలసీమలో ఉన్నది. రెండవది తెలంగాణాలో ఉన్నది. మూడవది సర్కారు జిల్లాల్లో ఉన్నది. ఆంధ్రదేశం ఇంతకాలంగా ఛిన్నాభిన్నమై పోయింది. ప్రప్రథమంగా ఈ సుప్రసిద్ధ శైవక్షేత్రాలు మూడు ఒకే విశాలాంధ్ర రాష్ట్రంలోనికి వచ్చివేస్తున్నాయి. ఇది చారిత్రికంగా చాలా ముఖ్యమైన విషయం.

ఈ విధంగా ఈ సుప్రసిద్ధ శైవక్షేత్రాలు మూడు ఆంధ్రజాతి ఏకైక పరిపాలనలోనికి వచ్చిన ఘట్టాలు మన జాతిచరిత్రలో చాలా స్వల్పంగా ఉన్నాయి.

ఈ కారణంవల్ల ఈ శివరాత్రి రాజకీయంగా కూడా ఆంధ్రులకు చాలా ముఖ్యమైనది.

ద్వాదశ జ్యోతిర్లింగాలు

భారతదేశంలో అంతటా సుప్రసిద్ధమైన ద్వాదశ జ్యోతిర్లింగాలున్నాయి. ఇవి శైవులకే కాక భారతీయులందరికీ పరమ పవిత్రమైన శైవ పుణ్య క్షేత్రాలు.

వీటిలో శ్రీ శైలేశ్వరుడు, దాక్షారామ భీమేశ్వరుడు ద్వాదశ జ్యోతిర్లింగాలలోనివారుగా పరిగణింపబడుతున్నారు.

ఇంకా కాళహస్తి, ముఖలింగము మొదలైన యావద్భారత ప్రశస్తి పొందిన శైవ క్షేత్రాలెన్నెన్నో ఉన్నాయి. ఆంధ్రజాతి, ప్రభుత్వము ఈ శైవ క్షేత్రాలకు తిరిగి ప్రాచీనకాల గౌరవం కల్పించి ఆయా క్షేత్రాలలో యథావిధిగా నిత్య పూజాదికం జరిగించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

శివరాత్రినాడు శివనామోచ్చారణతో చలి పూర్తిగా తొలగిపోగలదనే నమ్మిక ఒకటి మనలో అనాదికాలంనుంచీ ఏర్పడి ఉన్నది.

రేపు మార్చి పదవ తేదీనాడు వచ్చే మహాశివరాత్రితో ఆంధ్ర జాతి చరిత్రలో నే చలికాలు తొలగిపోగలదనీ నూతన వసంతోదయం కాగలదనీ ఆశిస్తున్నాను.

—శాస్త్రి

సంపాదన

రాజవరపు పార్థసారథి

కిటికీ చువ్వలలోంచి చొచ్చుకొని, వచ్చిన సూర్యకిరణాలు సూటిగా కంటి రెప్పలపై పడటంతో - బుచ్చి రామయ్యకు గబుక్కున మెలకువ వచ్చింది. ఇంత ఎండ వచ్చేవరకూ ఎప్పుడూ పడుకొని వుండలేదు. ఇంటిగోడలూ, వస్తువులూ అన్నీ చైతన్యరహితంగా కనిపించసాగాయి. ఒక్క మొగం వేసుకొన్నట్లు - విచారంగా వున్నాయి. మనస్సులో ఒకవిధమైన - ఆందోళనా, భయమూ మొదలుగాగల అనుభూతులు బయలుదేరాయి. గుండె త్వరత్వరగా కొట్టుకోవటం మొదలెట్టింది. భవిష్యత్తు శూన్యంగానూ, అర్థరహితంగానూ కన్పించసాగింది. ఆ రోజువరకూ ఓ విధమైన కార్యక్రమమూ విధోవిధంగా బండి నిస్పృహలనే ధీమా ఉండేది. తనకిష్టం లేకపోయినా — ప్రభుత్వంమాత్రం "నువ్వు చాలాకష్టపడ్డావు గనుక - హాయిగా విశ్రాంతి తీసుకోరా బాబూ" అంది. తలచుకొంటే — తన సర్వీసు ఇంకా అయిదు సంవత్సరాలు పొడిగించవచ్చు. కాని కమీషనరుగారి అభ్యర్థి కొకడికి - నిరుద్యోగంనించి విముక్తికల్పిద్దామనే సదుద్దేశంతోనూ — ఛయిర్మన్ గారి తోటాకు - రామన్న చౌదరిని తన పదవిలోకి ప్రమోషన్ చేద్దామనీ - ఒకేదెబ్బకు రెండు పిట్టలు అనే సామెతగా - తన సర్వీసు ఇంక అవసరములేదు గనుక "యింకా శ్రమ ఎందుకు? హాయిగా విశ్రాంతి తీసుకోక? అని హితం పలికారు. నిజానికి తనకే విశ్రాంతి తీసుకుందామనే వుంది. కాని గడిచేదెల్లాగ? తను చేసిన పాతిక సంవత్సరాలసేవకు - తనకు మిగిలింది, అయిదు వేల ఆరువందల రూపాయిలు ప్రావిడెంటు ఫండు మాత్రమే. కాని ఈ డబ్బు ఎందుకు సరిపోతుంది?

దుప్పటి కొంచం పైకి లాగుకొని - ఎడంవైపుకి వత్తిగిలాడు.

"ఏమండీ? ఇంకా మీకు తెల్లారలేదా! అప్పుడే వర్సన్న ఒకసారి వచ్చి మళ్ళా సాయంత్రం కనబడతానని వెళ్ళాడు. పెద్దమ్మాయి ఈవేళే మెయిల్లో వస్తోందికదా? పెందరాళే వెళ్ళి ట్రెజరీలో డబ్బు మార్చి మెయిలుకెళ్ళి అమ్మాయిని తీసుకు రండి. రేపటినించి - హాయిగా కావలసినంత నిద్రపోవచ్చు". నుక్క తిప్పకుండా అనేసి, సన్మానికి కట్టబడిన లక్ష్మీబొమ్మగల తెరను తొలగించుకొని వెళ్ళిపోయింది భార్య కాసులమ్మ.

బుచ్చిరామయ్యను భయం పూర్తిగా ఆవహించింది. ఇవన్నీ తన దరిద్రానికి హేతువులనుకున్నాడు. ఇంతవరకూ గౌరవంగా బ్రతుకుతూ వచ్చాడు. రేపు ఎల్లాగ? ఏదో జ్ఞాపకం వచ్చినట్లు గభాల్ని లేచి డ్రాయరుసొరుగు తీశాడు. అయిదు వేల రూపాయల చెక్కు తనకి మిగిలింది — అదే ఆ సంచిలోంచి డబ్బు తీసుకుపోవడానికి అప్పుడే బాకీదార్లు - నక్కల్లా కాచుకు కూర్చున్నారు. దాని ప్రక్కనే నీలం కవరు. అది తన అల్లుడి దగ్గరనించి వచ్చింది. ఓసారి తీసి మళ్ళా చదివాడు.

"మహారాజశ్రీ బుచ్చిరామయ్యగారికి - తమ అల్లుడు నమస్కరించి వ్రాయునది—

ఉభయకుశలోపరి. ఈ మధ్య ఈ వూళ్ళో ఉన్న సినిమాహాలు ప్రొప్రయిటరుకీ, నాకూ కొంచం తగాదావచ్చింది. దాంతో నేను లంచం పుచ్చుకొన్నట్లు పిటీషన్లు వెళ్ళడం - ఎంక్వయిరీ అవటంకూడా జరిగింది. అది నిరూపణకానట్లు వ్రాయించుకోవాలంటే - ఎంక్వయిరీ ఆఫీసరుకు ఓ పచ్చకాగితం సమర్పించుకోవాలి - లేకపోతే - పుచ్చుకోకపోయినా లంచం పుచ్చుకున్నట్లు నిరూపణ అవ్వటం - నా ఉద్యోగం ఊడటం అనుమానం లేకుండా జరుగుతాయి. మీరు రిటైర్ అయినట్లు తెలిసింది. సంతోషం. గనుక మీకు ఈ ఉత్తరం అందినవెంటనే ఒకవంద రూపాయలు పంపవలెను. మీ పెద్దమ్మాయిని పురిటికి పంపుతున్నాను. పదో తారీఖు మెయిలుకువచ్చి రిసీవ్ చేసుకోవలెను. డబ్బు తప్పక పంపవలెను. ఇంతే సంగతులు." ఉత్తరం కవర్లో పెట్టేశాడు - వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

పిల్లింతా దొంగల్లాగ కనబడ్డారు. తనజీవితమంతా ధారపోసి శరీరాన్ని పిల్చి, పిప్పిచేసి - సంపాదించిన అయిదువేల ఆరువందల రూపాయిలూ - త్రవ్వుకుపోవడానికి కూర్చున్నారు. హుఁ - ఈ బాకీలు అవీ తీర్చేస్తే హళ్ళికి - హళ్ళి - సున్నకి. సున్న.

పెద్దపిల్ల పెళ్ళికి - ఉన్న ముండువా లోగిలి కాస్తా తనఖాపెట్టి కంట్రాక్టరు వర్సన్న దగ్గర - రెండువేలు అప్పుతీసుకొని - ఏదో! "అయింది." అనిపించాడు. దానితో కొంతభారం తగ్గింది అనుకున్నాడు. కాని ఇంతలోనే - అల్లుడు కాస్తా ఉద్యోగం వదులుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని కలగన్నాడా? సంపాదన లేకపోయినా సంతానానికి లోటు ఉండకూడదు కాబోలు - అప్పుడే పెద్దమ్మాయి పురిటికి సిద్ధం. ఇంకా పెళ్ళికి చేసిన అప్పు తీర్చనేలేదు. విడవలేకపోయాడు! ఆత్మగౌరవమంటే? - అయినా పెద్దవాళ్ళతోటే డబ్బున్న వాళ్ళతోటి పేచీలూ, పట్టింపులూ ఏమిటి? ఓ నమస్కార బాణం వదిలేస్తుంటే అన్నీ సద్దుకుపోతాయి. తను ఎన్నివిధాలా మారాడు తన సర్వీసులో - ఎంతమంది ఆఫీసర్లని డబ్బున్నవాళ్ళని చూశాడు? - అయినా ఈ దశమగ్రహాన్ని మించిన గ్రహంలేదు. మిగతా గ్రహాలు - ఏదో అభిషేకంతో శాంతిస్తాయి - ఈ గ్రహానికి కనకాభిషేకం చేసినా తృప్తికలగదు.

పోనీ తను ఖర్చుపెట్టిన డబ్బు - తన కొడుకు గోపాలం ద్వారా భర్తీ చేద్దామనుకుంటే - వీడు ఎందుకూ పనికిరాని అప్రయోజకుడుగా తయారయ్యాడు. ఇరవై రెండో ఏడు దాటుతున్నా ఇంకా వస్తు మొయ్యలేడు. సంసార బాధ్యత తెలియదు. ఉద్యోగాన్వేషణా చెయ్యలేడు. పోనీ ఈ మున్సిపాలిటీలో నేనా ఇప్పిద్దామంటే - అదిగో డిగ్రీ ఒకటి ఏడిసిందిగా? లోకలు బోర్డు సర్వీసు, ముఖ్యంగా గుమాస్తాగిరి చెయ్యనంటాడు. చేసినవాళ్ళ చరిత్రలు చెప్పి - వాళ్ళేం సుఖపడుతున్నారు? అని అడుగుతాడు. పోనీ మంచిది గొర్రెకైనా కాసేనా చెయ్యవుగాని అని ఒప్పించి తీసుకెళ్తే - ఆరోజున పెళ్ళి సంభాషణ.

"ఏమండీ! గోపాలంగారూ ఇల్లాగ దయ చేశారు;" వ్యంగ్యంగా అన్నాడు చెయిర్మన్.

"ఏదేనా, గుమాస్తాగిరీకోసం."

"మీరూ - ఈ చక్రంలో పడిపోతే ఎల్లాగ? మన దేశం ఎక్కువగా గుమాస్తాలను తయారుచేసి పారేస్తోంది. ఎవరి వృత్తులు వారు నిర్వహిస్తే నిరుద్యోగం - మాపు లేకుండా పోతుంది!" ఇదివరలో - సభలో మాట్లాడిన గోపాలం మాటలు తిరిగి జ్ఞప్తికి తెచ్చాడు. "తమరు ఏదేనా వృత్తిని చూసుకోవచ్చు.

సంపాదన

ఎవరికి నేనా సభల్లో- ఏకేటప్పుడు, స్థితి తెలుసుకు మాట్లాడుతూ ఉండాలి ?"

ఇదీ ఆరోజు జరిగిన సంభాషణ-వెనకటి పెద్దపెద్ద విషయాలెందుకు. దేశం ఏమయితే వీళ్లకెందుకు ? చెయిర్మన్‌ని బహిరంగం చెయ్యడం ఎందుకు ? మేనేజరుకొడుకు కావటంవల్ల లోగుట్లు తెలిశాయిగాని-ప్రజలకేమున్నా తెలుసా ? ఎందుకొచ్చిన బి. ఏ ? డబ్బూ తగలేశాడు. కృష్ణమూర్తిగారబ్బాయి ఓవర్సీరు కోర్సు ప్యాసయ్యాడు— రెండు చేతులతోనూ సంపాదిస్తున్నాడు. ఉద్యోగంలో చేరి ఆరునెలలయిందో లేదో? అప్పుడే ర్యాలీసైకిలూ, ఒమేగా రిస్టువాచీ కొనుక్కున్నాడు. సలక్షణంగా పెళ్ళి చేసుకొని పెళ్ళానికి మామిడిపిందెల నెక్లేసు కూడా చెయించాడు. వీడూ ఉన్నాడు ? అస్తమానూ ఏదో పుస్తకం పట్టుకోడం, కూర్చోడమూ ! అదిగో ఆ నిరుద్యోగాశ్రమం, లైబ్రరీ ఉండెకదూ. అదే వీడి నిలయం. ఆ పుస్తకాలు కూడూ గుడ్డా పెడతాయా ?- బాగా వెనకాల జమీలుపడి ఏడుస్తూ ఉంటే- చెయ్యాలిసిన పనులివి.

ఇంతలోకే- కొంప మునిగిపోయినట్లు "నామాట ఏంచెప్పేవ్ నాన్నా ?"అంటూ రెండోపిల్ల శ్యామల పెద్దమనిషిఅయి పెళ్ళికి సిద్ధంగా కూర్చుంది.

నర్సన్న బాకీ వడ్డీతోసహా రెండు వేల ఆరువందలూ తీర్చేస్తే మిగిలింది మూడు వేలు. ఇందులో అవీ, ఇవీ చిల్లరబాకీలు వెయ్యి. మిగిలిన రెండువేలలో రెండోపిల్లను పంపిస్తే మిగిలింది చిప్పా, కర్రా.

తను రిటైరయినవాడు, జ్ఞాపకార్థం భగవద్గీత, దంతపు పిడిగల చేతికర్రా ఇచ్చారు గాని, ఒకచిప్పా, కర్రా ఇస్తే బాగుండేది.

లేచి ముఖం కడుక్కొని- కాసులమ్మ యిచ్చే కాఫీగ్లాసు అందుకుని- భార్యకేసి అదేపనిగా చూడటం మొదలు పెట్టాడు.

"అదేమిటండీ! అల్లాగ వెర్రిచూపులు చూస్తారేం!" అని తనవళ్లు ఓసారి చూసుకుంది.

"ఏవమ్మ! బావగారు చాలా ఖాళీగా కూర్చున్నారే? ఎల్లాగయినా అదృష్టవంతులు: దేనికైనా పెట్టిపుట్టాలి" అని ఉపోద్ఘాతం ప్రారంభించాడు,అవధానిగుమ్మంలో కాలుపెడుతూ. అవధానితోకూడా మరో ఆసామీ వచ్చాడు.

గృహస్థ ధర్మం ప్రకారం ఇద్దరికీ చెరో గ్లాసు అందించింది కాసులమ్మగారు. అవధాని నిర్మొహమాటంగా అందుకుని "అమృతం!" అని గుటక వేసి-

"బావగారూ: మంచి వార్త చెప్పడానికి వచ్చాను— అమలాపురంలో ......" అని చెప్తుండగా బుచ్చిరామయ్య మాట కడ్డువచ్చి—. "వద్దండీ: ఇదివరకు కొందామనుకున్నానుగాని, ఇప్పుడు భూమి కొందామని వుద్దేశం లేదు." అన్నాడు.

ఇదివరలో ఓసారి భూమికొందామని వుందనీ, కోనసీమలో ఏదేనా మంచిది చవగ్గా వచ్చినప్పుడు చెప్పమని అవధాని చెవిని పడవేశాడు. ఇప్పుడు ఆ విషయం గురించి వచ్చాడనీ- ఇప్పుడు డబ్బు సరిపోదు గనుకా- పై విధంగా అనేశాడు:— పైగా ప్రక్కనున్న ఆసామీ భూ కామందులా కనబడ్డాడు.

అవధాని ఆరోహణస్థాయిలో నవ్వి "అది కాదు: వీరు రామకృష్ణారావుగారని అమలాపురం వాస్తవ్యులు" అని పరిచయంచేసి, "మంచి సంప్రదాయం కలవారు. ముప్పై ఎకరాల భూమికి అధిపతి. పాడీ పంటా అన్నీ సమృద్ధిగా ఉన్నాయి. వీరికొక్కతే కూతురు. గాత్రం నేర్పితే ఉపిరితిత్తులు పాడవుతాయని వీణ నేర్పించారు. చదువు అంటారా! పెద్దచదువు లేకపోయినా గృహకృత్యాలకు లోటుండదు. పిల్ల సాక్షాత్తు సరస్వతి!-ఇల్లాగ ఉండగా నన్ను సంబంధం చూడమని పెద్దభారం పడవేశారు. అసలు ఇలాంటి వ్యవహారాల్లో చిక్కుకోవడం అంటే - ముఖ్యంగా పెళ్ళి వ్యవహారంలో నాకు ఇష్టం లేదు-అయినప్పటికీ- కావలసినవారు గనుక - బాగా ఆలోచించాను. చివరికి నాలుక కరచుకుని మన గోపాలం ఉండగా ఇంత ఆలోచన ఎందుకా అని తీసుకొనివచ్చాను. సరిగ్గా యీడూ జోడూ సరిపోతుంది. ముప్పైఎకరాలకీ, ఇంటికీ అధిపతి అవుతాడు - పిల్లజమీందారులా జరిగిపోతుంది." చాలా వాకచక్యంగా, చేతులు త్రిప్పుతూ, అభినయంచేస్తూ ముఖకవళికలు మారుస్తూ పాత్రను చాలా చక్కగా నిర్వహించాడు.

బుచ్చిరామయ్య మనస్సులో ఒకదృశ్యం మెరసింది. కోడలు సరస్వతిలా వీణ వాయిస్తుంటే-కొడుకు వింటూ హాయిగా సుఖపడుతుంటే-తనూ భార్యా, బావగారూ దేవాలయానికి వెళ్లి పురాణశ్రవణంచేస్తుంటే ఆహా నిజంగా స్వర్గం కనిపించింది తనకి. నిజంగా అంత అదృష్టమా?. ఆసమయంలో అవధానిని కౌగలించుకుందామా అనిపించింది.

కాసులమ్మ మరోకప్పు అందిస్తూ "మన మీద ఎంత అభిమానమో! పూర్వపు స్నేహితుల్నే ఇప్పటికీ ఎంత శ్రద్ధా!" అనుకుంది లోపల.

శ్యామల [illegible] అల్లుకుంటూ- ఇదంతా చూస్తోంది. ఇంతలో గోపాలం బుర్రవంచుకొని, క్రింద చూస్తూ ఏదో పుస్తకం పుచ్చుకుని బయటకు పోతూంటే- కాసులమ్మగారు "ఒరేయి: గోపీ" అని కేకేసింది. వెనక్కి తిరిగాడు.

అవధాని కొంచెం లేచి "ఏమోయ్: గోపీ మర్చిపోయావేమిటి?"

"ఇంకా నయం: మిమ్మల్ని మరచిపోతానా? మీరు ఈమధ్యకనబడటం లేదు."

"లేదోయ్, ఒక పనా ? ఒక లోకమా ? తెగతిరుగుతున్నాను." గోపాలానికి కొంచం నవ్వు వచ్చింది-ఆ నవ్వులో చాలా అర్థం ఇమిడి ఉంది.

అవధానికి ఒక పని అంటూ ఏమీ లేదు. అక్కడా అక్కడా పెళ్ళిళ్ళు జరిపించి, పేరంటాలూ, ఇళ్లూ క్రయవిక్రయాలు జరిపించి పొట్ట నింపుకుంటాడు. ఎవరికి ఏ వూళ్లో ఎంత ఆస్తి ఉన్నదీ, పిల్లలు ఎంత మంది ఉన్నదీ అతనికి తెలిసినట్లు ఎవరికీ తెలియదు అనడంలో అతిశయోక్తి లేదు. అతనికి పెళ్ళామూ, బిడ్డలూ లేరు. గనుక పెళ్ళిళ్ళు జరిపి-నాటిసర్వసౌఖ్యాలు చూసి ఆనందిస్తూ ఉంటాడు. నిజానికి మంచి బ్రతుకు తెరువు తెలిసిన మనిషి.

"ఏం చేస్తున్నట్లు" ప్రశ్నించాడు అవధాని.

"ప్రస్తుతం ఏమీ లేదు?" గోపాలం జవాబిచ్చాడు.

"అసలు ఏమి చేద్దామనుకుంటున్నావు?"

"చేద్దామనుకున్నది జరిగితే-ఊహానలూ అవీ ఉండవుగా?"

"సరేగాని - వారు అమలాపురం వాస్తవ్యులు రామకృష్ణారావుగారు" అని పరి

యం చెయ్యగానే, గోపాలం నమస్కారం చేశాడు. ప్రతి నమస్కారం చేసి-చూపించిన సభ్యతకు లోపల చాలా మెచ్చుకున్నాడు పిల్లతండ్రి. తన కూతురికి తగినవాడేనని నిర్ధారణ చేసుకున్నాడు.

"వారి అమ్మాయిని నీకు యిద్దామనే ఉద్దేశంతో వచ్చారు. నీ ఉద్దేశం కావాలి?"

"కడుపు పోషించుకోలేనివాడికి అదొక్కటే లోటొచ్చింది?"

"అదేనిట్రోయ్. ఈయనకి ముప్ఫై ఎకరాల మాగాణీ, కొబ్బరితోట, పాడీ అన్నీ ఉన్నాయి. ఒక్క కూతురుతప్ప ఇంకెవరూ లేరు. ఆ ఆస్తి అంతా నీకే వస్తుంది ఇంకా సంపాదన చెయ్యవలసిన అవసరం ఏమిటి? పిల జమీందారులా జరిగిపోతుంది!"

"ఒకరి ఆస్తిని అనుభవిద్దామనేటంత దుర్మార్గుణ్ని కాను. ఒకళ్లడబ్బు నాకోసం వినియోగించుకొని-పిల్లను కన్నందుకు తండ్రికి శిక్ష విధించటం నా అభిమతం కాదు." అని రామకృష్ణారావుగారికేసి చూసి "చాల శ్రమపడి వచ్చారు. ఇప్పట్లో వివాహం చేసుకోవాలనే ఉద్దేశం లేదు." అని సుడిగాలిలా రివ్వున వెళ్లిపోయాడు. "పిల్లని చూస్తే ఇల్లాగ మాట్లాడవు?" అన్న అవధాని మాటలు చెవిని పడ్డాయో లేదో-అప్పటికే మెట్లు దిగిపోయాడు.

"ఒకరి ఆస్తిని అనుభవిద్దామనే దుర్మార్గుణ్ని కాను" అని అనడమే "ఇప్పుడుచేసే పనేమిట్రో?" అని పైకి అందామనుకున్నాడు బుచ్చిరామయ్య, కాని కొడుకును కన్నాక పోషించడంభారమంటే నవ్వుతారు. అందులో డబ్బుగల పెళ్ళివారి ముందు.

రామకృష్ణారావుని బాగా ఆకర్షించాడు గోపాలం. ఆ రూపురేఖలూ, మాటలోని గాంభీర్యం, ఉత్తమ ఉద్దేశాలూ-ఇవన్నీ అతని మనస్సులో ముద్రించుకుపోయాయి. తన కూతుర్ని,గోపాలాన్ని ప్రక్క-ప్రక్కన నిలబెట్టి చూనుకున్నాడు మనస్సులో-ఆహా! ఎటువంటి జోడీ! ఎల్లాగయినా ఈ వివాహం చెయ్యాలి అని-"ఎల్లాగయినా ఒప్పుకోవాలి" బుచ్చిరామయ్య చేతులు పట్టుకున్నాడు.

ఆ పరిస్థితిలో బుచ్చిరామయ్యకు-భగవంతుడు ఒక దారిచూపించినట్లయింది. తప్పకుండా! రేపు ఆదివారం పిల్లను చూడటానికి వస్తాం. కుర్రవాడు. వాడిమాటలకేం లెండి!" అని పంపించాడు-వెస్తూ అవధాని "ఆదివారం దశమి - చాలామంచిది - తప్పకుండా రావాలి" అని వెళ్ళిపోయాడు సగర్వంగా.

కిరాణాకొట్టు విశ్వనాధాన్ని చూడగానే, అనామతుబాకీ జ్ఞప్తికి వచ్చింది. "ఏమండీ. మా వ్యాపారం ఏమీ సరిగ్గా నడవటంలేదు. చాలా ఇబ్బందిగాఉంది. ఆ బాకీ కాస్త ఇప్పించేయండి. ఇల్లాగ త్రిప్పడం ఏమీ బాగోలే" దని రేపు ఇస్తానని రమ్మనగానే-ఇంక వాయిదా వెయ్యొద్దని ఖచ్చితంగా చెప్పి వెళ్ళాడు.

ఛీ! వెధవడబ్బుకోసం ఏ గడ్డి అయినా కరుస్తాడు. అయిదు తులాల కాఫీ పొడికొంటే అరపౌను అని పద్దు రాస్తాడు? ఇదేమిటి అని వెంటనే అడిగితే పొరపాటు: అంటాడు. లేకపోతే "కొంగపద్దులు-" ఏమన్నా అంటే! అరువులు ఇస్తే-తన డబ్బుకివడ్డీ పెరిగిపోయిందని లెక్కలు చెబుతాడు. అసలు వ్యాపారస్తుల జబ్బే అది. అవసరమంటే-కాళ్లు పట్టుకుని చుట్టూ తిరుగుతారు-లేకపోతే గడ్డిపరకకంటె హీనంగా చూస్తారు. ఏం చేసినా - కూడబెట్టిన డబ్బు కప్పేస్తూ ఉంటుంది.

"నాన్నా! ఈ వేళ పాలవాడు పాలు నీళ్ళలా పోశాడు. ఏం? ఇల్లాగ పోశావు అంటే-కావలిస్తే పుచ్చుకోమనీ, లేకపోతే మానెయ్యమనీ అంటున్నాడు-పాలకి పేర్లు పెడుతున్నాడు?" అంది శ్యామల.

"ఆరి పిడుగా! ఏమిటే విప్లవం!" ఇవే మాటలు తను ఉద్యోగంలో ఉన్నప్పుడు అంటే పాలు శాంపిల్ తీయించి-జుర్మానా తగిలిస్తే తెలిసేది వాడి పొగరు. అన్ని విధాలుగానూ పనికిరాని వాడిగా, విలువలేని వాడిగా తయారయ్యాడు - అన్ని బాకీలు తీర్చేసి, ఆ అమలాపురం సంబంధం ఒప్పుకోవటంకంటే వేరే గత్యంతరం లేదని నిర్ణయానికి వచ్చాడు - భోజనం చేసి - చెక్కు మార్చుకుందుకు ట్రెజరీకి వెళ్లాడు.

చెక్కు క్యాష్ చేయించుకొని - డబ్బు లెక్క పెట్టుకుందామని - జనం ఎవరూ లేని చోట - కాంపౌండ్‌వాల్ దగ్గర, మర్రిచెట్టు నీడలో లెక్క పెట్టుకున్నాడు. డబ్బు ఒకటికి పదిసార్లు లెక్క పెట్టాడు-కవర్లో పెట్టి పైకి తల ఎత్తేటప్పటికి - గోపాలం-లైబ్రరీకి వెళ్ళడం చూసి-కోపం పట్టలేక "గోపీ!" అని కేకేశాడు. కేకేసి "నీకు యింకా కష్టసుఖాలు తెలియకపోతే ఎల్లాగ-చూశావా - నా జీవితమంతా అయిపోయింది. నువ్వు ఏమీ పట్టనట్లు ఇరవై నాలుగు గంటలూ పుస్తకాలు చదువుతూ కూర్చుంటుంటే ఇక్కడ ఏమన్నా ఖజానాలు నిండి ఉన్నాయనుకున్నావా? జాగ్రత్తగా ఆలోచించు" అని కవరు కోటుజేబులో పెట్టుకొని వెళ్ళిపోయాడు.


ఇంటికి వెళ్ళి - చెప్పులు విప్పి- "ఉష్!" అంటూ కుర్చీలో కూర్చుని కోటు విప్పుకుంటూండగా, కౌసులమ్మ వచ్చి "అదేమి

(56-వ పేజీ చూడండి)





రాజశ్రీ పిక్చర్స్ నిర్మిస్తున్న "జయం మనదే"లో అంజలీదేవి.



హోమీవాడియా నిర్మిస్తున్న గేవాకలర్ చిత్రం "హాతింతాయ్"లో ఒక నృత్య సన్నివేశం



★

'రూప్ కుమార్' పేరుతో వెండి తెరమీద 'బందీష్'లో కనబడ్డ అమ్మాయి డెయిసీ ఇరానీ. బందీష్ తరువాత, అశోక్ కుమార్‌తోనే తిరిగి 'ఏక్ హీరస్త్రా'లో నటించింది.

★



నరసూ వారు నిర్మిస్తున్న "భలేరాముడు

సావిత్రి



" లో నాయికా నాయకులుగా నటిస్తున్న
నాగేశ్వరరావు




గోకుల్ పిక్చర్స్‌వారి
"కనకతార"లో ఉదయసేనుడుగా
గుమ్మడి, క్రూరసేనుడుగా
ఎస్. వి. రంగారావు.

★



బి. ఆర్. చోప్రా కొత్త చిత్రం.
'ఏక్ హీ రాస్తా'లో మీనాకుమారి



"ఏక్ హీ రాస్తా"లో సునీల్ దత్, మీనాకుమారి.

★ ★ ★

డీ లక్స్ ఫిలింస్ వారి 'న్యూఢిల్లీ'లో ఒక సన్నివేశం. వైజయంతిమాల, కిశోర్ ఇందులో ప్రధానభూమికలు నిర్వహిస్తున్నారు.





అనుపమపిక్చర్స్‌వారి తొలిచిత్రంలో సీతమ్మగా జి. వరలక్ష్మి, వేణుగా మాస్టర్ వెంకటేశ్వర్.

చలనచిత్రాలలో తారాబలం

"బొమ్మా? బొరుసా?"

"బొమ్మ"

అణాకాసు గిర్రున తిరుగుతూ పైకెగిరి పడింది. బొమ్మే

"అమ్మయ్య, అయితే ఈ నెలలో హీరో రెండు కాల్ షీట్లు మంజూరు చేయడం ఖాయం" అని మురిసిపోయాడు నిర్మాత. హీరో కాల్ షీట్ యిచ్చేనాటికి హీరోయిన్ కూడా తీరిక చేసుకుని వస్తే పని చకచక తెమిలిపోతుంది అని ఆశపడ్డాడు.

అక్షరాలా యిలాగే కాకపోయినా దాదాపు ఈ పంథాలోనే ఉంది చలనచిత్ర నిర్మాణ వ్యవహారం. ఏదో ఒకచోట అనే కాదు. సర్వత్రా ఇంతే. కొంతకాలం క్రితం, అపారమైన డబ్బు నల్లపూసైపోతూ వుండడంతో ఒక్కొక్క చిత్రనిర్మాణం ఆగుతూ నడుస్తూ మళ్ళా ఆగుతూ సాగుతూ ఉండేది. ఏ డిస్ట్రిబ్యూటరో సర్దివ్వడంతో నిర్మాణం ముమ్మరంగా సాగేది. ఇప్పుడు డబ్బు పుష్కలంగావున్నా, పని జోరుగా సాగకుండా ఆటంకాలు కలుగుతున్నాయి. దీనికి ఒక కారణం పెద్ద నటీనటులు నల్లపూసలై పోతూవుండడం. ఇలా జరగడానికి కారణం కొద్దిమందినటీనటులు అనేక చిత్రాలలో ఉండడం. దీనికి కారణం, నిర్మాతలు పట్టుపట్టి ప్రతిసారి ఆ కొద్దిమందినే తమ చిత్రాలలో పనిచేయడానికి ఒప్పించడం. దీనికి ఓ కారణం చెబుతారు. పేరుమోగిన నటీనటుల పేర్లు ఎన్ని ఉంటే డిస్ట్రిబ్యూటర్లకు అంత మోజు. నిర్మాత చూపించే కాంట్రాక్టు కాగితాలమీద ఆ నటీనటుల పేర్లు లేకపోతే డబ్బు పలకదు

అనగనగా రాజుగారి ఏడో కొడుకు తెచ్చినచేప యెండకుండా ఉండిపోయిన కథలాగా, ఎటు తేలకుండా ఎవరికివారు ఏవేవో కారణం చూపిస్తూనే ఉన్నారు. అటుతిరిగి, ఇటుతిరిగి, చివరికి సినిమా ప్రేక్షకులని చూపిస్తారు.

ఫలానా పెద్దతార తప్పకుండావుంటే, సక్సెస్ గారెంటీ అని ఢంకామీద దెబ్బ కొట్టారు కొందరు. తీరా అటువంటి చిత్రాలు బాగా దెబ్బతినడంతో ఈ సిద్ధాంతంకూడా దెబ్బతింది దానికితగ్గట్టే, కొత్త నటీనటులున్న చిత్రాలు కొన్ని విజయవంతం అయాయి. అయితే సిద్ధాంతాలు దెబ్బతినడం ఆ నేడి సినిమాలకు పెట్టుబడి పెట్టేవారి దృష్టిలో పెద్ద విషయం కాదు. ఇదికాదు. వ్యాపార

రితో ఏర్పడిన డబ్బుకు 'నాలుగింతలు కలిసి రావడానికీ, ప్రత్యక్షంగా దోహదంచేసేవే తప్ప మరేవీ ప్రధాన విషయాలుకావు కళని ఉద్ధరించడం, కళపట్ల అభినివేశం గలవారిని ప్రోత్సహించడం .. "అది మాపనికాదు" అవన్నీ పరోక్షంగా పనికొచ్చేవి

పిండికొద్దీ రొట్టె, పేరుమోగిన నటీనటులు ఎంతమంది ఉంటే, అంత క్షేమకరం అంత లాభకరం ఇదీ లెక్క.

డిస్ట్రిబ్యూటర్ల లెక్క ఈ పంథాలో ఉంటుంది కాబట్టి, నిర్మాతల ప్రయత్నాలుకూడా ఆ మార్గంలోనే ఉంటాయి. ఎలాగో అలా పెద్ద నటుల సంతకాలు కనీసం రెండైనా—(ఒకటైతే లేమూడు, నాలుగైతే మెరుగు, ఐదు అమోఘం) సంపాదించడానికి ప్రయత్నిస్తారు. ఇలా, సినిమా తీయడానికి సిద్ధపడ్డ ప్రతి నిర్మాతా, కథ, సంగీతం సంగతి ఎలా ఉన్నా మొదట దీనికై కృషి చేయడంతో ఉన్న పెద్ద నటీనటులు నలుగురైదుగురే దాదాపు అన్నిటిలోను బుక్ అవుతారు పోటాపోటీలుగా సాగే నిర్మాణంలో, అన్ని చిత్రాలకూ పనిచేయవలసి రావడంతో ఆ నలుగురు ఎడతెరిపి లేకుండా రోజుకి 24 గంటలూ ఏదో స్టూడియోలో ఏదో ఓ సెట్టుమీద నటిస్తూనే ఉంటారు. నిర్వహిస్తున్న భూమికలన్నిటి స్వభావాలు ఆకళింపు చేసుకొని, తన అనుభవం, ప్రతిభ వాటికై పూర్తిగా సద్వినియోగం చేయడానికి తీరిక ఏమాత్రం ఉంటుంది? అసలు అక్కడిదాకా అక్కర్లేదు. అసలు ఒప్పందాల ప్రకారం అన్ని చిత్రాలకూ వెళ్ళి పనిచెయ్యడానికే తగినంత తీరుబాటు ఉండదు. అందుకని ఆయా నిర్మాతలు ఒక్కొక్కరికీ, నెలకు ఏ నాలుగైదేసి రోజుల చొప్పునో పంచిపెడతారు. హీరో ఒక చిత్రానికి ఓ నాలుగురోజులు కేటాయిస్తే, ఆ నాలుగురోజులే హీరోయిన్ కూడా ఆ చిత్రానికి కేటాయించడం జరగాలి. ఇది ఒక్కొక్కసారి సాధ్యపడకపోవచ్చు. ఈ విధంగా నిర్మాత, నటుల్ని ఆకట్టుకు రావడానికి అవస్థలుపడడం, నిర్మాణం జాప్యంకావడం జరుగుతోంది. ఈ పరిశ్రమలో జాప్యంఅంటే ఖర్చు పెరగడం. అటువంటి సందర్భాలలో నిర్మాత ఎవరిమీద విసుక్కునీ ప్రయోజనం ఉండదు.

"మేమేం చేస్తాం ఎవరికివారే, మేము నటించాలని పట్టుబడుతూ ఉంటే." అంటారు నటీనటులు. ఇంకో కారణంకూడా వినబడుతుంది. నిర్ణయం ప్రకారం నిర్మాత చేతి నుండి డబ్బుముట్టదు. అటువంటప్పుడు నాలుగింటిలో నటించకపోతే ఎలా?

మొత్తానికి డబ్బు అయితేనేం, పేరు అయితేనేం, మొహమాటంవల్ల అయితేనేం, ప్రతి నిర్మాతకోరికా మన్నించి ప్రతి చిత్రంలోనూ నటించడంవల్ల ఇంకో ప్రమాదం ఉంది. కథలు బాగుండనివాటిలో కూడా, నటించడం జరుగుతుంది. నప్పని వేషాలు వెయ్యవలసివస్తుంది. ప్రతిభవల్ల ప్రేక్షకులను రంజింపచేసి పేరుగడించిన ఒక వ్యక్తి నటన హఠాత్తుగా ఒక చిత్రంలో అభాసు అయిపోవడం బాధాకరం. తృప్తికలిగించకపోయినా తన ప్రతిభను బుజావు చేసుకున్న నటులకీర్తికి ఒక విధంగా కళంకం.

హాలీవుడ్ నటులలో వాల్టర్ పిజన్ను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇటువంటి పరిస్థితులలో కాకపోయినా, మొత్తానికి గాల్స్వర్దీ ఫార్ సైట్ సాగా చిత్రాలలోను, అంతకుముందు అనేక చిత్రాలలోను, గ్రీర్ గార్సన్తో కలసి నటించి, పేరు ప్రఖ్యాతులు గడించుకున్న వాల్టర్ పిజన్కు, హఠాత్తుగా అతని ప్రతిభ వినియోగించడానికి అవకాశంలేని భూమికలు ఇవ్వడం జరిగింది. అతని పేరు మాసి చిత్రం బాగుంటుందనుకుని చూడబోయినవారికి నిరుత్సాహం కలిగింది.



"నాగులచవితి" చిత్రంలో రఘురామయ్య.

ఇటువంటి పరిస్థితులు ఏర్పడే సూచనలు మన పరిశ్రమలో కూడా కనబడ్డాయని చెప్పవచ్చు. "అప్పట్లోనే బాగా పేరు గడించిన నటీనటులు కొందరు ఎక్కువ డబ్బుకోరడం ప్రారంభించారు. నిర్మాతలపట్ల మొహమాటం వల్ల, పేరుకి లోపంవచ్చే భూమికలు తీసుకోవలసిన అగత్యం తప్పించుకోవడానికి ఇది ఒక విధమైన ప్రయత్నంగా భావించవచ్చును. దీనివల్ల ఈ నటీనటుల చిత్రాల సంఖ్య కొంత తగ్గడం, కొత్త నటీనటులకు అవకాశాలు రావడం జరిగింది. ఆ పెద్దనటులకు ఇది ఉభయతారకం అయింది. నటులకు, అందరిలాగే డబ్బుమీద అభిమానం ఉన్నా, తమ నటన బాగుండాలనీ, నలుగురూ సంతోషించి మెచ్చుకోవాలనీ గట్టి సంకల్పం ఉంటుందనడానికి సందేహం ఏమీ లేదు.

అయితే బోలెడేసి చిత్రాలకు ఎందుకు ఒప్పుకొంటున్నట్లు?

ఇద్దరు నటులు ఒక సందర్భంలో అన్న

★ చలనచిత్రాలలో తారాబలం ★

మాటలతో దీనికి కొంతసమాధానం కనబడుతుంది. కొంతకాలం క్రితం, సినిమా నటుల ఖర్చులతీరులపైనం కనుక్కోబోయేసరికి ఒకాయన, వెండితెరనటుల పేరు, ధనార్జనాకూడా తాత్కాలికమైనవే కాబట్టి, శాయశక్తులా సంపాదించడం, వచ్చినదాన్ని జాగ్రత్తచేసుకోవడం తన మతం అన్నాడు. మరొక నటుడు నిష్కర్షగా చెప్పిన మాటలలో కొంత నిష్ఠూరం ధ్వనించినా నిజం లేకపోలేదు.

“నా చేతికి అందిన డబ్బు చాలా మటుకు, రావలసింది రాబట్టుకోడానికే ఖర్చు అవుతోంది” అన్నాడా నటుడు.

నటులు ఈ విధంగా సమర్థించుకుంటే, నిర్మాతలు డిస్ట్రిబ్యూటర్లని చూపిస్తున్నారు. ఈ వలయానికి అంతం ఎక్కడ? కేవలం ప్రేక్షకులనుమాత్రంనిందించడం భావ్యం కాదు. ప్రతిభ చూపి పేరు గడించిన నటులని చూడాలని మోజుపడ్డట్టే, కొత్త నటులను చూడాలనీ ప్రేక్షకులు ఉబలాటపడతారు. అయితే కేవలం నటులపేరు చూచి విరగబడతారనుకోవడం పొరపాటని ఇదివరకే ఋజువైంది.

ప్రతి నటుడు తను స్వీకరించిన భూమికను చక్కగా పోషించడానికి ఎంతో శ్రద్ధ తీసుకొని, తన శక్తి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించాలని కోరే హక్కు ప్రతిప్రేక్షకుడికీ ఉంది. నిర్మాతకూ ఉంది. అలా చేయడం నటుల విధ్యుక్త ధర్మం. అది సవ్యంగా నెరవేర్చగలగాలంటే, ఒప్పుకునే వేషాలు ఓపికను తీరికను బట్టి పరిమితం చేసుకోవాలి.

చిత్రం నిర్మాణం మూడు నాలుగు నెలలలో ముగించడానికీ, ఇవ్వవలసిన డబ్బు సకాలంలో ఇచ్చివేయడానికీ నిర్మాతలు ఒప్పుకుని ఈ పద్ధతులు ఆచరణలో పెడితే తాము కాంట్రాక్టుల సంఖ్య తగ్గించుకోవడానికి సిద్ధమేనని బొంబాయి నటీనటులు మొన్న స్పష్టంగా చెప్పారు. ఇక స్టార్ వాల్యూ కోసం డిస్ట్రిబ్యూటర్లు పట్టుపట్టినా బొత్తిగా తీరికలేని నటీనటులు నలుగురిని

నాటకాల్లో అనుభవం గడించి సినిమా కళోద్ధరణకు పూనుకొన్న ఒక నటుణ్ణి ఒక మిత్రుడడిగాడు: "ఎదురుగా ఆడియన్స్ లేకుండా నటించడం కష్టంగా లేదా" అని.

"కష్టమేముందండి. నేనిప్పటివాణ్ణా? ముప్ఫయ్ ఏళ్ల నించీ నాటకాల్లో వేస్తున్నాను," అని అమాయికంగా జవాబిచ్చాడు నటుడు.

ఋక్ చేసుకుని ఇబ్బందిపడడంకన్న, ఒకవాడు బొంబాయి పరిశ్రమ అవలంబించిన పద్ధతిని అనుసరించడం మెరుగని పిస్తుంది. అశోక్ కుమార్ బాగా పేరు తెచ్చుకున్న తరువాత, అతడు హీరో భూమిక నిర్వహించే చిత్రాలలో హీరోయిన్ భూమికకు కూడా, మరో పెద్ద నటిని తీసుకురాకుండా, ఒక కొత్త నటిని పరిచయం చేసేవారు. వీణ, ముంతాజ్ శాంతి ఈ తరహాకు చెందిన వారే. ఈ పద్ధతి ఈ నాటికీ హాలీవుడ్‌లో అనుసరించబడుతునే ఉంది. స్టార్ వాల్యూ ఉన్న హీరోయిన్‌కు జంటగా కొత్త నటులను, అలాగే స్టార్ వాల్యూగల హీరోతో కొత్త నటి ప్రవేశ పెడుతూ ఉంటారు.

ఒకానొక నిర్మాత, ఒక కొత్త చిత్రం ప్రారంభించాడు. హీరో హీరోయిన్ ప్రభృతులను ఆకట్టుకు రావడం సనిపడక, వాళ్ళ సంగతి అలా ఉంచేసి, వాళ్లిద్దరూ లేని సన్నివేశాలన్నీ ముందర చిత్రించ పూనుకొన్నాడు. ఆపైన తాపీగా, నాయకీ నాయకులను ఏరుకొని, మిగతా కథ చిత్రించ సంకల్పించాడు.

ఇదీ ఈనాటి పరిస్థితి. ఇది చక్కబడాలంటే, చలనచిత్రనిర్మాతల సంఘం ఇందుకు గట్టిగా పూనుకోవాలి. దేశంలో నిర్మాతలంతా ఒకే సంఘంగా ఏర్పడుతున్నారు. ఒక అధిష్ఠానమండలి ఏర్పడింది. ఫిలిం పరిశ్రమ ఎదుర్కొనే అనేక సమస్యలలో ఇది కూడా ఒకటిగా భావించి, ఆచరణ యోగ్యమైన మార్గాలు ఆలోచించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం ఆ మండలి ప్రాథమిక కర్తవ్యాలలో ఒకటి. నటులూ, నిర్మాతలూ, డిస్ట్రిబ్యూటర్లూ కూడా పరిశ్రమ శ్రేయస్సు దృష్ట్యా ఇందులో పూర్తిగా సహకరించడం అవసరం. ★ 'రవణ'

బొంబాయి సినిమా లేఖ

జెమినీ అధిపతి శ్రీ ఎస్. ఎస్. వాసన్ తలపెట్టిన సినిమా స్కోప్ - స్టీరియోఫోనిక్ టెక్నికలర్ చిత్రం, అమెరికన్ సంస్థ ట్వెంటీయత్ సెంచరీ ఫాక్స్‌వారితో కలసి నిర్మించడం దాదాపు ఖాయమైనట్లే. శ్రీ వాసన్ పనుపున సంప్రతింపులకై వెళ్లిన ప్రతినిధి శ్రీ ఎం. ఎ. పార్థసారథి ఒప్పందం ఖాయపరచే విషయమై ఫాక్స్ సంస్థ అధిపతి స్పిరాస్. పి. స్కూరాస్‌తో న్యూయార్క్‌లో మంతనాలు జరుపుతున్నారు. ఈ జెమినీ, ఫాక్స్ సంస్థల సంయుక్త చిత్ర నిర్మాణం మూడుభాషలలో జరుగుతుంది. ఒకటి ప్రపంచ మార్కెట్‌కై ఆంగ్లంలో, భారతదేశం అంతటా ప్రదర్శించడానికి హిందీలో ఒకటీ, తమిళ ప్రాంతంకోసం తమిళభాషలో ఒకటీ తయారవుతాయి.

* * *

మరో హాలీవుడ్ సంస్థ కొలంబియా పిక్చర్స్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ కూడా భారతీయ నిర్మాతలతో చేతులు కలుపడానికి కృషిచేస్తోంది. మహాత్మాగాంధీ ప్రబోధాలు ఆధారంగా, ఈ సంస్థ పేరిట ఆటో ప్రిమింజర్ 'పీల్' అనే చిత్రం నిర్మించబోతున్నారు. బహుశా నవంబరులో నిర్మాణం ప్రారంభం కావచ్చునని కొలంబియా సంస్థ ఉపాధ్యక్షుడు మైకెల్ బెర్గర్ మొన్న బొంబాయి వచ్చినపుడు చెప్పారు. కొలంబియా భారతీయ నిర్మాతలతో కలసి చిత్రాలు నిర్మించవచ్చునని కూడా ఆ సందర్భంలో ఆయన తెలియచేశారు. విదేశాలలో మార్కెట్ సంపాదించాలని తహతహలాడుతూన్న భారత చలనచిత్ర పరిశ్రమకు ఇది ఆశాజనకమయిన సూచన.

* * *

వాయిదాపడ్డ భారత్ టాకీ రజతోత్సవాలు ఈ సంవత్సరాంతంలో జరుగవచ్చునని తెలుస్తోంది. ఇంతకు ముందు అనుకున్నట్టే ప్రారంభోత్సవం టాకీల జన్మస్థలం బొంబాయి నగరంలోనే జరుగుతాయి. కాగా, ఇతర ప్రముఖ కేంద్రాలు మదరాసు, కలకత్తాలలోనూ, ఢిల్లీలోనూ యథోచితంగా ఉత్సవ కార్యక్రమాలు జరుగుతాయి. ఈ తరుణంలో ఒకసారి సింహావలోకనం చేసి, గత పాతికేళ్ళలో పరిశ్రమ ఏ మాత్రం ముందుకు వచ్చిందో, ఏ విజయాలు సాధించిందో ఎందులో విఫలమైనదో పరిశీలించాలి: ఈ సమాలోకనం ఫలితంగా తేలే అంశాలు ప్రాతిపదికగా చేసుకొని, ఫిలిం ఫెడరేషన్, చలనచిత్ర పరిశ్రమ ప్రగతికి పంచవర్ష ప్రణాళిక వేసుకోవాలి. ఇదమిత్థంగా ఒక పద్ధతి, పథకం స్వంతంగా వేసుకోకుండా, పంచవర్ష ప్రణాళికలో ఫిలిం పరిశ్రమను చేర్చలేదని ప్రభుత్వాన్ని నిందించి ప్రయోజనం లేదు. అనుభవం, అర్హత లేకపోయినా ఎవరుపడితే వారు అమాంతం దర్శకుడో, రచయితో అయి కూర్చుంటున్నారంటే. పరిశ్రమలో పనిచేసేవారెవరికీ, నేను కూడా, ఉద్యోగాలు భద్రంగా లేవంటే ఈనాటి పరిశ్రమ స్థితిగతులు విదితం అవుతాయి.

* * *

ఈ మధ్య విడుదలఅయిన కొత్తచిత్రాలలో 'భాగం భాగ్' ఒకటి. హాస్యనటుడు భగ్‌వాన్ నిర్మించిన ఈ చిత్రంలో అతడూ, కిశోర్ కుమార్ కలసి మొదటినుండి చివరవరకూ కడుపుబ్బ నవ్విస్తారు. వీళ్ళకి ఉజ్జీలుగా స్మృతి బిశ్వాస్, శశికళా కూడా అమోఘంగా నటించారు. ఓ. పి. నయర్ సంగీతం హుషారుగా, చెవికి ఇంపుగా ఉంది.

మరోచిత్రం "మన్ భరే నయిన్" ఇది కూడా హాస్యచిత్రమేనట. కృత్రిమమైన సన్నివేశాలు, తెచ్చిపెట్టుకున్న నటన చూస్తే అలా అనిపించదు. సంగీతం కూడా ఇదే పంథాలో ఉంది.

విడుదల అయిన వాటన్నిటిలోనూ ఉత్తమని చెప్పుకోతగ్గది "ఏక్ హీ రాస్తా" పండిత్ ముఖ్‌రాం శర్మ వ్రాసిన ఈ కథలో ఒక పసిపిల్లవాడూ, అతని 'సవతి తండ్రి' ప్రధానమైన పాత్రలు. 'బందిష్'లో జంట అశోక్ కుమార్, రూప్‌కుమార్ (డైయిసీ ఇరానీ)లు ఈ భూమికలను అద్భుతంగా నిర్వహించారు. మీనా కుమారి, సునిల్ దత్ కూడా ఇందులో ఉన్నారు. బి. ఆర్. చోప్రా దర్శకుడు, హేమంతకుమార్ శ్రుతిపేయమైన సంగీతం సమకూర్చారు.

* * *

అఖిలభారత చలనచిత్ర నిర్మాతల సంఘం స్థాపనకు ఏర్పాట్లు చేస్తున అధిష్ఠాన మండలి మార్చి 22న సమావేశం కాబోతున్నది. ఫిబ్రవరి 4న జరిగిన తొలి సమావేశంలో, నిర్మాతల సంఘం నియమావళి

సినిమా వార్తలు

యూరప్‌లో చాప్లిన్ తొలి చిత్రం

చార్లీ చాప్లిన్ నిర్మించనున్న కొత్త చిత్రం పేరు "న్యూయార్కులో ఒక రాజు" ఈ విషయాన్ని చాప్లిన్ ఫిబ్రవరి 25న లండన్‌లో ప్రకటించారు రాజ్యభ్రష్టుడై న్యూయార్కు చేరుకున్న ఒక రాజు జీవితం దీనికి కథావస్తువని, ఆ రాజు భూమికను తాము నిర్వహిస్తారని చాప్లిన్ చెప్పారు. ఈ రాజును ప్రేమించే ఒక అమెరికన్ యువతి భూమికను బ్రిటిషు నటికి ఇస్తారట. మిగతా నటీనటులను నిర్ణయించుకోవడానికై ఆయన లండన్ వెళ్ళారు.

చాప్లిన్ అమెరికానుండి తరలి వచ్చిన తరువాత నిర్మించే తొలిచిత్రం ఇదే. ఇందులో సందేశాలు నీతులు ఏమీ ఉండబోవని, హాస్యం ప్రధానంగా పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వించే పంథాలో తయారవుతుందనీ చాప్లిన్ చెప్పారు. ఈ దృష్ట్యా, తను నిర్మించిన చిత్రాలన్నిటినీ ఇది తలదన్నుతుందన్నారు. దీనికి స్క్రిప్టు ఆయనే వ్రాసుకున్నారు. సంగీతంకూడా ఆయనే సమకూర్చుకున్నారు.

* * *

అనుపమ పిక్చర్స్

శరత్ రచన "బిందుగా రబ్బాయి" ఆధారంగా అనుపమ పిక్చర్స్ వారు ఒక చిత్రం నిర్మిస్తున్నారు.

శ్రీ తాపీ ధర్మారావు గారు వీనస్ స్టూడియోలో ఈ చిత్రానికి ప్రారంభోత్సవం చేశారు. శ్రీ తిలక్ దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో జి వరలక్ష్మి, జమున, సూర్యకాంతం, నాగయ్య, జగ్గయ్య, రమణారెడ్డి, కుటుంబరావు మొదలగువారు నటిస్తున్నారు. మాటలూ పాటలూ తాపీ ధర్మారావు గారు, ఆరుద్ర వ్రాస్తున్నారు.

* * *

అంజలీ పిక్చర్స్

యోగానంద్ దర్శకత్వాన, అంజలీ పిక్చర్స్ నిర్మిస్తున్న జానపద చిత్రానికి నెప్ట్యూన్ స్టుడియోలో మొదటి సెట్ పై షూటింగ్ జరుగుతోంది అంజలీ, నాగేశ్వరరావు ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు. సంగీత దర్శకుడు ఆదినారాయణరావు. మాటలు ముద్దాడి. పాటలు సముద్రాల సీనియర్. ★

లారెన్స్ ఒలీవియర్ కొత్త చిత్రం

హాలీవుడ్ బాక్సాఫీస్ తార మేరిలిన్ మన్రో, సుప్రసిద్ధ బ్రిటిష్ దర్శకుడు లారెన్స్ ఒలీవియర్‌లు కలసి ఒక చిత్రం నిర్మించబోతున్నారు వాళ్ళిద్దరూ ఈ చిత్రంలో ప్రధానభూమికలు నిర్వహిస్తారు. ఒలీవియర్ దర్శకత్వంకూడా నిర్వహిస్తారు. టెరెన్స్ రాటిగన్ వ్రాసిన నాటకం ఈ చిత్రానికి ఆధారం. దీనికి 'స్లీపింగ్ ప్రిన్స్' అని పేరు పెట్టారు.

* * *

తాన్‌సేన్ పునర్నిర్మాణం

అమరగాయకుడు స్వర్గీయ సైగల్, ఖుర్షీద్‌లతో పూర్వం నిర్మించిన చిత్రం 'తాన్‌సేన్' ను కొత్త పంథాలో నవదృక్పథంతో పునర్నిర్మించాలని చందులాల్ షా సంకల్పించారు. బహుశా ఇందులో ముఖ్య భూమికలు భరత్ భూషణ్, మధుబాల నిర్వహించవచ్చునని తెలుస్తోంది. దర్శకత్వం ఎం సాదిక్‌కు ఒప్పగిస్తారట నిర్మాణం మార్చిలో ప్రారంభం కావచ్చునంటున్నారు. సంగీతం సమకూర్చే దెవరో ఇంకా తేలలేదు ఇదిలాఉండగా, నిర్మాత చందులాల్ షా సాంఘిక చిత్రం ఒకటి నిర్మించాలనుకుంటున్నారు. ఇందులో దిలీప్‌కుమార్, వైజయంతిమాల నటిస్తారట

* * *

ప్రపంచ చలనచిత్ర పరిశ్రమ

భారతదేశానికి తృతీయస్థానం

ఐక్యరాజ్య సమితికి చెందిన విద్యావైజ్ఞానిక సాంస్కృతిక వ్యవహారాల సంఘం 1953లో ప్రపంచ చలనచిత్ర పరిశ్రమ స్థితిగతులను సమగ్రంగా వివరిస్తూ ఒక పుస్తకం ప్రచురించింది. సుమారు 156 దేశాలను సంబంధించిన వివరాలన్నీ ఈ సంఘం సేకరించింది. దీని ప్రకారం, 1953లో చిత్రనిర్మాణంలో భారతదేశానికి తృతీయస్థానం అయినట్లు తేలింది. ఆ ఏడాది అమెరికా 344 చిత్రాలు, జపాను 302 చిత్రాలు నిర్మించగా, మనదేశంలో 259 చిత్రాలు తయారయ్యాయి ఇటలీ 163 చిత్రాలు నిర్మించింది. యూరప్‌లో దీనిదే అగ్రస్థానం. ఇది ఎలాఉన్నా డాక్యుమెంటరీల ఇతర హాస్యచిత్రాల నిర్మాణంలో ఇటలీ ప్రపంచం మొత్తంమీద అగ్రస్థానం సంపాదించుకుంది. 1953లో ఈ దేశం నిర్మించిన హాస్యచిత్రాలు 579. తరువాతి స్థానం అమెరికాది. ఆదేశం 416 నిర్మించింది.

1953లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు లక్ష థియేటర్లలో వెయ్యికోట్లమంది సినిమాలు చూశారు రాబడి 4 వందలకోట్ల డాలర్లు ★

★ బొంబాయి సినిమా లేఖ ★

ముసాయిదా రూపొందించడానికై, ఈ మండలి శ్రీ ఎస్. ఎస్. వాసన్ అధ్యక్షుడుగా ఒక ఉపసంఘాన్ని నెలకొల్పింది. వారు ముసాయిదాను రేపు 22వ తేదీన ఈ మండలికి సమర్పిస్తారు. ఫిబ్రవరి 4న జరిగిన తొలి సమావేశంలోనే అధిష్ఠాన మండలి, కొన్ని ప్రాథమిక సమస్యలను పరిశీలించి, ఇట్టి చక్కబెట్ట బూనుకొంది. ముందర పరిష్కారాలు కావలసిన సమస్యలలో ఒకే కథను ఇద్దరేసి నిర్మాతలు చిత్రాలుగా నిర్మించే ధోరణి. అవాంఛనీయమైన ఈ ధోరణిని అరికట్టడం చాలా అవసరం. ఉన్నతాధికారాలు గల అధిష్ఠానమండలి ఇందుకు పూనుకొంటే, సులభంగా కట్టుదిట్టాలు చేయవచ్చును. అలాగే పెద్ద నటీనటులు ఒక్కొక్కరు విడివిడిగా ఎనిమిదేసి చిత్రాలలో నటించడానికి ఒప్పందాలు వ్రాసుకోవడం 24 గంటలూ ఎడతెరిపి లేకుండా ఓ స్టుడియోనించి మరో స్టుడియోకి పరుగు పెడుతూ మొక్కు తీర్చుకోవడం జరుగుతోంది దీన్నికూడా నివారించడానికి అధిష్ఠాన మండలి కృషి చేయవలసి ఉంది.

(ఆంధ్రపత్రిక బొంబాయి విలేఖరి)

డిటెక్టివ్ సీరియల్

అపూర్వ హంతకులు

మూలం: ఎడ్గార్ వాలెస్ అనువాదం: 'వినాయక'

12
పరిసమాప్తి

ఆ వేళ డిటెక్టివ్ సూపర్నెంట్ ఫాల్‌మూత్ అసిస్టెంట్ కమీషనరు ఎదురుగా కూర్చున్నాడు. డిటెక్టివ్‌కు ఎదురుగా ఒక బూడిదరంగు ఉత్తరం పడిఉంది. కమిషనరా ఉత్తరం చేతిబుచ్చుకుని మళ్ళీ ఇంకోసారి చదివాడు. ఆ ఉత్తరం ఇది.

"మీకీ ఉత్తరం చేరేసరికి మేమందరము యూరపులో నాలుగు మూలలకు చెదిరిపోతాం. ఇక మీకు మేమెక్కడఉన్నామో పట్టుకోవడం చాలా కష్టం! మేము తలపెట్టిన ఘనకార్యం నిర్విఘ్నంగా కొనసాగిపోయింది!

ఇదంతా ఏదో గొప్ప చెప్పుకోవడం కోసం రాయడంలేదు. ఇంతటి దారుణంపని చెయ్యవలసి వచ్చిందే అని మాకు కొంచెం కించగానే ఉంది. ఇది మనస్ఫూర్తిగా రాస్తున్న విషయం!

నిజానికి సర్ ఫిలిప్ రేమన్ హత్య సరీగా మేము అనుకున్నట్టుగా జరగలేదు! చివర చివర అది మే మనుకున్నట్టుగా గాక తలవని తలంపుగా మరోమాదిరిగా జరిగిపోయింది! థేరీ ఈ వ్యవహారంలో చేతా వాతా గానిపని చేశాడు. వెంటనే దానిఫలితంఅనుభవించాడు! అతడీ సాంకేతిక విషయాల్లో చాలా గట్టివాడని అనుకొన్నాం. కొంత అతి జాగ్రత్తగా పరిశోధన సాగిస్తే మంత్రి హత్యారహస్యం మీకు బోధపడవచ్చును. మీ పరిశోధన ఫలితం తేలినతరవాత మేము వ్రాసిన మాటల్లో యధార్థం మీకే ఋజువు కాగలదు! సెలవు!!"

సం - అపూర్వహంతకులు.

"ఈ ఉత్తరంవల్ల అసలుకథ ఏదీ బయటపడనేలేదు" అన్నాడు కమిషనర్.

ఫాల్‌మూత్ దిగులుగా తల పంకిస్తూ—"దీనికి ఇంకా పరిశోధన ఏమిటి? డౌనింగ్ స్ట్రీట్‌లో ఆ ఇల్లంతా మూలమూలలా గాలించి సోదాచేసేశాం!" అన్నాడు.

జరిగిన కథ:-

స్పెయిన్ దేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవం జరుగుతున్న రోజుల్లో విప్లవకారులు ఇంగ్లండులో మకాంవేశారు. వాళ్ళని వెళ్ళగొట్టడంకోసం ఆంగ్లదేశమంత్రి పార్లమెంటులో ఒక చట్టం ప్రవేశపెట్టాలని అనుకున్నాడు.

'అపూర్వహంతకులు' ఆ చట్టం ప్రవేశపెడితే చంపివేస్తామని బెదిరిస్తూ ఉత్తరం రాశారు.

తరవాత 'అపూర్వ హంతకులు' లిమిటెడ్ కంపెనీ పేర ఒక పెద్దభవనం అద్దెకు తీసుకుంటారు. దానిలో మాన్‌ఫ్రెడ్ గోన్సాలెజ్ లిద్దరు ఒక మారణపదార్థం తయారు చేస్తారు. పిమ్మట 'బాకా'లో ఒక దురంతం జరిగింది. సంపాదకునికి కూడా ఒక బెదరింపు ఉత్తరం అందింది. ఆ తరవాత థేరీ 'బాకా' కార్యాలయంలో ప్రత్యక్షమైనాడు! అతడు 'అపూర్వహంతకుల' గుట్టు బయటపెట్టేలోగా ఒక ముసుగుమనిషి రివాల్వరుతో అక్కడివారిని బెదరించి, థేరీని విడిపించుకుపోతాడు. తరవాత హంతకులు మంత్రి హత్యకోసం చెయ్యవలసిన ఏర్పాటులన్నీ చేశారు. ఈలోగా ఒక హంతకుడు పోలీస్ సూపర్నెంటు వేషంతో మంత్రికి ఆఖరి హెచ్చరిక అందజేస్తాడు! ఈ లోగా బిల్లీ మార్క్సు అపూర్వహంతకుల నోట్‌బుక్ కొట్టేస్తాడు. అది పోలీసుల చేతుల్లోపడింది. పోలీసులుబిల్లీని విడిచిపెట్టి ఆ నోట్‌బుక్-ఆసామీనెల్లాగైనా పట్టుకోమని పంపిస్తారు. బిల్లీనురాశవల్లఅదనెర వేరదు. తరవాత బిల్లీమార్క్సు, థేరీ, మంత్రి చనిపోతారు. అటుపిమ్మట జరిగిన శవపంచాయితీ విచారణలో ఇంకా కొన్ని హత్యారహస్యాలు బయలుపడతాయి.

★ అపూర్వ హంతకులు ★

"సర్ ఫిలిప్ కాగితాల్లో ఈ హత్యకి కావలసిన రహస్యాలేవీ బయటపడలేదా?"

"ఇంతవరకు ఏమీ దొరకలేదు!" పోలీస్ కమిషనర్ పెన్ కొన కొరుకుతూ—

"మంత్రి స్వంతభవంతి బాగా సోదా చేశారా?" అన్నాడు.

ఫాల్‌మాత్ బొమముడి విరిచాడు.

"అది సోదా చెయ్య వలసినంత అవసరమేమీ కనబడదే!"

"మరిపోర్ట్‌లాండ్ పాలస్ మాటో?"

"అదికూడా సోదా చెయ్యలేదు! హత్య జరిగిన సమయానికి దాని తలుపులు తాళాలు వేశారు."

కమీషనర్ లేచి నిలబడి—

"పోర్ట్‌లాండ్ భవనం ఇంకా బాగా సోదా చేసి చూడండి! ప్రస్తుతం అది ఆ మంత్రి ఆస్తి ధర్మకర్తల చేతుల్లో ఉన్నట్టుంది" అన్నాడు. వెంటనే అక్కడినించి వెళ్ళిపోయాడు. డిటెక్టివ్ అక్కడినించిబయలుదేరి ఒక బగ్గీ తీసుకుని పావుగంటలో పోర్ట్‌లాండ్ భవనం జేరుకున్నాడు. ఆ భవంతిలో ఎవరు లేరు. చూడడానికి ఆ ప్రాంతం అంతా జీబూతంలా ఉంది. తరవాత కొంతసేపటికి ఒక నౌకరు వచ్చి తలుపులు తెరిచాడు. అతడు మంత్రిబట్లర్. ఫాల్‌మాత్‌కు కొంచెం పరిచయం ఉన్నవాడే!

"ఈ భవంతి అంతా ఒకసారి సోదా చెయ్యాలి! ఇక్కడి వస్తువులేమన్నా అక్కడికి ఇక్కడికీ మార్చడం జరిగిందా?"

నౌకరు తల అడ్డంగా తిప్పి—

"ఏవీ మార్చలేదు! బాబూ! సరీగా మంత్రిగారి ఇల్లు విడిచిపెట్టి నప్పుడెలాగ ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. లాయరుగారింకా వస్తువుల జాబితా తయారు చెయ్యలేదు" అన్నాడు.

ఫాల్‌మాత్ హాలులోనించి నడిచి బట్లరు గదిలోకి వెళ్ళి—"ముందుగా మంత్రి చదువుకునే గది సోదా చేద్దా మనుకుంటున్నాను" అన్నాడు.

"అయితే అది కొంచెం ఇబ్బందే!" అన్నాడు నౌకరెంతో మర్యాదగా.

"ఏమిటా ఇబ్బంది?" అన్నాడు డిటెక్టివ్ సాధికారంగా.

"ఆ గదితాళం చెవిమాత్రం నాదగ్గర లేదు బాబూ! ఎందుచేతంటే, అది ఆయన ఏకాంతంగా కూర్చుని చదువుకునే గది. దాని కాయనే తాళం వేసుకుని తాళం చెవి తమ దగ్గిరే అట్టే పెట్టుకునేవారు. మంత్రి పదవి వచ్చినప్పటినించీ ఆ గది విషయమై చాలా జాగ్రత్త పడుతున్నారు. ఆయన చాలా జాగ్రత్తయిన మనిషి!- ఇది మీకు నేను ప్రత్యేకంగా చెప్పాలా బాబూ.!"

ఫాల్‌మాత్ మళ్లీ ఆలోచనలో పడ్డాడు: మంత్రి భవంతికి సంబంధించిన తాళంచెవులు చాలా వరకు స్కాట్లండ్ యార్డ్‌లో ఉన్నాయి. వెంటనే ఒక చీటీ వ్రాసి నౌకరు చేతికిచ్చి అతన్ని తన బగ్గీ మీదే స్కాట్లండ్ యార్డ్‌కు పంపించేశాడు. మళ్లీ బట్లరుతో బాతాఖానీ వేశాడు:

"మంత్రి హత్య జరిగినప్పుడు నువ్వెక్కడ ఉన్నావు?"

"పట్టణం విడిచి వెళ్ళిపోయాను బాబూ! ఆయన నౌఖర్లను ఇళ్లకు వెళ్ళిపొమ్మని పంపించేశారు! మీకు తెలియదా?"

"మరి ఈ భవంతి కాపలా సంగతి?"

"ఇక్కడ ఇంకెవరు లేరుబాబూ!"

"నువ్వు మళ్లీ తిరిగివచ్చాక ఈ ఇంట్లోకి ఎవరైనా ప్రవేశించిన జాడలున్నాయా?"

"ఏమీ లేవుసార్! ఈ ఇంట్లో జొరబడడం మాటలతో పనికాదు. ఏదేనా దొంగతనం జరిగిందంటే-వెంటనే పోలీసు స్టేషన్లో గంట గణగణా మోగిపోతుంది. ఈ ఇంటికి అలాంటి గట్టి కట్టుదిట్టాలు చేశారు! కిటికీలకన్నింటికి తాళాలు వాటంతట అవ్వే పడిపోతాయి!"

"కిటికీలమీదగాని తలుపులమీదగాని లోపలికి ఎవరైనా వెళ్ళిన ఆచోకీ లేమీ కనబడలేదా?"

"రోజురోజు రంగులు అవ్వీ బాగా ఉన్నాయో లేవో చూస్తూంటాను! ఎక్కడా అల్లాంటి జాడ లేవీ కనబడలేదు సార్!"

తరవాత ఒక అరగంటలో స్కాట్లండ్ యార్డ్ నించి తాళంచెవులగుత్తి పట్టుకు వచ్చిన పోలీసాఫీసరక్కడికి చేరుకున్నాడు. ఫాల్‌మాత్ అతనిదగ్గిరనించి ఆ తాళంచెవులగుత్తి తీసుకున్నాడు.

బట్లరతన్ని మొదటి అంతస్థుకు తీసుకుపోయాడు. తరవాత అక్కడ మంత్రి చదువుకునే గది చూపించాడు. దాని తలుపు మీద ఒక చిన్న తాళం వేళ్లాడుతూంది.

ఫాల్‌మాత్ అతి జాగ్రత్తగా తాళంచెవి వెతికి పట్టుకుని తాళం తీయబోయాడు. రెండు మూడు సార్లు ప్రయత్నించినా రాలేదు! చివరికి అతి కష్టంమీద తాళం వచ్చింది. తరవాత నిశ్శబ్దంగా తలుపు తెరుచుకుంది. గది అంతటా చిమ్మ చీకటి! డిటెక్టివ్ గది గుమ్మంలోనే నిలుచున్నాడు.

"అన్నట్టు మరిచిపోయాను. కిటికీలు తెరవనా?" అన్నాడు బట్లరు.

"తెరు!"

ఒక క్షణంలో గదిలో వెలుతురు ప్రవేశించింది. అందులో చేసిన ఏర్పాట్లలో పెద్ద ఆర్భాటమేమీ లేదు! మంత్రి చనిపోయిన గదికీ దీనికీ ఏర్పాట్లలో అట్టే తేడా లేదు! ఇంచుమించుగా అన్ని కుర్చీలు కొన్ని బల్లలు ఒకలాగే ఉన్నాయి. గది గోడలలో అక్కడక్కడ పుస్తకాల బీరువా లమర్చారు! మధ్యన ఒక పెద్ద టేబిల్. దానిమీద కట్టల కొద్దీ కాగితాలు. కాని అవ్వన్నీ అతి జాగ్రత్తగా సర్దిపెట్టున్నాయి.

ఫాల్‌మాత్ గది నాలుగుమూలలా అతి జాగ్రత్తగా పరకాయించాడు. ప్రతివస్తువు మీద దట్టంగా దుమ్ముపడింది. ఆ టేబిల్ దగ్గిరగా ఒక టెలిఫోను కనిపించింది.

"బల్లమీద వేరేగంట లేవీ లేవే!"

"మంత్రిగారికి గంటలంటే మహామంట! కొంచెం 'బజ్' మనే చిన్న గంట మాత్రం ఒకటి ఏర్పాటు చేశారు. అంతే!"

ఫాల్‌మాత్ కాసంగతి వెంటనే జ్ఞాపకం వచ్చింది.

"అవునవును! మరిచేపోయాను!" అన్నాడు.

తరవాత టెలిఫోను పైకెత్తి - "హలో!" అని పిలిచాడు. కొంతసేపు అతి జాగ్రత్తగా విన్నాడు. ఏమీ వినబడలేదు.

"టెలిఫోను గాని పాడైపోయిందా?"

నిజానికది బాగా పాడైపోయినట్టే ఉంది. దాని లోలోపలి యంత్రాలు కొన్ని తుప్పుపట్టి మసిఅయిపోయిన సూచనలు కనిపిస్తున్నాయి. ఆ టెలిఫోనుకీ పై ప్రపంచానికీ సంబంధం కలిపే వైర్ తెగిపోయింది. దాని రంగు మాసిపోయింది. అది పెట్టిన ప్రదేశంలో బల్ల బాగా కాలిపోయింది.

డిటెక్టివ్ ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి, పక్కనే నిలబడిన పోలీసాఫీసరుతో—

"రిజెంట్ స్ట్రీట్‌కు వెళ్ళి వెంటనే ఎలక్ట్రిషియన్ని ఒకణ్ణి తీసుకురా! ఇక్కడున్నట్టుగా రావాలి" అన్నాడు. తరవాత డిటెక్టివ్ ఆ టెలిఫోనుకేసి అలాగే చూస్తూ నిలబడ్డాడు.

తరవాత కొంతసేపటికి ఎలక్ట్రిషియన్ అక్కడికి వచ్చాడు.

డిటెక్టివ్ అతన్ని చూస్తూనే— "ఈ టెలిఫోన్ ఇలా గుందేం!" అన్నాడు.

అతడు కళ్ళజోడు పెట్టుకుని ఆ టెలిఫోన్ జాగ్రత్తగా పరిశీలించి - "పనిమనుషులెవరో బొత్తిగా అశ్రద్ధగా పనిజేసినట్టున్నారే!" అన్నాడు.

"పనిమనుషుల అజాగ్రత్తా?" అన్నాడు డిటెక్టివ్.

"ఈ టెలిఫోన్ వైర్ అతికించినవాడెవడో శ్రద్ధగా పనిజేసినట్టు కనబడదు. సార్."

తరవాత డిటెక్టివ్ దాని లోపలిభాగం అంతా అతనికి చూపించి—"ఇదేమిటి? ఇదంతా పూర్తిగా ధ్వంసమైపోయిందే! కనబడ్డం లేదా?" అన్నాడు.

"ఔనౌను! ఇదంతా పూర్తిగా పాడైపోయింది! ఎందుచేత?"

తరవాత ఎలక్ట్రిషియన్ తెగిపోయి నేలమీద పడిఉన్న ఒక టెలిఫోన్ వైర్ ముక్క చేత్తో పట్టుకుని, అతిజాగ్రత్తగా పరిశీలించి ఇలాగన్నాడు:

"ఎవరోగాని బాగా ఎక్కువ విద్యుచ్ఛక్తి ఉన్న తీగ ఈ టెలిఫోన్‌తో జతపరిచారు. ఆ సమయంలో ఎవరైనా యీ టెలిఫోన్ ఉపయోగించి ఉంటే—"

అంతే! ఆపైన అత డేమీ అనలేకపోయాడు. అతని మొహం అంతటా తెల్లగా వెల్ల వేసినట్టయింది! తరవాత మెల్లిగా ఇలాగన్నాడు. "మంత్రిని విద్యుచ్ఛక్తి ఆఘాతంతో హత్య చేసేశారు! సందేహం లేదు!"

ఒక్క క్షణందాకా ఎవరినోటా మాట పెగలేదు! ఫాల్‌మాత్ జేబులో చెయ్యిపెట్టి కెల్లీమార్గ్ ఇచ్చిన నోట్ బుక్ పైకి తీశాడు. తరవాత గట్టిగా ఇలాగ అరిచాడు:

"సరే! తెలిసిపోయింది. ఆ వైర్ ఎలాగ పనిచేసేదీ ఇందులో రాశారు!—అయితే డౌనింగ్ స్ట్రీట్ టెలిఫోన్ ఎందుకు పాడైపోలేదు? ఇదిమాత్రం నాకేమీ బోధపడడం లేదు!"

దానిమీద ఎలక్ట్రిషియన్ గట్టిగా తల పంకించి ఇలా చెప్పాడు:

"ఈ ఎలక్ట్రిసిటీచేత ఎన్నిరకాలుగానైనా పని జరిపించవచ్చును! అందుచేత మరి దీన్ని గురించి బుర్ర బద్దలుకొట్టుకుంటే ఏమీ లాభంలేదు! అదీగాక ఆ విద్యుచ్ఛక్తి వల్ల బయలుదేరే పెద్ద ఆఘాతం మరి ఒకవైపు మళ్ళించి, మంత్రికి చాలా సామాన్యమయిన షాక్ తగిలేటట్టు చెయ్యవచ్చును. ఇలాగ ఎలాంటి ఏర్పాటుచేసినా చెయ్యవచ్చును. ఇందులో పెద్ద ఆశ్చర్యం ఏమి ఉంది!"

దానిమీద ఫాల్‌మాత్ కంగారుగా అడిగాడు:

"అయితే—ఆ తీగ తగిలించే మనిషికే ఆ పెద్ద షాక్ తగిలి, మంత్రికే చిన్నషాక్ తగిలిఉంటే—"

"ఏం! అలాగ జరిగినా జరగవచ్చును!"

"ధేరీ యీ వ్యవహారంలో నేతావాతాగాని పని చేశాడు. వెంటనే దానిఫలితం అనుభవించాడు" అని అపూర్వ హంతకులు ఆఖరి ఉత్తరంలో రాసిన మాటలు తలుచుకుంటూ ఫాల్‌మాత్ మెల్లిగా ఇలాగన్నాడు: "మంత్రికి చిన్న షాక్ తగిలింది. దానితోనే ఒక్క జబ్బుపోయి ప్రాణాలు వదిలివేసి ఉంటాడు. పైగా దానికి అతని గుండె నీరసంకూడా తోడై ఉంటుంది. అతని చేతిమీద మచ్చ కూడా ఆ షాక్ మూలానే పడిఉంటుంది! పొక్కులు కూడా దాని మూలానే వచ్చిపోయి ఉంటాయి. ఇప్పుడంతా తెలిసిపోయింది!"

తర్వాత అబాకులు తయారుచేసే కంపెనీ భవంతిమీద పోలీసులొక దాడిజరిపారు. కాని అక్కడ అంతగా చెప్పుకోదగిన దేదీ కనిపించలేదు. ఒక పక్కన సగం కాల్చి పారేసిన సిగరెట్టు ముక్క కనిపించింది. ఇంకా కొంచెందూరంగా న్యూయార్క్ పోయే ఓడమీద పూర్తిగా ప్రయాణం చెయ్యడానికి పనికొచ్చే మొదటి తరగతి టికెట్ మొదటి భాగం ఒకటి కనబడింది. దానిమీద "ఆర్. ఎమ్. ఎస్. లుకానియా" అనే పేరు కనబడింది. టికెట్ మొదటి ముక్క జాగ్రత్తగా పరీక్ష చేసిన మీదట అది ముగ్గురు ప్రయాణీకుల టిక్కట్టని స్పష్టపడిపోయింది.

'ఆర్. ఎమ్. ఎస్. లుకానియా' న్యూయార్క్ రేవు జేరగానే పోలీసులు ఆ ఓడలో ప్రతి అంగుళము సోదాచేశారు. కాని ఎంత వెతికినా అపూర్వ హంతకుల జాడ లెక్కడా కనబడలేదు!

పోలీసులచేత ఈవిధంగా గట్టిగా శోకరాతనిపించిన వారెవరో కాదు! గోన్సాలెజ్!

—అయిపోయింది.



జీవిత సంధ్య

ఇల్లిందల సరస్వతీదేవి

కుమారుని బండి ఎక్కించి, రాజమ్మ వాకిటి అరుగుమీద కూర్చుని, కన్నీళ్లు కొంగుతో అద్దుకుంటూ, పొరుగింటి సీతమ్మతో కడుపులో వున్న బాధనంతా వెళ్లబోసుకొన్నది. 'అమ్మాయి అత్తవారిది పదిమందికి పెట్టగల సంసారము. అల్లుడు చదువుకున్నాడు. యోగ్యుడు. కాని ఇంట్లో ఇద్దరు వృద్ధ వితంతువులు ఉన్నారు. ఆయన మేనత్త, తల్లి వారి ద్వారా కొంత ఆస్తి ఇతడికి సంక్రమించిన మాట నిజమే. వాళ్ళిద్దరూ ఎంతో త్యాగం చేసి ఇతడిని వృద్ధిలోకి తీసుకొని వచ్చారు. అతడంటే ప్రాణంతో సమానంగా చూసుకొనేవారు. ఇప్పుడు వారిద్దరూ వృద్ధులయారు. వాళ్లిద్దరూ చాల ఉత్తములు. శాంత స్వభావము కలవారు. కాని వయసు మళ్లగానే వాళ్ళ స్వభావాలు మారినట్లున్నాయి. ప్రతిపనికీ తప్పుపట్టటమూ, చికాకుపడటము అరవటమూ తప్ప నుంచిమాట ఒక్కటయినా నోటివెంట రావటము లేదు. ఈ గొడవలకు అమ్మాయికి జీవితము దుర్భరమనిపిస్తున్నది. ఇదివరకు కలకలలాడు దాని సంసారము ఇప్పుడు గుసగుసలతో, చికాకులతో తగవులతో, గడచిపోతున్నది. అతడు యింటికి వచ్చినదే తడవుగా వృద్ధులిద్దరూ లెక్కలేనన్ని చాడీలు, అసందర్భపు మాటలూ, తిట్లూ, శాపనార్థాలు వెలిన వేస్తారు. ఏరోజు కారోజు 'మేము ని యింటినుంచి వెళ్ళిపోతాము' అని బెదిరిస్తూ ఉంటారు. అతడు ఎంత ఓరిమి కలవాడయినా, ఈ సందర్భములో అమ్మాయి నిర్దోషి అని తెలిసినా, దానిని కోపపడకుండా ఉండలేడు. అతడూ ఒళ్ళుమరచి కొట్టడము మొదలు పెడుతూ ఉంటాడు. అమ్మాయి మాత్రము ఏంచేస్తుంది? ఉదయం లేచినప్పటినుంచీ వృద్ధులకు ఉపచారము, పిల్లల పోషణ, గృహకృత్యాలు, ఆయనకు కావలసినవన్నీ అమర్చటముతో సాపుగంటయినా విశ్రాంతి లేకుండా చాకిరిచేస్తుంది. అక్కడికి ధనాభావము లేని సంసారము కనుక నౌకర్లె చాలావరకు పనిచేస్తారు. వాళ్లు ఎంతచేసినా అమ్మాయికి చేతినిండా పని ఉండనే ఉంటుంది. కాని ఎంతచేస్తే ఏం లాభము? ఇతరులకు మెప్పులేదు-దానికి సుఖము లేదు.'

'జీవితము దుర్భరముగా ఉన్నదని ఆ వృద్ధులను ఎక్కడికి పంపుతారు? వాళ్ళిద్దరూ తమ దేహాలలో శక్తి ఉడిగేవరకూ ఇతడికి చాకిరీ చేశారు. ఇతడికొరకు ఎంతో త్యాగముచేశారు. వాళ్లమీద అతడికెంతో అపేక్ష గౌరవమూను. అటువంటివారిని వృద్ధాప్యములో నిరాదరణ చేయటము భావ్యమా? అతడు అటువంటి నీచపుపని చేయలేడు. కాని నిర్హేతుకమయిన వారి అఘాయిత్యము సాధింపులు తొందరపాటు భరించలేకుండా ఉన్నాడు.'

ఇటువంటి సమస్యలు ఇంటింటా ఉండేవే. అందరికీ అనుభవైకవేద్యమే. కొన్ని కుటుంబాలలో వృద్ధులను అనాదరముగా అగౌరవముగా చూస్తారు. సంఘములో అవి క్రొత్త విషయాలు కావు. ఇవన్నీ వ్యక్తుల మధ్య ఉన్న సంబంధబాంధవ్యాలలోని తరతమ భేదాలతో ఉంటాయి. ఈ సమస్యలు అత్తమామలవల్ల ఏర్పడుతాయిగాని తలిదండ్రులవల్ల పొటమరించవని నమ్మటానికి వీలులేదు. ప్రతి రంగములోనూ వృద్ధులతో ఈ రకపు అనుభవాలు కలిగే సంభవము ఉన్నది.

ఈ సమస్యలను నిష్పక్షపాతముగా ఉద్రేకరహితముగా ఆలోచించి చూచినట్లయితే — సంబంధ బాంధవ్యములవల్ల గాని, వృద్ధుల జీవనము యితరులమీద ఆధారపడటముచేత గానీ కలిగినవి కావని తెలుస్తుంది. ఈ సమస్యలు వయసుకు సంబంధించినవిగా కన

బడకమానవు. ఎంత ఉత్తములయినా, విద్యా సంస్కారములు కలవారయినా, వృద్ధాప్యము రాగానే చికాకునుండి తప్పుకోలేరు. స్వభావంలో కలిగే ఈ మార్పులు వ్యక్తుల పరిస్థితులను బట్టీ స్వభావాలనుబట్టీ భేదిస్తూ ఉంటాయి.

వృద్ధులవల్ల ఇతరులకు బయలుదేరిన సమస్యల విషయమటుంచి, వారిని పలుకరించి చూస్తే ఆ పక్షాన కూడా కొన్ని కనబడకపోవు. ఏ వృద్ధుని పలుకరించినా, తనకు సుఖము లేదు. తన వాళ్ళందరూ నిర్లక్ష్యముగా నిరాదరణగా చూస్తున్నారు. తాను ఆఖరి ఘడియకోరకు నిరీక్షిస్తున్నట్లుగా మాట్లాడుతూ ఉంటారు. ఈ రెండు పక్షాల ఉన్న వాద ప్రతివాదాలు మనకు సంఘములో అన్ని తరగతులలోనూ కనబడుతూ ఉంటాయి.

వృద్ధులకు సంబంధించిన సమస్యలు జరుగుబాటుకు సంబంధించినవీ, వయసుకు సంబంధించినవీ రెండు రకాలు ప్రధానముగా కనబడుతాయి. జరుగుబాటుకు సంబంధించిన సమస్యలు కొందరికే ఉంటాయి; కాని వయసుకు సంబంధించినవి అందరికీ ఉండేవే. జరుగుబాటుకు సంబంధించిన సమస్యలను సంఘము తలుచుకుంటే సర్దుబాటు చేయవచ్చు. కాని వయసుకు సంబంధించిన వాటిని ఎవరికి వారు పరిష్కరించుకొనవలసినదే. ఈ వృద్ధాప్యపు సమస్యలు ఒక దేశానికీ, ఒక కాలానికీ, ఒక వ్యక్తికీ సంబంధించినవి కావు. అన్ని దేశాలకూ, అన్ని కాలాలకూ, అందరికీ సంబంధించినవి. ప్రతి వ్యక్తికి బాల్య యౌవన వృద్ధాప్య దశలు ప్రకృతిసిద్ధమయినవి. వాటిలో స్త్రీలకూ పురుషులకూ జాతి నాశ్రయించిన పరిస్థితుల భేదము సహజమైనది.

వృద్ధాప్యమువిషయములో ఒక్కొక్క దేశములో ఒక్కొక్క దృక్పథము గోచరిస్తుంది. కొన్ని దేశాలలో ఆ దశను గురించి అంతగా శ్రద్ధవహించరు. భారతదేశము ఆధ్యాత్మిక చింత కలది. భారతీయుడు చేసే ప్రతి పనిలో, ప్రతి మాటలో ఆధ్యాత్మిక చింత అతనికి తెలియకుండానే ఇమిడి ఉంటుంది. వృద్ధాప్యములో ఆ చింతను వృద్ధి చేసుకోవాలన్నది సంప్రదాయసిద్ధమైన ఆచారము. బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము అనే ఆశ్రమ చతుష్కం ఈ దృష్టితో ఏర్పడినదే. ఈ నాలుగు ఆశ్రమాలకు విధ్యుక్తధర్మాలు ప్రత్యేకింపబడ్డాయి. వానప్రస్థాశ్రమములో సంసార బాధ్యతలనూ భారాలనూ తమ కుమారులకు ఒప్పగించి అడవులలో నివాసమేర్పరచుకొని ఆహార నియమముతో జీవించవలసి ఉంటుంది. జీవితములో నిర్వర్తించవలసిన విధి కృత్యాలు బాధ్యతలు ముగిసిన తరువాత అందరూ ఈ మార్గాన్ననుసరించేవారు. భారత యుద్ధానంతరము గాంధారీ ధృతరాష్ట్రులు కూడా ఈ ఆశ్రమ ప్రవేశము చేసినట్లు భారత కథవల్ల తెలుస్తున్నది. పాండవులందరూ ఈమార్గాన్నే అనుసరించారు. రామాయణ కథలో కూడా వానప్రస్థాశ్రమము అక్కడక్కడ వివరింపబడ్డది. ఆ కాలములో సాధారణముగా స్త్రీలు పతులను అనుసరించేవారు.

క్రమముగా వానప్రస్థాశ్రమపు బాహ్యరూపములో మార్పులు కలుగ నారంభించాయి. వృద్ధులు అడవులకు వెళ్ళటము, ఎవరికీ తెలియకుండా దేహాలను చాలించటము మనము ఈ కాలములో ఊహించరానివి. కాని ప్రభుత్వోద్యోగాలలో ఉద్యోగ విరమణము వానప్రస్థాశ్రమ స్వీకారాన్ని సూచించేదే. దేహదార్ఢ్యము అంతగా తగ్గకపోయినా, మానసిక శారీరకమైన శక్తి సామర్థ్యాలు క్షీణించ నారంభిస్తాయి కనుకనూ, స్వభావములో గమనించతగిన మార్పులు కలుగుతాయి కనుకనూ బాధ్యతకల పనులను తగ్గించుకొని, విశ్రాంతి తీసుకొంటూ సుఖముగా కాలయాపన చేయవలసినదనే భావముతో ఉద్యోగ విరమణము ఏర్పడ్డది. ఈ విశ్రాంతి ఉద్యోగ రీత్యా కాకుండా సాంసారికముగా కూడా తీసుకొంటే సార్థకమవుతుంది. దీనివల్ల లౌకికమైన, సాంసారికమయిన సుఖదుఃఖాలకు వృద్ధుల మనసు కలత పడకుండా ఉండటము జరుగుతుంది. ఈఅంశాలు స్త్రీపురుషుల కిద్దరికీ వర్తిస్తాయి.

వృద్ధాప్యానికి వయోనిర్ణయము చేయటము కష్టమైన పని. దీనికి తగిన ప్రమాణాలూ ఆధారాలూ నిర్ణయింపబడి లేవు. దేహములో శక్తి పటుత్వమూ తగ్గిన లక్షణాలు కనబడగానే వృద్ధాప్యము వచ్చినట్లుగానే భావించాలి. ఇంగ్లండు దేశములో స్త్రీలకు 60 సంవత్సరాలకు, పురుషులకు 65 సంవత్సరాలకూ ఉద్యోగ విరమణ కాలము నిర్ణయింపబడ్డది. అమెరికాలో సోషల్ సెక్యూరిటీ ఆక్టు ననుసరించి 65 సంవత్సరాల వరకూ స్త్రీ పురుషులు ఉద్యోగాలలో ఉండవచ్చు. ఫ్రాన్సులో చేతి పనులు చేసేవారు దేహములో శక్తి ఉన్నంత వరకూ పనిచేయవచ్చు. పారిశ్రామిక రంగములో 60 సంవత్సరాలకే విశ్రాంతి తీసుకోవలసి ఉంటుంది. ఉద్యోగవిరమణ తరువాత కూడా చాలా మంది, దేహారోగ్యమును ననుసరించి కొద్ది పనులు చెయటము జరుగుతున్నది.

ఉద్యోగవిరమణ తరువాత వృద్ధులు ఉండవలసినది ఎక్కడ, ఉండాలన్నది ఈ సమస్యలలో ప్రధానమైనది. ఇంగ్లండులో తలిదండ్రులను సంతానము పోషించవలసిన బాధ్యత న్యాయశాస్త్రరీత్యా లేదు; కాని నైతికముగా ఉన్నది. డెన్మార్కులో కూడా తలిదండ్రుల పోషణభారము చట్టసమ్మతమైనది కాదు; కాని సాంఘికమైనది. అమెరికాలో తలిదండ్రులను గాని, తాత ముత్తవలను గాని పోషించే బాధ్యత చట్టసమ్మతమైనదీ కాదు, సాంఘికమైనదీ కాదు. కాని భారత దేశములో తాత ముత్తవలు, తలిదండ్రులు, పిల్లలుకలిసి ఒకయింటిలో ఒక కుటుంబముగా ఉంటారు. తలిదండ్రులు కుమారులవద్దనే తమవృద్ధాప్యము గడచిపోవాలనీ, వారి చేతిమీదుగా తమ జీవితాలు దాటిపోవాలనీ ఆశిస్తారు. కని, మమకారముతో పెంచిన తలిదండ్రులను, ప్రేమతో భక్తిగౌరవాలతో సేవించి ఋణము తీర్చుకోవాలని కుమారులుభావిస్తారు. ఇది భారతీయుల ఆదర్శము. మొత్తము మీద అన్ని దేశాలలోని వృద్ధుల పరిస్థితులను సమీక్షించినట్లయితే తమ సంబంధీకుల వద్దవుండి జీవించే వృద్ధుల సంఖ్యే ఎక్కువగా కనబడుతోంది. అటువంటివారు నూటికి 85 వంతులు ఉన్నట్లు లెక్కలవల్ల తెలియవచ్చినది. కాని వారిలో అసంతృప్తికరముగా జీవిస్తున్నామని భావించేవారు ఎక్కువగా ఉన్నారు.

విదేశాలలో మూడు తరములవారు కలిసి నివసించే కుటుంబాలు నూటికి 4 లేక 5 మాత్రమే ఉన్నాయి. ఆ కుటుంబాలలో కొన్ని యిండ్లలో తాత ముత్తవలు నివసించటానికి ప్రత్యేకముగా వసతులు కల్పింపబడుతాయి. కొందరు తలిదండ్రులూ సంతానము "మీరూ మేమూ విడివిడిగానే ఉందాము. అవసరము వచ్చినప్పుడు పరస్పరమూ సహకరించుకుందాము. మన రక్తసంబంధమూ ఆపేక్షలూ ఎదుగుగా ఉంటేనే గాని పోషింపబడవా?" అన్న ధోరణిలో ఉంటారు.

వృద్ధులకు సంపాదించే శక్తి ఉన్నంత వరకూ ధైర్యంతో జీవించగలుగుతారు. నిల్వ చేసుకొన్న ధనము ఏమాత్రము వున్నా జీవించటము సులభముగా ఉంటుంది. కాని

జీవిత సంధ్య

అందరికీ సమృద్ధిగా చేతినిండా ధనమువుండటము అసంభవము. అటువంటివారు సంపాదించే శక్తి తగ్గిపోయిన తరువాత జీవనాధారానికై ప్రాకులాడవలసివస్తుంది. ప్రభుత్వోద్యోగాలు చేసేవారికి పెన్షను పరిమితముగా వస్తుంది. ఇటువంటి యిబ్బందులు కలుగకుండా ఉండటానికే భీమా కంపెనీలు పుట్టాయి. కొన్ని ఉద్యోగాలలో పెన్షనుకు బదులుగా ప్రావిడెంటుఫండు వంటివి ఏర్పరచబడ్డాయి. వృద్ధాప్యములో జీవనాధారము లేదని విచారపడకుండా ఉండటానికి ఇవన్నీ ఏర్పడ్డాయి.

ప్రతి దేశములోనూ ప్రజలకు భుక్తికోసం ఉదయాస్తమానాలు కష్టించవలసిన అగత్యము పెరుగుతునే ఉన్నది. యువకులు తీరుబాటుగా ఇండ్లలో వుండే అవకాశాలు నశించిపోయాయి. పూర్వము ఉన్నట్టుగా జీవితములో ఇప్పుడు విరామమూ విశ్రాంతీ కనబడవు. మనకంటె విదేశీయులు విరామము తక్కువగా ఉన్నదనుకొంటారు. ఇటువంటి పరిస్థితులలో వృద్ధులైన తలిదండ్రులనూ ఆప్తులనూ ఎంత అపేక్ష భక్తి ఉన్నప్పటికీ స్వయముగా సేవించటము కుదరదు. ధనాభావము, స్థలాభావము వల్ల ఇండ్లలో వృద్ధులకు తగిన వసతులు కల్పింపబడక పోవచ్చును. ఈ కారణాలచేత విదేశాలలో వృద్ధుల సమస్యను జాతిసమస్యగా తీసుకొని రాజకీయముగా చర్చించి, ప్రభుత్వయాజమాన్యమునను, పురపాలక సంఘ యాజమాన్యమునను కొన్ని వసతులను కల్పించారు. ప్రపంచ సంగ్రామానంతరము దిక్కులేని వృద్ధులకొరకు శరణాలయాలు కొన్ని స్థాపింపబడ్డాయి. అవి రెండవ యుద్ధ కాలములో, 1938 నుండి 1946 వరకూ, బాంబుల ప్రమాదము కలుగుతుందనే ఉద్దేశ్యముతో మూయబడ్డాయి. తిరువాత యథాప్రకారముగా నడుపబడుతున్నాయి.

విదేశాలలో ప్రజాసంస్థలు కొన్ని ఏర్పడి, ప్రజలకు వృద్ధాప్యములో కావలసిన వసతులను గురించీ, విధానాలను గురించీ పరిశోధనలు చేసి ప్రభుత్వానికి అందజేస్తూ ఉంటాయి. ఆ దేశాలలో 60 సంవత్సరాల వయసుగల స్త్రీపురుషులు ఇంకా పాతిక భాగము జీవించవలసిన వారుగా నిర్ణయించి, వారి సమస్యలను శ్రద్ధతో పరిశీలించటము జరుగుతున్నది. వృద్ధులకు తగిన వసతులతో జరుగుబాటూ, కాలక్షేపమూ ప్రధానమైనవిగా గుర్తించబడ్డాయి.

వృద్ధాప్యము దైహికముగా వచ్చినట్లే మానసికముగా కూడా ఏర్పడుతుంది. మానసిక దౌర్బల్యాన్ని పారద్రోలటానికి ఆ దేశాలలో అనేక ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ప్రకృతికి సంబంధించిన మార్పులను మనము మార్పలేము. కాని మానసిక దృక్పథాన్ని మార్చుకొని, జీవితానందాన్ని పొందటానికి ప్రయత్నించవచ్చునుకదా! యౌవనములో ఉన్న ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని జీవితపర్యంతము నిలుపుకొనే మార్గాలను అన్వేషించి ముదిమిని విస్మరింపచేటందుకు అనేక విధాలుగా ప్రయత్నించి వారు కృతకృత్యులవుతున్నారు.

చికాగో యూనివర్సిటీవారు అనేక సమస్యలను గురించి ప్రముఖుల చర్చలు ఏర్పాటు చేసి, రేడియోద్వారా ప్రసారము చేస్తూ ఉంటారు. ఆ చర్చలలో ఒక పర్యాయము ముదిమిని గురించీ, వృద్ధుల సమస్యలను గురించీ చర్చించారు. దానిలో సుప్రసిద్ధులైన వైద్యులు, మనస్తత్వశాస్త్రజ్ఞులు, సంఘసంస్కర్తలు, స్త్రీ ప్రతినిధులు పాల్గొని తెల్పిన సారాంశము అమూల్యమైనవి. అన్ని దేశాలకూ వర్తించేవి.

‘వృద్ధులకు జీవనోపాధికిగాని కాలక్షేపము కొరకుగాని అన్ని విధములయిన వసతులనూ కల్పించే బాధ్యత ప్రభుత్వమూ, ప్రజలూ వహించవలసినది. వృద్ధులు తమకు అర్జన, దేహబలమూ, తగ్గిపోతున్నందువల్ల అందరూ తమను అలక్ష్యము చేస్తారని భావించుతూ ఉంటారు. వారికి ఆ భావము కలుగకుండా, వారి దేహదార్ఢ్యమునుబట్టి, సులభముగా నిర్వర్తించగలిగిన పనులు సంఘపరముగా కల్పించాలి. సంఘములో వారికి ప్రాధాన్యత తగ్గిపోతున్నదను భావము వృద్ధు

శు కలుగకుండా మెలగవలసిన భారము సంఘానిదే. వృద్ధులకు వైద్యసౌకర్యాలు, కాలక్షేపముకొరకు వారికి తగిన క్రీడా సౌకర్యాలు, వైద్యసౌకర్యాలతో కాలనీలు నిర్మించి, వారినే నడుపుకొమ్మని అందుకు తగిన అవకాశాలను కల్పించాలి. వారందరినీ సమావేశపరచి వారి సమస్యలను చర్చించుకోవటానికి తగిన వసతులను కల్పించాలి. కాని వృద్ధులకు వసతులు కల్పించటములో ప్రభుత్వముగాని సంఘముగాని, యువజనులనూ వారి అభ్యుదయాన్నీ విస్మరించరాదు' అని నిర్ణయించారు.

వృద్ధాప్యములో అన్ని వసతులను కల్పించినా కొందరు సుఖముగా ఉండలేరు. వృద్ధాప్యములో కలిగే లక్షణాలే దీనికి కారణము. కొందరు వృద్ధులకు పిల్లలను చూస్తేనే కోపము; కొందరికి వారినవ్వులూ ఆటలూ కంటికి కనబడితే కోపము; కొందరికి యౌవనములో ఉన్నవారిని చూస్తే కోపము; కొందరు ఇతరులు సుఖముగాఉంటే చూడలేరు? చాలామంది వృద్ధులకు అందరూ తమ అదుపు ఆజ్ఞలలో ఉండాలనీ, కనుసన్నలలో మెలగాలనీ అభిలాష. వృద్ధులకు స్వభావములో వ్యతిరిక్తత కలగటము సహజము. అదెందుకూ? అట్లా ఎందుకు కావాలి? ఈ విధముగా ఎందుకు కారాదు? మొదలయినవి కొందరు యీ లక్షణాలను యధాతథంగా బహిర్గతము చేస్తారు. కొందరు సభ్యత అనే ముసుగు కప్పుతారు. పైకి వ్యక్తీకరించకపోయినా, వారిప్రవర్తనలో ఈ లక్షణాలు అంతర్గతమయే ఉంటాయి. ఈ కారణాల చేతనే స్వభావములో రుసరుసలు ఏర్పడ్తూ ఉంటాయి. జీవితానుభవముగల పెద్దల సలహాలు యువజనులకు 'సదా శిరోధార్యాలే; కాని అన్నిటినీ తు. చ. తప్పకుండా పాటించాలంటే కొన్ని అసందర్భాలు కలగటము సహజము. కనుక మానసికముగా వృద్ధులు సర్దుబాటు చేసుకోవటాన్ని అభ్యసించితే, జీవితానందము లభిస్తుందని మనస్తత్వ శాస్త్రజ్ఞులు సలహాయిచ్చారు. వృద్ధులకు యువజనుల పోకడలు అభిప్రాయాలూ నచ్చకపోవచ్చు. అయినా కాలమూ, అవకాశాలూ వారిపక్షాన ఉన్నాయి కనుక, నిస్సంగత్వముతో చూసీ చూడనట్లుగా తమకు సంబంధించినంతవరకే పట్టించుకొని మసలుకొంటే జీవితానందము లభిస్తుందని వారు తేల్చిన సారాంశము. వృద్ధులకు గుండె అదురు, రక్తపుపోటు ఉద్రేకము వల్ల హెచ్చుతూ ఉంటాయి. శూలనొప్పి, కడుపులో మంట మొదలైనవి పుట్టటముకూడా భావోద్రేకమువల్లనేననీ, తగిన జాగ్రత్త వహిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవటము అసంభవము కాదనీ వైద్యులు నిర్ణయించారు.

మన దేశములో వృద్ధాప్యపు సమస్య దిగువ తరగతిలో చెయ్యీ కాలూ ఆడినంతవరకూ లేదు. అంతవరకూ వారు శరీరకష్టము చేస్తూ ఉత్సాహముతో తిరుగుతూ జీవిస్తారు. చెయ్యీ కాలూ ఆడని స్థితిలోని వారికీ, వ్యాధిగ్రస్తులయినవారికీ తగిన వసతులు కల్పించటము సంఘ బాధ్యతే. పై తరగతుల వారికి పుష్కలంగా ధనము ఉంటుంది కనుక మానసికమైన సర్దుబాటు చేసుకొని, సంఘము కల్పించిన సామాజికపు సౌకర్యాలతో జీవితానందము అనుభవించవచ్చు. పోగా మిగిలినవి మధ్యతరగతి కుటుంబాలలోని వృద్ధజనుల సమస్య.

'మంచాన పడితే ఎవరు చూస్తారు? కొడుకులుగానీ కోడళ్ళుగానీ కూతుళ్లుగానీ ధనాపేక్షతోనే వృద్ధులను కనిపెట్టి చూస్తారు' అన్న భావముతో చాలామంది కొంత ధనాన్ని ప్రత్యేకించుకుంటారు. కొందరు వస్తురూపములో భద్రపరచుకొంటారు. సాధారణముగా మన దేశములో పెన్షను తీసుకొన్న పురుషులను, కనిపెంచే వయసుదాటిన స్త్రీలను వృద్ధులక్రింద జమకట్టడానికి ఆరంభిస్తారు. వృద్ధస్త్రీలు మనవులను దగ్గరచేర్చుకొని వారి పోషణభారము వహించుతూ ఉంటారు. సాధారణముగా కూతుళ్ళకూ కోడళ్లకూ పురుళ్లుపోయటమూ రోగులకు ఉపచారము చేయటమూ గృహవైద్యము చేయటమూ వారివంతు. వయస్సు మీరుతున్నప్పటికీ దేహము స్వాధీనములో ఉన్నంతవరకూ, ఏదో ఒకపని చేస్తూనే ఉంటారు. కాని కొందరికి ఇంటి విషయాలపైన అభిలాష కలుగదు. కొందరికి పురాణకాలక్షేపము ఇష్టముగా ఉంటుంది. కొందరికి సమాజసేవ అభిమానకరమైనదిగా ఉంటుంది. వారికి అభిమానమైన విషయాలలో మనసు కేంద్రీకరించినట్లయితే మానసిక దౌర్బల్యము త్వరగా కలుగదని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. కాలాన్ని అర్థముచేసుకొని, ఉత్సాహముతో, అన్నిటియందు అభినివేశము కల్పించుకొన్నందువల్ల కూడా వృద్ధులకు జీవితానందము లభిస్తుంది. వయసు అధికమయినా యువజనుల అభిప్రాయాలతో శ్రుతి కలిపే నేర్పును వృద్ధులు పెంపొందించుకొంటే జీవితానందము కరతలామలకమవుతుంది.

వృద్ధాప్యములో సుఖము లేకపోయిన తరువాత 80 సంవత్సరాలు బ్రతికినా ఒకటే, 100 సంవత్సరాలు బ్రతికినా ఒకటే. వయోధిక్యత పెరుగుతున్నకొద్దీ సుఖముగా ఉన్నవారు కనబడరు. చాలామంది సౌఖ్యము లేకపోబట్టి వృద్ధులుగా కనబడుతారు. మనోవ్యాకులతవల్ల వృద్ధాప్యము వచ్చినట్లుగా కొందరి విషయములో కనబడుతుంది. ఒక సమయము పదిమంది శాస్త్రజ్ఞులు వైద్యులూ సమావేశమై ఏకారణాలవల్ల మనిషికి వృద్ధాప్యము వచ్చినట్లు కనబడుతుందోనని పరిశోధన చేశారు. అనేకమంది వృద్ధులను అడిగి తెలిసికొన్నారు. మిగతా సౌకర్యాలతోపాటు తమ మాటకు విలువ యిచ్చే సమాజము ఉన్నట్లయితే సుఖముగా ఉంటుందనీ అది లేనట్లయితే ఎన్ని వసతులు ఉన్నా ఉత్సాహముగా ఉండదనీ వృద్ధులు తెలిపారు. ఎంత వృద్ధులయినా వారి శక్తిసామర్థ్యాలకు తగిన పని కల్పించి సంఘము సుఖపెట్టగలదు. ధనము సేకరించి అన్ని వసతులూ కల్పించగలదు. కాని తమ మాటకు విలువ ఉండవలెనన్న వృద్ధుల కోరిక మాత్రము వైయక్తికముగా సంపాదించుకొనవలసినదే. ★

ఒక సంగీత విద్వాంసురాలు పాటకచేరీ చేస్తోంది. శ్రోతలలో ఇద్దరుపత్రికావిలేఖరులున్నారు. పాట వినడం కష్టమనిపించి ఒక విలేఖరి రెండోవాణ్ణి అడిగాడు: "ఏం బ్రదర్! ఈ విడ పాడుతుంటే చాల బాగా ఉంటుందని నువ్వు మొన్న పత్రికలో రాశావే. ఇంతకంటే బాగా పాడేవాళ్లు లేరనా నీ ఉద్దేశం?"

"నా ఉద్దేశం పాట బావుందనికాదు, మనిషి బావుంటుందని."

రహీంఖాన్ రాజభక్తి

వి. రఘునాథరెడ్డి

వెన్నెల్లో విజయనగరం తళతళలాడిపోతోంది. తుంగభద్రా తరంగాల్లో విజయనగరం కోటగోడలు ప్రతిఫలిస్తున్నాయి. వెన్నెల, విరూపాక్షస్వామి గుడిగోపురం కనకకలశంపైన పడుతోంది. బంగారుకు మెరుగుబెట్టిన రీతి, ఆ గోపురం ద్విగుణీకృతమైన కాంతితో ప్రకాశిస్తోంది.

అది విపణివీధి. విజయనగర శోభనమంతా ఆ వీధి నిర్మాణంలోనే నున్నదేమో ననిపిస్తోంది.

ఒకప్రక్క రత్నాలు రాసులు రాసులుగా పోసుకొని అమ్ముతున్నారు. వారికి చోరభయమన్నది ఏకోశానా లేదు. మరొకప్రక్క ఘుమఘుమ వాసనలను వెల్రగక్కుతూన్న పువ్వుగుచ్ఛాలను అమ్ముతున్నారు. పురుషులు యిండ్లకు వెళ్తూ భార్యలకోసం పువ్వులు కొనుక్కుంటున్నారు. పువ్వులమ్ముతూన్న వాళ్ళలో రహీంఖానొకడు.

రహీంఖానుది పొరుగూరు. మంచి యౌవనంలో వున్నాడు. వివాహమై చాలా రోజులు కాలేదు. ఎప్పుడూ కోపం అతని ముక్కుపైనే తాండవమాడుతూంటుంది. అతనిది పువ్వుల వ్యాపారం. ఆ రోజు పెందలకడే యిల్లు చేరుకోవాలనుకున్నాడు. అందుకు, పువ్వులు సలీసువెలకు అమ్మడం కంటే అతనికి వేరే మార్గం కనిపించలేదు.

ఇంతలో ఆకాశమంతా మబ్బులు క్రమ్ముతున్నాయి. గుండెలు స్థిరైపోయేలా ఉరుము ఉరిమాయి. కనులు కన్పించకపోయేలా మెరుపులు మెరిశాయి. కుంభవర్షం! నీ కూటికుండలో దూకుదునో, నీ రత్నాల రాశిపై క్రుమ్మరింతునో, నీ పువ్వులంగడిపై పడుదునో అని క్షణక్షణానికి భయపెట్టసాగింది వర్షం! అందరూ అంగళ్ళు సర్దుకోజొచ్చారు. ఇంతలో కుంభవర్షం రానేవచ్చింది.

రహీంఖానుకు వర్షంలో తలదాచుకోడానికి, సత్రం కంటే సురక్షితమైన స్థలం ఏదీ కన్పించలేదు. విజయనగర రాజుల కాలంలో సత్రాలుకూడా సామంత రాజుల నగరులలాగుండేవి. అక్కడ, మజ్జన భోజనాదులు చేసుకోడానికి సకల సదుపాయాలూ వుండేవి. ఆ సత్రాల్లో విశ్రమింపవచ్చినవారిలో షాహుకారు, పేద అన్న తారతమ్యమే లేదు. రోగులు గూడా అందు తలదాచుకోవచ్చు.

సత్రంలో రహీంఖానుకు ఒక క్షయరోగి తటస్థపడ్డాడు. ఆ రోగి దగ్గుతో అవస్థపడుతున్నాడు. వారిద్దరు తప్పితే సత్రంలో, ఆ రాత్రి మరెవ్వరూ లేరు. అతనికి ఆ సత్రమే భూలోకస్వర్గంలా కన్పించింది. తన స్వంతయిల్లేమో ఒక పూరిపాక. ఇంటికన్న గుడి పదిలమన్న సామెత ముమ్మాటికి నిజమనిపించింది రహీంఖానుకు.

రహీం ఆ రాత్రి సత్రంలో వెచ్చగా నిద్రపోవాలనుకున్నాడు. అతడు హాయిగా నిద్రపోయి చాలా రోజులైంది. జామురాత్రికి పైగా యింటికి చేరుకోడం, మళ్లీ ఉదయమే లేచి విపణివీధికి పోవడం అతని దినచర్య అయిపోయింది. కాళ్లు అరిగిపొయ్యేలా తిరిగి తిరిగి అతని శరీరం మొండిబారిపోయింది. అతడిప్పుడు మార్దవ్యమన్నదే ఎరగడు. లాలిత్యమన్న పదం అతని చెవికే జొరబడదు.

రోగి దగ్గు రహీంకు నిద్రాభంగం కల్గించింది. దాన్నతడు ఏమాత్రమూ సహించలేకపోయాడు. జీవితంలో, ప్రపంచకష్టా

లను మరచి, హాయిగా ఒక రాత్రన్నా స్వర్గసౌఖ్యమనుభవిద్దామంటే, అదృష్టం లేకుండా పోయిందనుకున్నాడు. తన సహజమైన కోపానికి రోగి దగ్గు, అగ్నికి వాయువు తోడ్పడినట్లయ్యింది. ఆ రోగి, తన సౌఖ్యప్రదమైన ఉద్యానవనాన్ని కూకటివేళ్ళతో పెళ్లగించేస్తున్నాడని నిశ్చయించుకున్నాడు. క్షణక్షణానికి ద్విగుణీకృతమౌతూన్న కోపాన్ని అణచుకోలేకపోయాడు. ఈసారి దగ్గావంటే పొడిచేస్తానని రోగిని బెదరించాడు. కానీ, ఆ రోగి దగ్గును ఆపుకోలేకపోయాడు. ఒకటి, రెండు, మూడు సార్లు ఓర్చుకున్నాడు. అంతే. ఒక దెబ్బతో ఆ రోగిని పరలోకానికి పంపాడు.

చనిపోయేటప్పుడు రోగి కెవ్వున కేక పెట్టాడు. ఆ కేకను విన్న పహారా జవానొకడు అక్కడికి పరుగెత్తుకొచ్చాడు. ఒక పీనుగ, ప్రక్కన ఒక ముసల్మాను నిలబడిఉండటం జవాను చూచాడు. అతని కేమీ అర్థం కాలేదు. తన కసి తీరెనా అన్నట్లుగా ముసల్మాను యువకుడు తన కుడిచేతిని తనే చూచి మెచ్చుకుంటున్నాడు.

ఆలస్యం చేయకుండా, జవాను రహీంను ఖైదుజేశాడు. అప్పటి వరకు, రహీంకు అతని పరిస్థితి ఏమీ గోచరం కాలేదు. స్మృతి కొచ్చాక జవానును చూచి భయపడ్డాడు. సంజాయిషీ చెప్పుకోజూచాడు. కానీ లాభం లేకపోయింది.

అది కృష్ణదేవరాయల నిండు పేరోలగం. ఒక ప్రక్క తిమ్మరుసు దీర్ఘాలోచనా నిమగ్నుడై కూర్చొని

పొడుంకాయ

రెంటాల గోపాలకృష్ణ

★

విప్పర్ల అనే గ్రామంలో
వీధిబడి ఒకటుంది!
బడిపంతులు ప్రవర్తన
బహు విచిత్ర మైనది!

పొంకమైన పొడుముకాయ
బొడ్డు కొంగునే పెట్టును!
బింకముగా పలుమారులు
పట్టి పట్టి పీల్చు పొడుము!

బడిలో ఒకనాడాతడు
పాఠం చెబుతున్నాడు!
పిల్లలందరు వినగా
పెద్దగ ఇట్లన్నాడు!

"పరీక్ష పంతులొస్తాడని
వర్తమాన మొచ్చింది!
సరిగ జవాబు లివ్వకపోతే
బహు ప్రమాదం వస్తుంది!

భూమి ఎలా వుంటుందని
ఎవరినైన ప్రశ్నిస్తే,
బెదిరిపోక వెనువెంటనె
నావైపే చూడండి!

అపుడు మీకు నాదగ్గర
పొడుముకాయ చూపిస్తా!
గుండ్రముగా ఉంటుందని
మీకు గుర్తు కలిగిస్తా!"

అతి తెలివిగ ఆపంతులు
ఆలోచనయితే చేశాడు!
ముఖ్యమైన ఒక విషయం మాత్రం
బొత్తిగ మరిచే పోయాడు!

అందమైన పొడుంకాయలు రెండు
అతనిదగ్గరే ఉన్నాయి!
గుండ్రంగా ఉండే దొకటీ!
చదరంగా ఉండే దొకటీ!

వారము పొడుగున పలకకాయనే
పట్టుకురావడ మలవాటు!
ప్రతీ ఆదివారం మాత్రం
మరి గుండ్రటి కాయే తెస్తాడు!

మరుసటి రోజున బళ్ళోకి
పరీక్ష పంతులు వచ్చాడు!
'భూమి ఎలా ఉంటుంద'ని
ఒక బుడుతను ప్రశ్నించాడు!

సంతోషముతో పిల్లవాడు తన
పంతులువైపే చూచాడు!
పొడుముకాయలను గుర్తుతెచ్చుకొని
పొలుపుగ జవాబు చెప్పాడు!

"ప్రతీ ఆదివారంనాడు భూమి
గుండ్రంగానే ఉంటుంది!
తక్కిన రోజులలో మాత్రం అది
నలు చదరంగా ఉంటుంది!"

అది విని బడిపంతులు లోలోపల
గడ గడ గడ గడ వణికాడు!
పరీక్ష పంతులు మాత్రం పైకే
పకా పకా పక నవ్వాడు!

★ రహీంఖాన్ రాజభక్తి ★

ఉన్నాడు. కవులందరు, తమ తమ సహజశోభలతో సభకు వన్నె గూరుస్తున్నారు. సామంతులు, సైన్యాధిపతులు మరొక ప్రక్క తమ శౌర్యాన్ని, ధైర్యాన్ని వెలి గ్రక్కుతూన్న ముఖబింబాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నారు. చూపరుల కద్భుతమయిన సభలా కను లకు మిరుమిట్లు గొల్పుతోంది. ఆ సభా స్తంభాలలో తమ తమ ప్రతి బింబాలు అద్దంలో మాదిరి స్పష్టంగా వెలిగిపోతున్నాయి.

రాయలు దుష్టశిక్షకుడు. శిష్ట రక్షకుడు. అతని పరిపాలనలో న్యాయం నాలుగు కాళ్లపైనా సమంగా నడిచింది. దుర్మార్గులకు నిర్దయతో కఠినశిక్ష విధింపబడుతూ ఉండేది. ఒకవ్యక్తిని అన్యాయంగా చంపినవానికి, విచారణా రహితంగా ఉరిశిక్ష విధింపబడుతూ ఉండేది. అటువంటి సమయాల్లో రాయలు కర్కశత్వాన్ని వహించును. మార్దవమును మరచిపోవును.

నిండు పేరోలగంలో, ఖైదీగా బంధింపబడిన రహీంఖాను ప్రవేశ పెట్టబడ్డాడు. మహారాజవాను, రహీం చేసిన హత్యా విషయాన్ని సమగ్రంగా వివరించాడు. రాయల కోపానికి అంతులేకపోయింది. అతని కళ్ళు ఎర్రబడ్డాయి. ముఖం రక్తంలా మారిపోయింది. అప్పాజీతో సంప్రదించకనే, హత్యా నేరానికి హత్యే శిక్షని, రహీంకు ఉరిశిక్ష విధించాడు.

రాయలు చిన్నప్పటినుంచి తిమ్మరుసును 'అప్పాజీ' అని ఆప్యా యంగా పిల్చేవాడు. తిమ్మరుసు ఆవ లించిన త్రేవులు లెక్కబెట్టగల ధీశాలి. అతని ధీగరిమ సామా న్యుల కందుబాటులో లేనిది. అతడు రాయల ఔన్నత్యానికి, ప్రజాదర ణకు రాజ్యవిస్తరణకు ముఖ్యకార కుడు. అతని ఆజ్ఞను రాయలు శిరసావహించేవాడు.

తిమ్మరుసు రహీంఖానుకు ఉరి శిక్ష విధించగూడదని ఆజ్ఞాపించాడు. అంతేగాదు. ఖైదునుండి అతనిని విడిపించడమే గాక, షడ్రసోపేత మైన భోజనాలతో అతనిని ఆద రించమన్నాడు. సభ దిగ్భ్రాంతి చెందింది. రాయలు నివ్వెరపో యాడు. అతనికేమీ పాలుపోలేదు. సభికు లొకరి ముఖా లొకరు ఆశ్చర్యంతో చూచుకోజొచ్చారు. అయినా, అప్పాజీ యుక్తి అందరెరి గినదే కావడంవల్ల, రాయలు గూడా మౌనం వహించాడు.

మూడేండ్లు రహీం జీవితం హాయిగా గడిచిపోయింది. ఇప్పు డతనిలో ఎక్కడలేని సౌకుమా ర్యము, దయ ఉద్భవించాయి. అత నికి రాయలు దైవంగా కనపడ్డాడు. అప్పాజీ, ఎండలో మ్రోడువోయిన తన జీవిత వృక్షానికి అమృతము పోసి, ఫలభరితం, సౌఖ్యభరితం గావించిన వాడిలా కన్పించాడు. ఇప్పు డతని శరీరం, రాయల కంకి తమైపోయింది. రాయల సౌఖ్యానికి

తన జీవితాన్ని ఎప్పుడైనా అర్పించ డానికి సంసిద్ధంగా ఉన్నాడు.

క్రీ. శ. 1520 ప్రాంతంలో, రాయచూరుదుర్గం, బిజాపూర్ సుల్తాన్ అధీనమందున్నది. అది కృష్ణ తుంగభద్ర నదుల నడుమ నెలకొనియున్న బలిష్ఠమగు కోట. ఆ సుల్తానుకు విజయనగర రాజులన్న మాత్సర్య మెక్కువ. అదను జూచి, వారిని పడగొట్టాలన్న ఉద్దేశం సుల్తాను మెదడులో ఎప్పుడూ మెదులుతూనే వుంది. అదను జూచి, సుల్తాను విజయనగరంపై యుద్ధం ప్రకటించాడు.

అప్పుడు విజయనగరం యుద్ధానికి సంసిద్ధంగా లేదు. ఏం చేయాలో గూడా రాయలకు స్ఫురించ లేదు. అప్పాజీతో సంప్రదించి, సంధి జేసుకోడమే ఉత్తమ మనుకున్నాడు రాయలు. అప్పాజీ గూడా దీర్ఘంగా ఆలోచించి, సంధే శ్రేయోదాయక మన్న నిర్ణయానికి వచ్చాడు. అప్పుడే సంధిలేఖ వ్రాయబడింది. తిమ్మరుసు, తన చతుర్విధోపాయాల నుపయోగించి, యోచించి ఆ లేఖను రహీం చేతికిచ్చి పంపాడు.

ప్రభువు తనపై చూపిన ఆదరణకు ప్రతిఫలం చూపవలసినసమయ మాసన్నమైనది రహీముకు. సంధిలేఖ తీసికొనిపోవడాని కతని కుత్సాహం మెండయ్యింది. రాజు శ్రేయస్సుకోసం, తన జీవితాన్నైనా అర్పించడానికి సంసిద్ధంగానున్నాడు రహీంఖాన్.

అది గాఢ నిశీథం. సుల్తాను తనకు నమ్మకమైనవారితో యుద్ధ విషయాలను గురించి మంతనాలు సలుపుతున్నాడు. ఆ సమయంలో, రహీం సంధిపత్రంతో నవాబును



రమేశ్ ఇంటికి
వెళ్లుటకు భయపడ్డాడు...
నా బట్టలను మాపుకొన్నాను, రామ్ మా అమ్మ నన్నిప్పుడు తిట్టుతుంది.
రమేశ్, నేను కూడాతరచుగా బట్టలను మాపుకొంటుంటాను గాని మా అమ్మ నన్నెప్పుడూ తిట్టదు, రావోయ్.
రామ్ ఇంటివద్ద:
ఎందుకతనేడుస్తున్నాడు?
అతడింటికి వెళ్లుటకు భయపడుచున్నాడు, ఎందుకంటే అతడు తన బట్టలను మాపుకొన్నాడు.
రమేశ్ ఇంటివద్ద:
మళ్లీ మురికిగా ఇంటి కొచ్చావు! నిన్నింక యెప్పుడూ ఆటకు బైటకు వెళ్లనీయను!
ఈ బాలుని తిట్టకమ్మా- పిల్లలందరూ ఆడునప్పుడు మురికిగా నగుదురు.
ప్రతిరోజూ వాడి బట్టలను ఉతుకుటకు చెమట పోదుస్తున్నాను వాటిని బాదుతూ అందుకవి చాలాత్వరగా చిరిగి పోతున్నవి.
అది నిజమే. బాదుట బట్టల పోగులను తెంచును మరి అందువల్లనే బట్టలుత్వరగా చిరిగి పోవును.
బాదబడినబట్ట పెద్దదిగా చూపబడినది
కాని మీరు సన్‌లైట్ సబ్బుతో ఉతికినప్పుడు బట్టలను బాదవక్కర్లేదు దాని సమృద్ధయిన నురగమురికి నంతటిని సులభంగాతొలగించును, ఆవిధంగా మీ బట్టలు చాలాకాలము మన్నును కూడ.
అది నిజం! త్వరగా నురగను గలిగించు సన్‌లైట్ సబ్బు బట్టలను బాదకుండానే సరిగ్గా తెల్లగాను మరియు కాంతివంతముగాను ఉతుకును. అంటే- బట్టలు చాలాకాలము మన్నును మరియు నాకు డబ్బు మిగులును.
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు
భారతదేశంలో తయారుచేయబడినది
బట్టలు చాలకాలము మన్నునట్లు చేయును

రహీంఖాన్ రాజభక్తి

ముఖాముఖిని సందర్శించాడు. సుల్తాను సంధిపత్రాన్ని చూస్తూనే ఆగ్రహోదగ్రుడై రాయల పిరికితనాన్ని తూలనాడుతూ, లేఖను చింపి నేలపైన విసిరిపారేశాడు. రాయలు అంత పిరికివాడని సుల్తాను కలలో గూడా అనుకోలేదు. సంధికి అధిక్షేపించడమే గాకుండా, రాయలను దూషించాడు గూడా! రాయల స్వరూపాన్ని దైవంకన్న మిన్నగా భావించి పూజిస్తున్న రహీం ఆ మాటలను సహించలేక సుల్తానును తన నిశితకరవాలానికి ఎరగావించాడు. అంతటితో కోప మాగక తన కరవాలంతో అక్కడున్న వారిపై ఒక్క ఝుళుపు ఝుళిపించాడు.

ఆ ఝుళుపుతో అక్కడున్న వారిని భయపిశాచ మావరించింది. ఒక్క క్షణమాత్రంలో ఆ విషయం సైన్యమంతటా పొక్కిపోయింది. నవాబుతో శత్రుసైన్య మొదుక్కొని, అతనిని యమపురి కంపినదన్న విషయం వాళ్ళకు రూఢై పోయింది. సారాయిమత్తులో పడి పొర్లుతున్న తురుష్క సైనికులు,

ఆ రాత్రి గాఢమైన మబ్బులో నిద్ర నుండి మేల్కొన్నవారు మేల్కొన్నట్లుగానే ఒకర్నొకరు నరుక్కోజొచ్చారు. కొంత సేపటిలో వాళ్ళ సైన్యం చాలావరకు నాశనమైపోయింది. ఇక శత్రువుల నెదుర్కోలేమన్న నిర్ణయంతో తురుష్క సైనికులు ఎవరికివారు, చెట్టుకొకడు పుట్టకొకడుగా పారిపోయారు. వాళ్ల చావుకు, ఓటమికి వాళ్ళే కారకులయ్యారు.

నవాబును నరుకుతూనే రహీం ఖాను, ఆ మందిరంలోని దీపాలను ఆర్పేశాడు. తన కత్తిని 'ఛళ్'మని ఒక్క ఝుళుపు ఝుళిపించాడు. అంతటితో అక్కడున్న మంత్రులు సైన్యాధిపతులు పారిపోయారు. ఇంక రహీం అక్కడుండడం తన ప్రాణానికే ముప్పని గ్రహించి, రహస్యంగా బయటబడి, దూరం నుండి యవనసైనికులు ఒకరినొకరు చంపుకోడం చూచి పొట్ట పగిలేటట్టు నవ్వుకున్నాడు. అతనికి మతంతోగాని, వంశంతో గాని, కులంతోగాని పనిలేదు. రాజభక్తి అన్నదే అతనికి అన్నిటికన్న మిన్న!

మరునాడు, రాయలు నిండు పేరోలగంలో ఆసీనుడై యున్నాడు. అందరు దీర్ఘంగా, యుద్ధవిషయం ఆలోచిస్తున్నారు. ఎవ్వరి నోటి నుండీ మాట పెగల్లేదు. తిమ్మరుసు మాత్రం తన సహజమైన ఉత్సాహాన్ని వీడలేదు. అతని ముఖం యథాప్రకారంగా కలకలలాడుతోంది. ఇంతలో రహీంఖాన్ సభలో ప్రవేశించాడు. అందరు అతనిపైపే కనురెప్ప వెయ్యకుండా చూస్తున్నారు. రాయలు, ఆత్రంతో రహీంను ఏదో అడగబోయాడు గాని, పైకి ఏమీ పలుకలేకపోయాడు.

తిమ్మరుసు రహీంతో సావధానంగా చర్చించాడు. జరిగిన విషయాన్ని ఆమూలాగ్రం గ్రహించాడు. అప్పట్లో సభలోని సంతోషము, ఉత్సాహము వర్ణింప నలవికానివి. అందరు రహీంఖాను రాజభక్తి ఎనలేనిదని కొనియాడారు. రాయలు స్వయంగా, తన కంఠాన్నలంకరించియున్న రత్నాలహారాన్ని తీసి రహీం మెడలో వేశాడు. అంతే గాదు, అతనిని ఒక దళానికి సైన్యాధిపతిగా గూడా నియమించాడు.

రాయల పరిపాలనలో మతభేదాలు, కులభేదాలుఏమాత్రమూ పాటించబడలేదు. శౌర్య ధైర్యాలున్నచో ఎవరైనా గొప్ప పదవుల నందవచ్చును.

రహీంఖాను రాజభక్తి అమోఘమైనది. క్రౌర్యమునకు నెలవుగనున్న అతనిమనస్సు, రాజాదరణచే మృదువైంది. తన కప్పజెప్పిన కర్తవ్యాన్ని బహుయుక్తితో, ధైర్యంతో నెరవేర్చాడు. రాజభక్తిపరుడు గావుననే, పెద్ద పదవి నందగల్గాడు. ★

అట్ట కోసం

వర్షం జోరుగా కురుస్తుంది. పాత శాల...రేకులు గప్పిన దగుట చేత వాన చినుకుల 'టప టప,' పాఠాలు చెప్పడానికి వీలులేకుండా చేసింది. అందుచేత, పిల్లలు వర్షాన్ని చూస్తూ సంతోషిస్తున్నారు. కాని, పంతులుగారి ధ్యాసమాత్రం యింటి మీదనే వుంది.

ఔను మరి...యీ వర్షానికి యిల్లంతా తడుస్తుంది. ఎన్ని బిందెలు పెట్టి నీరుపట్టినా లాభం లేదు. కాకపోయినా, కంత కొక బిందె తెచ్చి పెట్టగల సామర్థ్యం వుంటే తిరిగి యిల్లే కప్పించే పని. అందుచేతనే, పంతులుగారు...యింటిదగ్గర యిల్లాలు అనుభవించే యిక్కట్లనుగూర్చి ఆలోచిస్తూ కూర్చున్నారు.

ఇక...పిల్లలసంగతి సరే సరి! కాగితపు పడవలు నీళ్ళలో వదలాలని...గుడి ముందున్న గానుగ గుంటలోని నీళ్ళలో గంతులేయాలని...ఒకటేమిటి? ఎవరికి తోచినట్లు వారు కార్యక్రమాలు నిర్ణయించుకుంటున్నారు. కాని, కొట్టు సుబ్బయ్య కొడుకు 'రామం' మాత్రం...తను పుస్తకానికి వేసిన బొమ్మల అట్టను గురించి అప్పారావుకు అదేపనిగా చెబుతున్నాడు.

ఆ అట్ట చాలా అందంగా వుంది. అలాంటివే ఆ ఉదయం సినిమా వాళ్లు గోడలమీద అంటించి వెళ్లారు. కొట్టు సుబ్బయ్య, ఆ కాగితా లంటించే వాడికొక బీడీ ముక్కయిచ్చి, ఒక కాగితం పుచ్చుకున్నాడు. దాన్ని కొడుకిచ్చి పుస్తకానికి అట్ట వేసుకో మన్నాడు. ఈ విషయమే రామం అప్పారావుకి పదేపదే చెబుతున్నది.

అప్పారావు మనస్సులోనూ, "నాకూ యిలాంటి అట్ట దొరికితే బాగుండునే!" అన్న వూహా జనించింది. కాని, "ఎలా దొరుకుతుంది?" అన్న ప్రశ్న వెనువెంటనే నిలచింది.

దాన్ని గురించే ఆలోచించుకొంటూ పోతూవుంటే, లైబ్రరీ గోడమీద...వానకి తడిసి ఒకమూల లేచివున్న సినిమా కాగితం కనిపించింది. ఇంకేం! వెతకబోయిన తీగె కాలికి చుట్టుకున్నట్లయింది. అప్పారావు ఆనందానికి అంతు లేదు.

"రేపు బడిలో రామానికి నా సాహసకృత్యం పదే పదే చెప్పాలి. లేకుంటే...వాడు మహా తనొక్కడికే అట్ట, ఉన్నట్టుగా కులుకుతున్నాడు. వెధవ అట్ట!...కాదు, వెధవ అట్టకాదు. మంచి చక్కని

★ అలపర్తి వెంకట సుబ్బారావు ★

ఇంతలో వర్షపుజోరు తగ్గింది. అందువల్లనే ప్రక్కమేడలోని గోడ గడియారం కొట్టిన ఐదుగంటలూ పంతులుగారి చెవినిబడ్డాయ్! ఇంకేం! బడివదిలేశారు. పిల్లలు బయటికి పరుగుదీశారు.

2

చినుకులు పూర్తిగా తగ్గిపోయాయ్! చల్లగావుంది వాతావరణం. ఒక చేతిలో పలకా పుస్తకాలు పట్టుకొని, జారిపోతున్న లాగు మరో చేత్తో పైకి లాక్కొంటూ మెల్లిగా నడుస్తున్నాడు అప్పారావు.

దారిలో సుబ్బయ్య కొట్టును చూడగానే తిరిగీ అట్టవిషయం గుర్తొచ్చింది అప్పారావుకి. అలా బొమ్మల అట్ట. రేపు నా పుస్తకానికి మాత్రం వెయ్యనా?" అనుకున్నాడు అప్పారావు, ఇక ఆ సినిమా కాగితం తనకు లభించినట్టుగానే.

అసలు...అప్పుడే ఆ అట్ట చించాలనుకున్నాడు, లేకుంటే ఎవరైనా చించుకెళ్తారేమోనని. కాని, లైబ్రరీలో గడ్డంతాత కూర్చొని వున్నాడు. అతను...లైబ్రరీ వూడ్చి శుభ్రం చేస్తుంటాడు. ఊళ్లో అన్నం అడుక్కు తెచ్చుకొని పొట్ట నింపుకొంటూ వుంటాడు. "ఆ కాగితం చించడం గడ్డంతాత చూశాడంటే కర్రదీసుకు వెంటబడతాడు. ఎందుకో అంత కడుపుమంట? లైబ్రరీముందున్న వేప చెట్టున

పుల్లలు విరువనివ్వడు. గుడి గోడల మీాద ఎక్కి ఆడుకునే పిల్లలతో పోట్లాడతాడు. అన లన్నీ తన సొంతమైనట్టుగానే పోట్లాడుతాడు. పాడు తాత!...కాని, తాత అంటే భయం లేకపోతే, ఈపాటి కెవరో ఒకరు ఈ కాగితం చించుకెళ్లేవారే! చీకటి పడే టంతవరకు ఎవ్వరూ దాని జోలికి రాకుండా గడ్డంతాత కాపలా కాస్తాడు. ఇదీ ఒకిందుకు మంచిదే! చీకటిపడగానే వచ్చి ఆ కాగితం చించుకెళ్ళవచ్చు! పుస్తకానికి అట్టవేసుకోవచ్చు!!" ఇలా ఆలోచిస్తూ ఇంటికి వెళ్లాడు అప్పారావు.

ఒక వైపున ... గడ్డంతాత వున్నాడు గనుక ఫర్వాలేదులే అనుకొన్నాడు గాని...ఏమో ఎవరైనా చించుకెళ్తారేమో నన్న ఊహా మనస్సులో మెదలడంచేత, అమ్మపెట్టిన వేరుశెనగకాయలు జేబులో పోసుకొని, తిరిగి లైబ్రరీ దగ్గరికొచ్చి, అదేపనిగా గోడమీాది సినిమా కాగితంకేసి చూస్తూ నిలుచున్నాడు అప్పారావు.

వానకి తడిసి, వూడిపోయిన సినిమాకాగితం అడుగుభాగం గాలికి వూగుతూవుంటే, "అందుకో నన్నందుకో!" అని తననే పిలుస్తుందని భావించి, ఆనందంతో "చీకటిపడనివ్వు!" అని మనస్సులోనే సమాధానం చెప్పుకొని ఇంటికెళ్లాడు అప్పారావు.

3

చీకటి పడింది. స్నానంకూడ చెయ్యకుండా గబగబ నాలుగు మెతుకులు తిని, "అమ్మా! రామం గారింటికెళ్లి చదువుకుంటానే!" అని తల్లినడిగాడు అప్పారావు. అందుకామె అంగీకరించింది. ఒక లాంతరు వెలిగించి ఇచ్చింది.

పుస్తకాలు చేతబట్టుకొని, లాంతరు తీసుకొని లైబ్రరీ దగ్గరికొచ్చాడు సరాసరి అప్పారావు. ఇంకా ఆగోడమీాదికాగితం తనని రమ్మని పిలుస్తూనేవుంది. లైబ్రరీలోకి తొంగిచూశాడు. గడ్డంతాత కనిపించలేదు." ఊళ్లోకి వెళ్లివుంటాడు అన్నంకోసం! ఇంకేం! వచ్చేలోగానే పని పూర్తిచెయ్యాలి!" అనుకున్నాడు. గబగబ తాడిచెట్టు ఎక్కసాగాడు, పుస్తకాలు...లాంతరు లైబ్రరీ అరుగు మీాదపెట్టి.

వానకి తడిసి వుండటంచేత తాడిచెట్టు జారిపోతూవుంది. కాళ్ళకి పట్టు చిక్కడంలేదు. అదీగాక, కోతి కొమ్మచ్చెలాడేటప్పుడు గోడ్ల చావిట్లో స్తంబాలు పాకటంచేత నేనుగాని...తాటిచెట్లెక్కడం అప్పారావుకిఅలవాటులేదు. కాని... పట్టుదలతో ప్రయత్నిస్తున్నాడు. చేతులు గీరుకుపోతున్నాయ్!

ఎలాగైతేనేం! సినిమా కాగితానికి దగ్గరదాకా వెళ్లాడు. అప్పటికే కాళ్లు గజగజ వణుకుతున్నాయ్! మరోప్రక్క ... గడ్డంతాత వస్తాడేమోనని భయంభయంగా వుంది. అలానే చెట్టును కావలించుకొని నలువైపులా చూశాడు. ఎవ్వరూ రావడం లేదన్న నమ్మకం దొరికాక, ఒక చేత్తో చెట్టును వాటేసుకొని రెండవచేతిని గోడవైపునకు చాపాడు. కాని, ఫలితం లేకపోయింది.

గాలి వీచినప్పుడు కాగితం అందుబాటు కొచ్చినట్టుగానే వుంటుంది. ఏం లాభం? అందటం లేదు. అంత చల్లగాలిలో కూడ అప్పారావుకి చెమటలు పోశాయ్. విసుగుపుట్టింది!! దుఃఖం వచ్చింది!! కాని, పట్టుదల సడలిపోలేదు. ఆఖరుసారిగా ప్రయత్నించాలనుకున్నాడు. ఇంకొంచెం ముందుకు వంగాడు. సినిమా కాగితం చేతి కందింది. ఇంతలో ... గడ్డంతాత దగ్గుతూ లైబ్రరీ కొచ్చాడు. ఆ దగ్గు వినిపించగానే భయంతో పట్టుదప్పిన అప్పారావు, నేలమీాద పడి 'అమ్మా!' అని కేకవేశాడు. ఆ కేక విని గడ్డంతాత గబగబ పరుగెత్తుకొచ్చాడు. అప్పారావు గుప్పిట్లో...చినిగి వచ్చిన సినిమా కాగితం అలానే వుంది. అప్పారావుని యింటికి చేర్చాడు గడ్డంతాత.

4

ఆ మరునాడు గడ్డంతాత, అప్పారావుని చూడటానికి వెళ్లాడు. అప్పారావు మంచంమీాద పడుకొనివున్నాడు. కాలికి పట్టువేసి వుంది. "ఏంబాబూ! ఎలావుంది?" అని అడిగాడు గడ్డంతాత.

గడ్డంతాతని చూడగానే అప్పారావు భయపడసాగాడు. ఇంతలో

అప్పారావు తల్లివచ్చి, "కూర్చో బాబాయ్!" అంటూ ప్రక్కనున్న కుర్చీ చూపించింది.

గడ్డంతాత కూర్చొని, "ఇంకా నయం! లేచినవేళ మంచిది. లేకుంటే, ఆశ ఏమైనా వుందా?" అంటూ సంభాషణ మొదలెట్టాడు.

"ఔను బాబాయ్! దేవుడు చల్లగా చూశాడు. కాలుబెణికింది. తోమించి, చింతగింజలపట్టు వేశాను." అన్నది అప్పారావు తల్లి.

"ఫర్వాలేదులే అమ్మా! కాకపోయినా, ఆ వెధవ సినిమా కాగితం ఎందుకు కావలసివచ్చింది చెప్పమ్మా?" అంటూ అప్పారావు వైపు తిరిగి "ఏంబాబూ! ఎందుకు నీకాసినిమాకాగితం" అని అడిగాడు గడ్డంతాత.

"పుస్తకానికి అట్టకోసం" అన్నాడు మెల్లగా అప్పారావు.

"అట్టకోసం అంత సాహసం చెయ్యాలా? అట్టలు వేసుకోటానికి యిక ఏ కాగితాలూ పనికిరావా బాబూ? కాకపోయినా, ఆ సినిమా వాళ్ళు అంటించి వెళ్లిన కాగితాలను మనం చించివేయడం ఏం న్యాయం!..."

"ఏదో...పిల్లలుగదు బాబాయ్! తెలియనితనం!" అన్నది అప్పారావు తల్లి.

"పిల్లలేకాదమ్మాయ్! పెద్దలైనా యింతే యీ రోజుల్లో. మొన్న...బండికోటయ్య, సినిమా వాళ్లు చెట్టుకి కట్టుకున్న తడికను కుడితిగాబుపై మూతగా పనికొస్తుందని తెచ్చుకున్నాడు. ఇంకా కొంతమంది...బొమ్మలమీద పేడ ముద్దలు విసరడం...వికార స్వరూపాలు తయారుచెయ్యడం పనిగా పెట్టుకుంటారు. వీళ్లంతాగూడ తెలిసైనా తెలియకైనా సినిమావాళ్ళకి ద్రోహం చేస్తున్నవాళ్లే! సినిమా వాళ్ళు వాటికోసం ఎంతో డబ్బు ఖర్చుపెట్టాలిగదా! వీళ్ళు యిలా నాశనం చెయ్యడం ఏం న్యాయం?" అన్నాడు గడ్డం తాత బాధగా.

అప్పారావు శ్రద్ధగా ఆలకించాడు. ఆపైన దీర్ఘంగా ఆలోచించాడు. గడ్డంతాత చెప్పిన దానిలో చాలా సత్యం వుందనుకున్నాడు. తాననుకున్నట్టుగా గడ్డంతాత పాడు తాత కాదనుకున్నాడు. "ఒకరికి న్యాయం చెయ్యడంగాని, అన్యాయం జరుగుతూ వుంటే చూస్తూ మనకెందుకులే అని వూరుకోవటంగాని చేతగానివాడు గడ్డంతాత! అందుచేతనే; అన్నీ తన సొంతమైనట్టుగా సంచరిస్తాడు." అని గ్రహించాడు అప్పారావు.

రాజకీయ నాయకుడు రెండు గంటలసేపు ఉపన్యాసం ఇచ్చేసరికి గొంతుక బొంగురు పోయింది. ఇంకా మాట్లాడవలసిన విషయం రెండుగంటల పాటుగున ఉన్నది. కాస్త ఊపిరి పీల్చుకోడానికి ఆయన ఆగిన సమయంలో సభలోంచి ఒక శ్రోత కేక వేశాడు. "అయ్యా, ఈ పక్కనే గ్రామఫోన్ షాపు ఉంది. కొత్త పిన్ను తెప్పించమంటారా?" అని.


"అవును తాతా! నేను చేసినపని తప్పు! అందుకే దేవుడు నాకీశిక్ష విధించాడు. ఇక ఎప్పుడూ యిలాంటి పని చెయ్యను." అన్నాడు లెంపలేసుకొంటూ అప్పారావు.

"తప్పుచెయ్యని మానవుడులేడు బాబూ! కాని, ఆ తప్పును తెలుసుకున్నప్పుడు, దానినుంచి తప్పుకు తిరగడమే నీతి! ఇదిగో బాబూ! మంచి బొమ్మల అట్ట! ఇది లైబ్రరీకొచ్చే పత్రికలోనిది. నీకోసం తెచ్చాను. తీసుకో! నీకు అట్టలు కావలసివచ్చినపుడు నన్ను అడుగు. నేనిస్తాను. అంతేగాని, అట్టకోసం చెయ్యకు సాహసం!" అన్నాడు గడ్డంతాత అప్పారావు తల నిమురుతూ.

ఆప్యాయంగా అట్టను అందుకొని, "అలాగే తాతా!" అని, అప్పుడే తల్లిచేత పుస్తకం తెప్పించుకొని అట్టవేసి, పదేపదే చూసుకొంటూ మురిసిపోయాడు అప్పారావు. ★



HVM. 263-X52 TL



నేనిచ్చిన లెక్కలో తప్పుందా, లేదా?

నేను ఫోర్తుఫారం చదువుతున్నప్పుడు నాకూ శ్రీరామ్మూర్తికీ లెక్కల్లో చాలా పోటీగా వుండేది. ఎప్పుడూ ఫస్టుమార్కు వాడికే వెళ్ళిపోడం నాకు బహు కంటకప్రాయంగా ఉండేది. 'వాడికి మేష్టారి దగ్గిర ప్రైవేటూ. ఫస్టుమార్కు వాడిదిగాక మరెవరిది?' అనుకొని కాస్త తృప్తి పొందుతూ ఉండేవాణ్ణి. నేను ముందుగా పదిమాట్లు చేసుకొన్న లెక్క, మా యింట్లో పదిమాట్లు చెప్పించుకొని కంఠతా పెట్టిన లెక్క—ఎటువంటి లెక్క యిచ్చినా సరే వాడు నిమిషాలమీద ఊదేసేవాడు. మధ్యవాళ్లు నన్ను ఉడికించి నా కళ్ళనీళ్లు చూసి నవ్వుకొనేవారు. అదేం ఖర్మమో ఎప్పుడూ వాడిది ఫస్టుమార్కు, నాది సెకండు మార్కూను.

అవసరాల
రామకృష్ణరావు

పరిస్థితులు ఇలాఉండగా ఒకసారి మెడ్రాసులో చదువుకుంటున్న మా అన్నయ్య ఇంటికి వచ్చాడు. వాడు బియ్యేస్సీ ఆనర్సు మేథమెటిక్సు. ఏదైనా మంచి లెక్క యిమ్మని నే నడగ్గా తనకి రావంటే, నే నెక్కడ వేళాకోళం చేస్తానో అని ఎక్కడిదో ఒక యింగ్లీషుబుక్కుతీసి అందులో ఒక తమాషా లెక్క చెప్పేడు. ఇంకేం? శ్రీరామ్మూర్తిగాడిగర్వం ఈ దెబ్బతో సరి! అనుకున్నాను. డ్రిల్లు పిరియడ్‌లో యింకా మా శఠకోపం మేష్టారు రాలేదు. అటువంటి సందర్భంలో శ్రీరామ్మూర్తిగాడిని పదిమందిలోనూ పట్టుకుని యీ లెక్క చెయ్యగలవా అని ఛాలెంజి చేశాను. వాడు 'చెయ్యగలను, చెప్పు లెక్క' అన్నాడు. నేను మా అన్నయ్య చెప్పిన లెక్క యిలా చెప్పేను.

'పశువుల వ్యాపారి పద్మనాభాచారి ఒకసారి తన పశువుల మంద నంతటినీ పాలేరుమీద బల్లకట్టు దాటించి పడమటిలంక తీసుకు వెళ్ళేడు. పడమటిలంకలో పచ్చిక ఎక్కువవడం మూలాన్ని ఏడాదిపాటు అక్కడే ఉండిపోయాయి. ఏడాది అయేసరికి ఒక్కొక్క ఆవు ఒక్కొక్క దూడను పెట్టడం ఆచారికెంతో ముచ్చటేసింది. పశువు లన్నిటినీ బల్లకట్టుదాటించి పరమ సంతోషంతో ఇల్లు చేరుకున్నాడు'

'ఇందులో లెక్కేముంది?' అన్నాడు వెనకబెంచీ వెంకట్రావు. అందరూ గొల్లున నవ్వేరు. మానిటర్ బల్లగుద్ది 'సైలెన్సు, సైలెన్సు' అని అరచాడు. నాకు ఒళ్లుమండింది.

'తొందర పడకండోయ్ మరి! ముందుంది ముసళ్ల పండుగ, అప్పుడే అయిపోయిందా? పాలేరు మీద బల్లకట్టు 10,000 పౌన్ల బరువుకంటె మొయ్యలేదు. సరిగ్గా వీళ్ళ మొత్తం బరువూ అంతే!

* ఒక్కొక్క పశువు బరువు— } 1000 పౌన్లు

దూడ బరువు— 100 పౌన్లు

ఒక సారస్వత సభలో ఇద్దరు ప్రఖ్యాత రచయితలు ఒకరికొకరు పరిచయమయ్యారు. ఒకాయన అతిభాషి. రెండో ఆయన మితభాషి. అతిభాషి తాను ఎన్ని నవలలు, కథలు, పద్యాలు వ్రాసిందీ, ఏయే పరిస్థితుల్లో వ్రాసిందీ సుమారు ఒక గంట సేపు విశదంగా చెప్పుకొచ్చాడు. మితభాషికి మాట్లాడే అవకాశమే రాలేదు. చివరికి అతిభాషి సిగ్గుపడుతూ "క్షమించాలి. ఇంత సేపూ నా గురించే మాట్లాడుకొచ్చాను. మీరొక్కసారైనా మాట్లాడలేదు. ఇక మీ విషయం చెప్పండి. ఈ మధ్య నేను రాసిన నవల గురించి మీ అభిప్రాయమేమిటి?" అని అడిగాడు.

పద్మనాభాచారి బరువు=200 పౌన్లు

పద్మనాభాచారి తిరిగివచ్చినపుడు తీసుకువచ్చిన పశువు లెన్ని? దూడలెన్ని? కబుర్లు చెప్పడం కాదు. ఇప్పుడు చెప్పు చూదాం నీ తెలివి!' అన్నాను శ్రీరామ్మూర్తివైపు తిరిగి. వాడు అతి సీరియస్‌గా లెక్క చేసేస్తున్నాడు. 'మొత్తం బల్లకట్టుమీద చేరిన బరువు 10000 పౌన్లు. అందులో ఆచారి బరువు 200 పౌన్లూ తీసేస్తే మిగిలింది 9800 పౌన్లు. ఒక్కొక్క పశువుకి ఒక్కొక్క దూడ. అంటే పశువులెన్నో దూడలన్ని. ఆ సంఖ్య X అనుకుందాం' ఇలా చేసుకుపోతున్నాడు. పావుగంట సేపు క్లాసంతా నిశ్శబ్దంగా ఉంది.

'నువ్విచ్చిన లెక్క తప్పు. తెలదు' అన్నాడు శ్రీరామ్మూర్తి హఠాత్తుగా లేచి. అందరూ నావైపు తిరిగి పకపకా నవ్వేరు.

లెక్క ఎలా తప్పో శ్రీరామ్మూర్తి చెప్పగలడు. ఎలా తప్పు కాదో నేను చెప్పలేను. నేను కళ్ళనీళ్లు పెట్టుకుని యింటికి అన్నయ్యదగ్గిర కెళ్ళి

'ఎందుకూ మళ్ళీ సిగ్గులేక బియ్యేసీ ఆనర్సు వెలిగిస్తున్నావ్- తప్పు లెక్కలు యిచ్చుకుంటూ' అని జరిగిందంతా చెప్పి వాడిమీద విరుచుకుపడ్డాను.

'ఓరి వెర్రివెధవా! 'తలపాగా చుట్టలేక తల వంకర' అన్నట్టు నీకు లెక్క చెయ్యడం రాక నా మీద పడుస్తావేం? నువ్వు చెప్పిన లెక్కే మా రైటు. నీకు జవాబు చెప్పడం రాలేదు. నన్నని ఏం లాభం?'

అని నవ్వి ఆయన జవాబు చెప్పేడు.

నా లెక్కలో తప్పు లేదు.

పశువుల సంఖ్య తెగుతుంది.

అందులో ఉన్న కిటుకేమిటో నాకు తెలిసిపోయింది.

ఆ కిటుకేమిటో మీరు చెప్పగలరా?

గతవారం సమస్యకు జవాబు

మునీశ్వరుడు ఈ క్రిందివిధంగా చేస్తే యీ అయిదింటినీ అవతలొడ్డుకు చేర్చవచ్చు. పిల్లి చిలకని తినదనీ - నక్క ఒక్క చిలకని తప్ప ఎవర్నీ ఏమీ అనదనీ మాత్రం జ్ఞాపకం ఉంచుకోవాలి.

నక్క
కుక్క
పిల్లి
ఎలుక
చిలక

1. మునీశ్వరుడు మొదట పిల్లిని చిలకను అవతలొడ్డుకు తెచ్చి తను ఒక్కడూ వస్తాడు.

2. తరువాత కుక్కని ఎలుకని తీసుకువెడతాడు.

3. వచ్చేటప్పుడు పిల్లిని తనతో తీసుకువస్తాడు. అంటే అప్పుడు అవతలొడ్డున కుక్క, ఎలుక, చిలక ఉంటాయన్నమాట.

4. ఈసారి నక్కనూ పిల్లినీ తీసుకెళ్ళి అటు ఉంచేస్తాడు; సరిపోలేదూ?

★

న్యూఢిల్లీ లేఖ

(6- వ పేజీ తరువాయి)

అనారోగ్యమై పోయింది." కర్నల్ [illegible] చేసిన హెచ్చరిక ఇది: "ఢిల్లీ ప్రజలకు కావలసినదల్లా జాగా. ఇళ్లకు జాగా, [illegible] జాగా, ఆటపాటలకు జాగా, నడవడానికి జాగా, ఊళ్లకు జాగా" అనేది ఈనాటికీ ముఖ్యమైన హెచ్చరికగా మిగిలిపోయింది. క్షయ బాగా ప్రబలింది. 1927 లో డా॥ కె. యస్. [illegible] తన వార్షిక ఆరోగ్యనివేదికలో ఇలా వ్రాశారు: "ఢిల్లీలో ఒకే గది ఉన్న [illegible], ఒక్కొక్క దానిలో అనేకులు ఉండే వాటాలు చాలా ఎక్కువయిపోయాయి. వీటిలోకి గాలి వెలుతురూ జొరబడ వీలులేదు."

పాతఢిల్లీ జనాభా 1891 లో 1,89,648 నుండి 1951 లో 9,14,790 కి పెరిగింది. 60 వేల మందికోసం [illegible] కట్టించి ఈ నగరం ఈనాడు జనసమ్మర్దంలో భారతనగరాలన్నిటిలోకీ మొదటిదైంది. కొన్ని చోట్ల ఎకరానికి 1,196 మంది ఉంటున్నారు. వేలాది జనులు ఆరుబయట, మురికికాల్వల ప్రక్కన, రోడ్లప్రక్కన నిద్రపోతారు. ఇళ్లు పశువుల శాలలకంటె హీనంగా ఉంటాయి. గాలి, వెలుతురు, మురికి పోయే మురుగుదొడ్లు, శుభ్రజలం సరఫరా [illegible] [illegible] శూన్యం. కొన్ని ప్రాంతాలలో ఇరెండు మూడు అడుగుల లోతున కట్టి ఉన్నాయి. కొన్నిటికి [illegible] లేక [illegible], నగరపాలిక [illegible] [illegible].

★ సంపాదన ★

(25 వ పేజీ తరువాయి)

టండీ మెయిలు వచ్చే వేళయింది - అమ్మాయిని తీసుకురావద్దూ?"

"అయ్యో! నా తెలివి మండా?" అని మళ్ళా నెప్పుల్లో కాళ్ళు దూర్చి స్టేషనుకి తొందరగా నడక సాగించాడు.

ఆ రోజు మెయిలు సరిగ్గా టయిముకే వచ్చింది. అమ్మాయి దిగింది. ఒక్క అడుగు ముందుకు వెయ్యకుండా బళ్ళవాళ్ళు చుట్టుముట్టారు. ఒకడు పెట్టె, ఒకడు బెడ్డింగూ పట్టుకెళ్ళి రెండూ రెండు బళ్ళలోనూ పెట్టుకున్నారు. అవి దింపించేసి అప్పలస్వామి ఒంటెద్దు బండిమీద ఎక్కారు.

బండి మెల్లిగా నడుస్తోంది.

"అల్లాగ చిక్కిపోయావేం తల్లీ?"

"ఏం చెప్పను నాన్నా: అది మహానరకం: ఆయన పాపం: ప్రాణంగా చూసుకుంటారు కాని కుటుంబం పెద్దది-నాకు ఏదైనా కొంటే ఏదో విధంగా దెప్పటం మొదలెడతారు. ఆటవంటప్పుడు మందులు కూడా ఎక్కడ కొంటారు: ఏ నెలలోనైనా కాస్త మిగిలితే పెద్ద అప్పగారికీ, తల్లికీ సైనుతానులు కొనడానికే సరిపోతుంది."

"పెద్దయింట్లో పడేస్తే సుఖపడతా వనుకున్నాను తల్లీ! ఎలాగయినా ఆడవాళ్ళ బ్రతుకు లింతేనమ్మా" అని వచ్చే కంటినీరు తుడుచుకున్నాడు.

"రిటైరయ్యావట కదూ?"

"అవునమ్మా-ఇక మనవణ్ణి ఎత్తుకుని ఆడుకో వచ్చు."

అవీ, ఇవీ మాట్లాడుకుంటూంటే బండి ఇల్లు చేరింది-కౌసులమ్మగారు దిష్టి తీసింది-శ్యామలనక్కయ్యను యింట్లోకితీసుకెళ్ళింది. బండివాడికి డబ్బులిచ్చి-కోటు కౌసులమ్మగారి కందిస్తూ-"ఇందులో అయిదు వేల ఆరు వంద లుంటాయి. సరిగ్గా లెక్కచూసి జాగ్రత్త పెట్టు" అని కుర్చీలో కూర్చున్నాడు.

కౌసులమ్మగారికి కోటుజేబులో ఏమీ కనబడలేదు. జేబు ఖాళీ——

"డబ్బు ఎక్కడుంది?"

"ఆ జేబులో నే?"

"ఏదీ"

కోటు తీసుకొని-వెతికి "ఆ!" అన్నాడు.

అంతే. బుచ్చిరామయ్య నిశ్చేష్టుడయాడు.

"ఏంటినాన్నా:" కూతుళ్ళ గొంతులు కలిసి ప్రశ్నించాయి. శరీరంలో రక్తం ఒక్కసారిగా ప్రవహించటం ఆగినట్లయింది. కాళ్ళ క్రింద మట్టి క్రిందికి లోతుకి దిగినట్లయింది-వెంటనే అక్కడనించి పరుగెత్తడా తను డబ్బు మార్చిన తరువాత తిరిగిన చోట్లకి-డబ్బుపోయింది-నడుస్తున్నాడు. ఖంగారుగా రోడ్డుమీద-బుర్రలో ఆలోచనలు అంతకంటె వేగంగానడుస్తున్నాయి. "తనగతి ఏంకాను? కంట్రాకరు నర్సన్నకు ఇల్లు ఇచ్చేయవలసిందేనా. ఎక్కడ ఉంటాడూ-మిగతా బాకీలు ఎల్లాగ తీరుతాయి ?—ఒకటా—రెండా. అయిదు వేల ఆరువందల రూపాయలు—కష్టపడి సంపాదించినడబ్బు—అయిదు వేల ఆరువందల స్వేదబిందువులు-"ఇంతిలో సిటీబస్ దూసుకుపోయింది—వీసం వాసిలో తప్పిపోయింది. లేకపోతే చచ్చిపోయేవాడు. చచ్చిపోయినా బాగానే ఉండును. ఛస్తే-పెళ్ళాం బిడ్డలగతి ?— ఫుట్ పాత్ మీద నడవమని పోలీస్ హెచ్చరిక చేశాడు.-అంతా వెతికాడు-ఎక్కడా డబ్బులేదు.

పోనీ తను చచ్చినా-కొడుకు ప్రయోజకుడవుతాడు-ఇక చావటంకంటే గత్యంతరం కనిపించలేదు. వెళ్ళి రైలుపట్టాలమీద నడవటం మొదలెట్టాడు.

రైలు—ఇంజను హోరెత్తుతూ—వస్తూంది. ఇక ఫర్లాంగుదూరంలో వుందనగానే-గేదె ఒకటి అడ్డంగా పరుగెత్తి చక్రాల క్రింద పలగడం, రైలు ఆగడం-జనం అంతా చూడటం జరిగాయి. బుచ్చిరామయ్య కూడా చూశాడు. స్వరూపం లేకుండా మొండెం, తలా అటు ఇటూ పడిపోయాయి-రక్తం చిమ్మింది. కాళ్ళు గిల, గిలా కొట్టుకుంటోంది. ఆ దృశ్యం చూస్తే భయం వేసింది.

"ఛీ! తను యిల్లాంటి చావా కోరుకుంట: నాకు ఈ చావువద్దు:" అని ఇంటికి మరలి వచ్చాడు——.

గోపాలం యింటికి వచ్చేసరికి-యిల్లంతా గోలగా వుంది-చుట్టుప్రక్కల జనం అంతా పోగయ్యారు. సాయంత్రం బాకీకి వచ్చిన నర్సన్న సంతోషంగానే ఉన్నాడు-రెండు వేల పెట్టుబడికి పదివేల యిల్లు వస్తూంటే సంతోషంకాదూ-ఇది తెలుసుకున్న విశ్వనాథం పంచె ఎగకట్టుకుంటూ పరుగెత్తుకుంటూవచ్చి-"బాకీ ఎగవెయ్యటానికి-పద్ధతులు" అని అన్నాడు.-"ఇదేమిటి ? ఏమి జరిగింది"? ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"ఇంకేముంది నాయనా? అయిదు వేల ఆరువందలూ పోయాయి:" అంది కౌసులమ్మ దీర్ఘాలుతీస్తూ.

"ఇదిగో నాన్నా డబ్బు:" అని గోపాలం కవరిచ్చాడు.

"ఆఁ!" అది తవక్కె, తీసి చూశాడు అయిదు వేల ఆరువందలు. వెంటనే గోపాలాన్ని కౌగలించుకొని-"ఎక్కడ ఉంది?" అని అడిగాడు.

"ఇందాకా! నేను లైబ్రరీకి వెళ్తూంటే నన్ను కేకేశావు. అప్పుడు జేబులో పెట్టుకుంటూ, కవరు క్రింద పడేశావు. అదిచూసి-ఏవో కాగితాలు కాబోలు ఇంటికి వెళ్ళాక యివ్వవచ్చని అప్పుడు వెనక్కి పిలవలేను. తీరా చూద్దునుగదా డబ్బు!"

"నీ తరువాత వారసుడు కదూ! వాడికే దక్కింది, అది న్యాయమే?"అందిశ్యామల.

ఇంతలో పోస్ట్‌మేన్ వచ్చాడు - ఓ రిజిష్టరు కవరూ, ఒక కవరు ఇచ్చాడు. విప్పి చూసి - గెంతు గెంతాడు - "శ్యామలా! చూడు" అన్నాడు.

"ఆలిండియా రేడియోలో తన నాటకం ప్రసారంచేస్తున్నట్లు రిజిష్టర్ కవరులోనూ, తన స్నేహితురాలు తండ్రిచే నడపబడుతున్న "ఆంధ్ర - సంపద" అనే పత్రికకు సహాయ సంపాదకునిగా ఉండమని కోరుతు రెండవ కవరూ వచ్చింది. జీతం రెండువందల రూపాయలు."

"గోపాలం అందరికంటే ప్రయోజకుడు. నేను యిదివరకే అనుకున్నాను" అంది కౌసులమ్మ.

"డబ్బుతోపాటు, పేరు ప్రతిష్ఠలుకూడా సంపాదిస్తాడు గోపాలం!"

"గోపాలం కాదు" —— "సిరి" అంది శ్యామల.

"అదేమిటి?" తల్లీ, తండ్రీ, అక్క ప్రశ్నించారు.

"అది అన్నయ్య కలం పేరు నాన్నా" అంది శ్యామల.

"ఇద్దరూ తోడుగొంగలు - అందుకే కాబోలు - ఇద్దరూ పుస్తకాలు పడేసుకుని కూర్చుంటారు."

"ఏమోనమ్మా - నాకిదంతా అయోమయంగా ఉంది" పొరుగింటి రేడియోలో "కలయో - వైష్ణవమాయయో?" అని భాగవతారుగారి హరికథాప్రసారం జరుగుతోంది.

"హుఁ!! సంపాదనను గౌరవించే మనుష్యులు, ఆనందం వచ్చినా పటలేరు: విచారం వచ్చినా సహించలేరు ఏమిఁ మనుష్యులు? ఏమిఁ "లోకం" అనుకున్నాడు—గోపాలం, కాదు "ఆంధ్ర - సంపద" సంపాదకుడు "సిరి." ★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press. 6 & 7, Thambu Chetty Street. Madras-1. Editor S. Sambhu Prasad.



పద్మహస్త

—లినోకట్ చిత్రం: కె. భాగేశ్వరశర్మ.